# స్వామి ఓంకార్

# ఆత్మదర్శిని

(The Soul of Omkar)



అనువాదం:

**వింజమూరి రాధాకృష్ణ**

**2015**

**స్వామి ఓంకార్ ఆత్మదర్శిని**
(The Soul of Omkar)

**అనువాదం - వింజమూరి రాధాకృష్ణ**

**ప్రచురణ:**

శాంతి ఆశ్రమం - 533 446
ది మిషన్ ఆఫ్ పీస్
తోటపల్లి కొండలు - తూర్పుగోదావరి జిల్లా
ఆంధ్రప్రదేశ్, ఇండియా, ఫోన్: 7382009962

**సర్వహక్కులు:** శ్రీ శాంతి ఆశ్రమం, ఇండియా.

మొదటి ప్రచురణ: 3000 కాపీలు
జనవరి 2015
ముద్రణ: అభిసారిక ప్రెస్, సామర్లకోట
9246694228

ఈ పుస్తకం అనువాదకులు
శ్రీ వింజమూరి రాధాకృష్ణ,
వారి తల్లిదండ్రులు, ఆశ్రమ భక్తులు
**కీ॥శే॥ శ్రీమతి వింజమూరి అనసూయ**
**కీ॥శే॥ శ్రీ వింజమూరి అచ్యుత సూర్యనారాయణ**
గార్ల జ్ఞాపకార్థం సమర్పించిరి.

# విషయసూచిక

| | |
|---|---|
| **ఉపోద్ఘాతము** - పూజ్య జ్ఞానేశ్వరి | 4 |
| **తొలి పలుకు** - స్వామిని వినమ్రానంద | 5 |
| **అనువాదకుని ఆలాపన** - వింజమూరి రాధాకృష్ణ | 6 |
| **పరిచయము** - తెన్నేటి విశ్వనాథం | 8 |
| **ముందుమాట** - శ్రీ తారకం | 9 |
| **మీకు నేనిచ్చే మౌలిక సంపద** | 15 |
| **లోకశాంతి ప్రార్థన** | 18 |
| **లోకశాంతి ప్రార్థన - ఒక చిన్న వ్యాఖ్యానం** - శ్రీ ఆర్.ఎ. నారాయణ, సోదరి లలిత | 19 |
| **మన లక్ష్యము** - కుమారి జ్ఞానేశ్వరి | 21 |
| **శాంతి కేంద్రాలు** | 26 |
| **నిన్నెలా ఆరాధించను?** | 30 |
| **శాంతి సందేశము** | 33 |
| **అద్భుతం** | 37 |
| **నా మతము** | 40 |
| **నయాగరా జలపాత సందేశము** | 54 |
| **ఒకే ప్రపంచము** | 59 |
| **అత్యంత ధనవంతుడు** | 64 |
| **అత్యంత ఆరోగ్యవంతుడు** | 71 |
| **అత్యంత ఆనందమయుడు** | 80 |
| **సత్యమేవ జయతే** | 89 |
| **ఈ క్షణం - దివ్యమైన ప్రస్తుతం** | 96 |
| **స్వీయసంస్మరణ** | 99 |
| **80వ జన్మదిన సందేశము** | 103 |
| **81వ జన్మదిన సందేశము** | 109 |
| **84వ జన్మదిన సందేశము** | 112 |
| **ఆత్మస్వరూపులకొక సందేశము** | 115 |
| **శ్రీ శాంతి ఆశ్రమం - విశ్వశాంతి నిలయం** -సోదరి సుశీలాదేవి | 103 |

## ఉపోద్ఘాతము

పూజ్య శ్రీ స్వామిఓంకార్ వారి సందేశాలు, రచనల సారాంశమైన **"స్వామి ఓంకార్ ఆత్మ దర్శనం"** కి ఉపోద్ఘాతం వ్రాయడం ఒక మహద్భాగ్యంగా భావిస్తున్నాను. ఈ ఉత్తేజభరితమైన, సహాయకారి యైన పుస్తకాన్ని శాంతి ఆశ్రమంలోని భక్తులు 'పీస్' 'శాంతి' పత్రిక పాఠకులు, మిత్రులు చదివి తూర్పు పడమర దేశాలలోని దగ్గర దూరపు వారందరూ జాతి, మత భేదాలు లేకుండా శాంతి విస్తరణ చేస్తారని స్వామీజీ ఆశ.

ఈ పుస్తకంలో విజ్ఞానాత్మకమైన పరిచయం వ్రాసిన ఆశ్రమ అధ్యక్షులు శ్రీ తెన్నేటి విశ్వనాథం గార్కి 'ధర్మ సాధన' పత్రిక సంపాదకులు శ్రీ తారకం గారు 'ముందుమాట' వ్రాసినందుకు వారికి ధన్యవాదములు. ఈ పుస్తకం ద్వితీయ ప్రచురణకు సహకరించి పాఠకులు ఈ సందేశాలను భారతదేశంలోనూ, విదేశాలలోను పంచుకునేందుకు కృషిచేసిన పరమపూజ్య శ్రీ స్వామి చిదానందవారికి, స్వామి సహజానంద వారికి మా ఆత్మీయ ధన్యవాదములు. **'స్వామి ఓంకారాత్మ దర్శనం'** మరింత సమగ్రంగాను, సంపూర్ణంగాను, ఉత్తేజభరితంగానూ యుండుటకు గాను గతంలోనే ఆశ్రమం ప్రచురించిన 80వ, 81వ జన్మదిన సందేశాలు, తరువాత అన్ని మతముల సారముగా ఈయబడిన 84వ జన్మదిన వ్యక్తిగత సందేశము దీనిలో పొందుపర్చాము.

మూడవ ప్రచురణకు ఆర్థిక సహాయ మందించిన శ్రీ లావేటి అప్పలస్వామి, బెర్హంపూర్ వారికి మా కృతజ్ఞతలు.

**సూచన:** The Soul of Omkar అనే గ్రంథమును ఎంతో కృషి చేసి తెలుగు భాషలోకి అనువదించి, ఆర్థిక సహాయమును అందించి, ప్రచురించిన శ్రీ వింజమూరి రాధాకృష్ణ గారికి, శ్రీమతి యశోద గారికి, వీరి కుటుంబ సభ్యులకు శాంతి సౌభాగ్యములను పూజ్య శ్రీ ఓంకార్ స్వామీజీ వారు ప్రసాదించెదరు గాక!

మీ **జ్ఞానేశ్వరి**

శాంతి ఆశ్రమం
21-1-2015

## తొలి పలుకు

### Soul of Omkar

### స్వామి ఓంకార్ ఆత్మ దర్శిని

పరమపూజ్య శ్రీ స్వామిఓంకార్‌జీ మహరాజ్‌వారు అందించిన స్వామి ఓంకార్ ఆత్మదర్శనం (The Soul of Omkar) గురించి వ్రాయాలి అంటే సూర్యునకు నీరాజనము నిచ్చినట్టే!

"అశాంతస్య కుతః సుఖమ్" అని గీతాచార్యులవారు అన్నట్లు శాంతి లేని వారికి సుఖము ఎలా లభిస్తుంది!

ప్రతీ ప్రాణి సుఖమునే కోరుకుంటుంది. కావున విశ్వములో అందరు సుఖముగా ఉండాలి అంటే ఏమి చేయాలి అనే విషయాన్ని ఆత్మదర్శిని అనే గ్రంథము ద్వారా అనుభవపూర్వకముగా పూజ్య శ్రీ ఓంకార్ స్వామీజీవారు విశ్వమానవాళికి అందించారు. గ్రంథము యొక్క సారాంశము (ఉపనిషత్తుల సారాంశము) ఏమిటి అంటే విశ్వ ప్రేమ.

సర్వప్రాణులను తనతో సమానముగా చూచువాడు, అన్ని ప్రాణుల సుఖ దుఃఖములను తనవిగా భావించువానికి శాంతి లభిస్తుంది. ప్రేమ ఉన్నప్పుడే ఇతరుల కష్టసుఖములను తనవిగా భావించగలుగుతాడు. అటువంటివానికి శాంతి లభిస్తుంది. ( ఆ శాంతియే మతము, ఆనందము, భగవంతుడు) ఇదియే స్వామీజీ వారు ఆత్మదర్శనం ద్వారా విశ్వమానవాళికి అందించిన శాంతి సందేశము.

విశ్వములో అందరికి దివ్యప్రేమ అందించడానికి తగిన శక్తిని పూజ్య శ్రీ ఓంకార్ స్వామీజీవారు ప్రసాదించుగాక!

The Soul of Omkar అనే గ్రంథమును తెలుగు భాషలో అనువదించి, ప్రచురించిన శ్రీ వింజమూరి రాధాకృష్ణ గారికి, శ్రీమతి యశోద గారికి మా కృతజ్ఞతలు, ధన్యవాదములు.

ఇట్లు
భగవత్ సేవలో
**- స్వామిని వినమ్రానంద**

శాంతి ఆశ్రమం
21-1-2015

## అనువాదకుని ఆలాపన

శాంతివనంలో ప్రశాంత చిత్తంతో
ఆనాడు మామూలుగానే వెళ్ళా మాతాజీ దర్శనానికి
అయినా మరువలేను ఆ మధురక్షణాలు.
మలుపు తిప్పాయి నా జీవిత గమనాన్నే గమ్యం వైపు
చేతిలో ఉంచారు మాతాజీ చిన్న పుస్తకాన్ని
అన్నారు "దీన్ని అనువదించు తేటతెలుగులోకి"
ఆకాశమే ఉంచారా చేతిలో అన్నట్లుంది నీలంగా
ఆతృతగా, అలవోకగానే చూచా ఏమిటా! అని
అగుపించాయి ఆకాశంలోని అక్షరకాంతుల్లా
'THE SOUL OF OMKAR'
అమ్మో ! అయేనా ఈ పని 'నా' వల్ల
అయినా అన్నా, "అమ్మా ! అలాగే తప్పకుండా" అని
అన్నానే గానీ అంతా తేలికే, అయినా అయోమయం
అవగత మయేనా ఆ అంతరంగం అంత తేలిగ్గా
ఆయనే చూపడా దారి ఆర్ద్రతతో అర్థిస్తే అనుకున్నా
అంతలోనే మదిలో తళుక్కున మెరిశాయి
మహాకవి పోతన మధుర వాక్కులు
"పలికెడిది భాగవతమట... పలికించెడి విభుండు
రామభద్రుండట"
స్వామి పునీతం చేసిన పుడమి అమెరికాలోనే ఉన్నా.
'నేను' అన్నది మరిచా, ఓంకార్‌నే తలిచా.
ఇక కదిలింది కలం ఇది కలేమో అన్నట్లు
అయినా తప్పులు మానవనైజం – సహజం
ఉండవచ్చు అక్కడక్కడ 'నా' వల్ల



వినమ్రతతో మీ ముందుంచా తెలుగులో
'స్వామి ఓంకార్ ఆత్మదర్శిని'
అందుకోండి ఈ అమృతభాండాన్ని.
అందించే అవకాశమిచ్చిన అమ్మకు
శతసహస్ర కృతజ్ఞతాంజలులర్పిస్తూ...

శాంతి ఆశ్రమం,
ది. 21. 01. 2015

శాంతి ఆశ్రమ భక్తసేవకుడు,
**వింజమూరి రాధాకృష్ణ.**

## పరిచయము

'స్వామి ఓంకార్ ఆత్మదర్శిని' సుమారు ఒక అర్ధశాతాబ్ది కాలంలో పూజ్య శ్రీ స్వామి ఓంకారుల నుండి వెలువడిన రచనలు, సందేశములతో కూడిన చిన్న కూర్పు. ఇటువంటి ఒక చిన్నపుస్తకం స్వామీజీ వారి మనసు, ఆత్మ వ్యక్తీకరించే అనేక గ్రంథాలకు సమగ్ర ప్రతినిధి కాకపోవచ్చు.

అయిననూ ఈ చిన్న పుస్తకం పాఠకుని నేరుగా స్వామీజీ వారి మానస సరోవరంనకు తీసుకొని పోగలదు. ఒక సత్యాన్వేషి తాను ఎవరిని జీవితపు సుడిగుండాల నుండి దాటించదలిచాడో, ఆ పనిని విజయవంతంగా చెయ్యడానికి ఇది అమూల్యమైన జన్మదిన కానుక. అత్యుత్తమము, పవిత్రము అయిన ఈ లక్ష్యసాధనకు ఎవరూ తమ జీవితమును వదిలి పారిపోనక్కర్లేదు.

ఉత్తేజభరితమైన ఈ పుస్తకం సాధారణమైన మాటలతోనూ, ఆచరణ సాధ్యమైన అంశాలతోను కూడిన ఒక శాంతి గేయం. యువకులకూ వృద్ధులకూ జీవిత అల్లకల్లోల స్థితి నుండి ద్వేషంమధ్యన కూడా శాంతి, ప్రేమ సాధించుటకు ఈ పుస్తకం తప్పక సహాయ పడునని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను.

**తెన్నేటి విశ్వనాథం,**

అధ్యక్షులు, శాంతి ఆశ్రమం – ది మిషన్ ఆఫ్ పీస్



## ముందుమాట

# ఓంకారాత్మ దర్శనం

శాంతి ఆశ్రమ మహర్షి నుండి సహజంగా జాలువారిన రచనలు, ఉత్తేజభరితమైన వారి ప్రసంగాల నుండి కొన్నింటిని ఏర్చి–కూర్చి, వారి డబ్భై ఒకటవ జన్మదిన సందర్భంగా ప్రచురించే ప్రత్యేక సంచికకు ముందుమాట వ్రాయడం, నిజంగా ఒక మహద్భాగ్యం. ఇందుకు ప్రయత్నించడం తెలిసీ తెలియని సాహసానికి పూనుకోవడమేగాక ఒక పెద్ద బాధ్యతను శిరస్సు మీద పెట్టుకోవడం లాంటిది. నావంటి సామాన్య రచయిత స్వామీజీ వంటి మహాశక్తి యొక్క నిరంతర వసంత శోభను ఎలా తెలుపగలడు? ఓంకారస్వామి వారి హృదయపు లోతులలోకి, పాపపుజీవితమునకు అలవాటుపడి జీవించు నావంటి వ్యక్తి ఎలా వెళ్ళగలడు? కానీ నన్ను ఈ పని నిర్వహించమని ఆదేశించారు. స్వామిజీ దర్శనమో, లేక వారి రచనల అవగాహనో, లేక వారితో సన్నిహితముగా ఉండగలుగుటయో జరిగినప్పుడు మనలో ఏదో ఒక ఔన్నత్యము ఆవరించినట్లు అనిపిస్తుంది. వారి రచన వారి ఆత్మశక్తితో నింపబడి ఆదర్శ జీవితానికి ఒక మార్గంగాను, సందేశంగాను కనిపించును.

"స్వామి ఓంకార్ ఆత్మదర్శనం" ఒక ఆధ్యాత్మిక జీవనానికి ఉపగ్రహం వంటిది. అది నక్షత్రాలతో నిండిన ఆకాశం నుండి అన్ని కాలాలకు వర్తించే సూక్తుల నుండి, భిన్న భిన్న రూపాలనుండి, విశ్వకాంతులని అనంతంగా విరజిమ్ముతూ రోదశిలో పరిభ్రమిస్తోంది. ఆ మహానందమైన అనుభవాలను గ్రహించుటకు మనస్సుని లగ్నం చేసుకోవాలి. లేనిచో ఆ మధుర గానం వినిపించదు. అవి సులువుగా అనుగ్రహించడానికి వీలులేని స్వభావము కలిగున్నాయి. **"మౌనపు**

**ఘుడియలు''** నుంచి గ్రహించిన అంశములే ఈ ప్రచురణ. ఈ పుస్తకము సరియైన ప్రార్థనతో ప్రారంభించబడింది. ఆ ప్రార్థన నేడు ప్రపంచ ప్రసిద్ధమై శాంతి స్థాపనకు ఎంతో దోహదపడుతోంది. తరువాత ఒక ప్రఖ్యాత విద్వాంసుడిచేత, ఇద్దరు సోదరీమణులచేత చక్కగా వ్యాఖ్యానింపబడింది. సాధారణంగా స్వామిజీ సందేశాలు– వారు మనకీయగల మౌలిక వారసత్వపు భావసంపదతో ప్రారంభమౌతాయి. ఈ మౌలిక సంపద రాబోవు తరాల క్కూడా పంచబడుతోంది. అయితే అందుకు గాను వారి ఆదర్శ ప్రాయమైన శిష్యురాలు వానిలో అత్యుత్తమమైన వాటిని ఏరి, తగిన ప్రచారము ఇచ్చి, వానితో ఒక్కొక్క కథను కూర్చి, హారమును తయారు చేసుకొన్నారు. ఆమెయే కుమారి జ్ఞానేశ్వరి. ఆమె స్వామీజీ హృదయానికి, ఆత్మకు, వారసురాలు. ఓంకార స్వామి వారి బోధలవలన మంచి ఫలితములు పొంది, ఆమె అందరకూ ఒక సజీవ నిదర్శనమైనారు. అందుచే మానవజాతికి అంకితమైన స్వామిజీ వారి జీవన వేదమును అందరం అనుసరించవలసి ఉంది. ఇది రంగు రంగుల పూసలు కలిగిన జపమాలను తిప్పుచుండగా ఆశ్చర్యంగా అన్నిరంగులూ మాయమైపోయి తెలుపురంగే వ్యక్తమైనట్లుంటుంది.

ఈ గ్రంధమంతా "శాంతి" అనే మౌలిక భావనతో నిండి ఉంది. మానవుడు తనని సృష్టించిన సృష్టికర్తలో నిరంతరము లీనమై, ఇతరులలో శాంతి స్థాపనకు ప్రయత్నించే ముందు, తన లోనే శాంతిని సాధించవలసి ఉన్నది. తరతరాలుగా మానవుడు కోరుకుంటున్నది ఇదే. ఆల్‌బర్టు ష్వీడ్‌జర్ "మానవుడు మానవునితో సంబంధం కలిగి మానవుడిగానే ఉండాలి. ఇది ఆచరణలోకి వస్తే దేవుని రాజ్యము భూమిపై అవతరించినట్లే'' అంటారు. స్వామీజీ మనని "శాంతి కేంద్రమును బాహ్యము నుండి అంతరంగములోనికి మార్చుము. ప్రపంచమంతా దేనిని ఆచరించాలని నువ్వు కోరుకుంటున్నావో దానిని



ముందుగా నువ్వు ఆచరించడం అభ్యసించు" అంటారు. దీన్ని బాధ్యతతో మనకు మనమే తపించి గ్రహించాలి దుఃఖభరితమైన మానవునికి తగిన మందు స్వీయ సంస్కారమే.

"భగవదవగాహన పైనే మన అందరి శాంతి ఆధారపడి ఉంటుంది''. శాశ్వత విశ్వశాంతికి స్వామీజీ నిర్దేశించిందిదే. "మానవసేవయే దేవుని అత్యున్నతారాధన" . ఇదే విశ్వశాంతి సాధనకి మార్గం అని ఉపనిషత్ కాలంనాటి మన పూర్వీకుల సందేశాన్ని వారందించారు. మంచి పని ఆలస్యం చెయ్యకుండా భగవత్ సాన్నిధ్యంలో ఇప్పుడు ఇక్కడే చెయ్యి అని స్వామీజీ హెచ్చరించారు.

ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆయన దేవుని పాదాలపైబడి ఆ అద్భుత దర్శనాన్ని అనుభవించారు. తరువాత ఆయన కోటగిరి కొండలమీద సేకరించిన పూలగుత్తులను తన పాఠకులకు ఇచ్చారు. తన చుట్టూ ఉన్న ప్రకృతి పరమానంద భరితుణ్ణి చేస్తూ ఉండగా ఆయన ప్రపంచంలోకెల్లా ఐశ్వర్యవంతుణ్ణి నేనే అనే భావాన్ని కనుగొన్నాననే ఆనందంలో మునిగి పోయేవారు. తన సాధారణ పంథాలోనే ఆయన "ప్రపంచంలో కెల్లా ఐశ్వర్యవంతుడెవరు అంటే కోరికలు లేని నిస్వార్థపరుడు" అంటారు.

ధనవంతుడగుటకు స్వామీజీ మనకొక ఉపాయం చెప్పారు. "ఇచ్చి తీరవల్సిందే కావున నువ్వు జీవించియుండగానే ఇచ్చేయి". ఇదే విధంగా 'అందరికన్నా నేను ఆరోగ్యవంతుణ్ణి' అనే ఆయన భావన, వైద్యం పొందుతున్న సమయంలో కూడా తన ఆరోగ్య రహస్యాన్ని ఆయన "ఆత్మకథ"లో పాఠకులతో పంచుకున్నారు. "భగవంతుడు నా ప్రతీ అణువులో యున్నాడు" అంటారు.

'ఆరోగ్యం నీ జన్మహక్కు అనారోగ్యం కాదు' అని చిరునవ్వుతో అంటారాయన. చికిత్స పొందుతూ మంచంపై ఉండికూడా, బాధతో

గాకుండా, సందేశం ఇవ్వగలరాయన. ఆధ్యాత్మికానుభూతులు కలిగిన ఓంకార్ వంటి వారికే ఇది సాధ్యం.

ఇదే గాక "నేను అందరికన్నా ఎక్కువ ఆనందమయుడను" అని ఇతరులు అసూయ చెందేలా ఆయన అనగల్గడం సహజమే కదా! ఆయన అత్యంత ఐశ్వర్యవంతుడను, అత్యంత ఆరోగ్యవంతుడను అన్నప్పుడు ఆనందమయుడు గాక అందుకు భిన్నంగా ఎలా ఉంటారు?

"భగవంతునితో అనుసంధానము, ఐక్యతే ఆనందము" అని ఆయన మనకు, బీదా-బిక్కీ, వ్యాధిగ్రస్తులకు, దీనులకు చెప్తారు. సుఖముగా నుండవలె నన్నచో ఒక్కటే మార్గము. 'ఇతరుల గురించి ఆలోచింపుము. వారు నీ కన్నా భిన్నమైన జీవిత స్వరూపులు కారు. అందరం అభిన్నుడైన ఆ దైవ స్వరూప అంశములమే. అన్నింటినీ నీవు ప్రేమించు' అనే త్రివర్ణ పుష్పగుచ్ఛాన్ని నూతన సంవత్సర కానుకగా ఇచ్చారు. స్వామి రామానందతీర్థ అన్నట్లు స్వామీజీ ఎంతో సౌమ్యులు, నిరాడంబరులు, ఉన్నతులు, ఆయన తనదైన ప్రపంచంలో సర్వం దైవమయమే అనే భావనలో ఉంటారు.

స్వామి ఓంకార్‌ల నయాగర వింత సాక్షాత్కార అనుభూతిని పాఠకుల దృష్టికి గోచరింపజేసి, సోదరి సుశీలా దేవి తన మార్గదర్శక సేవా ప్రవృత్తిని ప్రదర్శించారు.

"ధారపోయుము, ధారపోయుము! నీకు గలదంతా ధార పోయుము- ఎందుకంటే దాచుకొనలేవు గనుక" ఆహా! ఎంతచక్కటి వాక్యము. చెవులలో ప్రతిధ్వనించే, గగుర్పాటు కలిగించే, అద్భుత వ్యక్తీకరణ. ఇదే అన్ని మతముల ఉనికిని, గమ్యమును కల్గియున్నది.

స్వామీజీ నలభై సంవత్సరముల క్రితం అమెరికాలో ఇచ్చిన అరుదైన ఉపన్యాసమును శ్రీజగదీష్ మహాశయుడు పాఠకుల స్మృతి పథానికి తేవడం జరిగింది. శాశ్వత విలువ గల ఆ ఉపన్యాసం



అప్పటికి-ఇప్పటికీ - ఎప్పటికీ నూతనము, సత్యముగానే నిల్చినది. "విశ్వప్రేమే నా మతం" అని ఆయన ధైర్యంగా ప్రకటించారు. ఆ వాక్యం నా హృదయాన్నే కాదు ఎవరి హృదయాన్నైనా ఆకర్షించి తీరును. నిజానికి అదే ఆయన అన్నట్టి "ధారపొయ్యి. ధారపొయ్యి" అనే దాతృత్వపు అంతర్వాహిని. ప్రత్యేకించి నాకేమతం లేదు. నాకు భిన్నంగా ఏ మతమూ లేదు అనే వారి వ్యక్తీకరణే వారిలోని గొప్పదనం. అవిచ్ఛిన్నమైన ఈ విశ్వప్రేమే మన నాయకులు సూచించే ఏక ప్రపంచ భావనకు పునాది. "**ఆకాశం** క్రింద ఉన్నదంతా వసుధైక కుటుంబం" అన్నదే స్వామీజీ భావాల సారాంశం. **"మతములో పుట్టుట మంచిదే కానీ మతాతీతంగా మరణించుట అంతకన్నా గొప్ప విషయం".**

స్వామీజీ ఇచ్చిన శాంతి ఉపదేశాలలో "సత్యమేవ జయతే" అనే అంశం కూడా ప్రధానమైనదే. యుద్ధ భయంతో ఏ చట్టము రక్షింపలేని స్థితిలో ఆవేదనతో ఆయన "ఎప్పటికీ మోసం చెయ్యక రక్షించు, భగవంతుని వైపే మొగ్గుము" అని ఘోషిస్తూ ప్రపంచమునకు చాటారు. ఈ మారణకాండ ఆపటానికి భగవంతుని పైనే నమ్మక ముంచి, ప్రతీ వ్యక్తిలోను, జాతి లోను, శాంతి సామరస్యాలను ప్రతిష్ఠింపజేయటానికి కృషిచెయ్యాలి. సత్యముపైనే నమ్మకముంచి, ఈ కల్లోలిత సమయంలో జాతి విపత్తును ఆపాలి. "పెను తుఫానుల మధ్యనే శాంతి స్థాపన" అనే వాక్యము వారి లక్ష్యంగా కనిపిస్తుంది. "భగవంతుని నాయకత్వాన్ని నెలకొల్పుము" అన్నదే ఆయన చేసే విన్నపము.

అతి సాధారణమైన సత్యాలను అందరకు అర్థమయ్యేలా తేలికైన ఉదాహరణలతో వేమన వలె చెప్పుటలో స్వామి ఓంకార్ అద్వితీయులు. ఆయనలో భావాడంబరత లేదు. మేధాప్రదర్శన లేకుండానే నిరంతరం భగవత్ సాక్షాత్కార అభ్యాసమే కనిపిస్తుంది. కాలాన్ని సహితం

అధిగమించి ఒక అసాధారణ వ్యక్తిగా ఇలా సత్యాన్ని ప్రతిధ్వనిస్తుంటే చాలామంది "అసలు ఈయన తత్వమేంటి" అని ప్రశ్నించడం మామూలే. ఈ తాత్విక యాత్రికుని తపన అనంతమైన, భిన్నత్వంలో ఏకత్వం సాధించుటకు చేసే ప్రయత్నమే ఆయన మతము, ఈ ప్రయత్నముతో మేళవింపబడి ఉంది. వైదిక దృష్టి, ఇస్లాం భావము, బైబిలు సందేశము, బౌద్ధ ఆచరణము, కలసి దివిని, భువిని ఒకటిగా చేయగలగడమే ఈ ఓంకారాత్మదర్శిని. సృష్టికర్తకు పూర్తిగా అధీనుడై, సృష్టిలోని పశు పక్ష్యాదులకు, మానవులకు, నిర్జీవమైనవాటికి ప్రకాశించే ప్రేమతో, సేవ చేయుటయే ఓంకార స్వామి యొక్క విశ్వజనీన సిద్ధాంతము. అందుచే దయా స్వభావుడైన మానవునకు తన దయను వ్యక్తీకరించుటకు ఎన్నో మార్గాలున్నాయి. వినమ్రతతో మనమంతా స్వామి ఓంకార్ తన భావాలను అనేక సంవత్సరాలు వెల్లడిస్తూ మానవుల శాంతి, భగవంతుని ప్రతిభ గుర్తింపబడటానికి నిశ్చలమైన శాంతితో ప్రార్థిద్దాము. భూమిపై శాంతి, సామరస్యము నెలకొల్పబడుగాక.

-శ్రీ తారకం



# మీకు నేనిచ్చే మౌలిక సంపద

కేవలం ఒక వ్యక్తి యొక్క లేక ఒక దేశం యొక్క అధికారానికే పరిమితం గాకుండ, తూర్పు, పడమర అనే బేధం లేకుండా, అసలు ప్రపంచంలోని, దేవుని సంతతి అయిన, "అందరి ప్రజలకు చెందినది" అంటూ ఒకటుంటే ఆహా! ఎంత అద్భుతంగా ఉంటుందది. దివ్యకాంతులు వెదజల్లే సూర్యుడు ఎవరి స్వంతము? కళ్ళుండి చూడగల్గిన అందరకూ, స్పర్శని అనుభవించగల్గిన అందరకూ ఆయన కాంతి, అనుభూతి స్వంతం కాదా? చల్లని చంద్రుడు ఎవరి సొత్తు? మిణుకు మిణకు మనే నక్షత్రాలకి అధిపతి ఎవరు? గాలి ఎవరి సొత్తు? అసలు అనంత ఆకాశానికి అధిపతి ఎవరు? ఇవన్నీ వారూ, వీరూ అనే తేడా లేకుండా అందరికీ చెందినవి కాదా?

అయ్యో! భూమిని, మహాసముద్రాలనీ ఈ జాబితాలో కలపలేకపోతున్నానే! ఎందుకంటే స్వార్థపరుడైన మానవుడు 'ఇది నాది' , 'అది నీది' అని సరిహద్దులతో భూమిని విభజించాడు. ఇక సముద్రాల విషయాలకొస్తే కూడా కొందరు హిందూ మహాసముద్రం ఇండియాదనీ, అట్లాంటిక్ మహాసముద్రం అమెరికాకి చెందినదని వాదిస్తారు. మానవుడు – అమాయక మానవుడు, ప్రపంచమంతటికీ చెందిన వానిని పొందడంలోగానీ, వానిపై గుత్తాదికారాన్ని కల్గి ఉండడంలో గానీ ఆనందం పొందుతాడు. ఈ ప్రపంచం ఎవరి స్వంతం? అది మానవుడిదా? దేవునిదా? నిశ్చయముగా మానవుడు, దేవుడు ఒకటే. ఈ సునిశితమైన క్లిష్టమైనఅంశాలని మేధావులైన తాత్వికుల పరిష్కారానికే వదిలేద్దాం.

ప్రియమైన స్నేహితులారా! మీరెవరైనా కావచ్చు, మీరెక్కడి వారైనా కానీయండి, అస్తికులో, నాస్తికులో ఎవరైనా కానీయండి,

నమ్మకస్తులో, అపనమ్మకస్తులో ఎవరైనా అవనీయండి, ఇదిగో 'శాంతి ధామం'. స్థాపకులు, సభ్యులు, పనివారు, ఇతరులు, అనే భేదం లేకుండా, శాంతి అన్వేషకులెవరైనా సరే భూమిపై అందరికీ సమానంగా చెందుతుంది. అలా అలోచిస్తేనే మీకు ఆనందంగా లేదూ– మీకూ భూమిపై విశ్రాంతి తీసుకొనడానికీ, శాంతిని పొందడానికీ తాత్కాలికం గానో శాశ్వతంగానో గడపడానికొక శాంతిధామం ఒకటుందని.

శాంతి మీ జన్మహక్కు. ప్రతి మానవుని వారసత్వ సంపద. ఎంత సొమ్ము వెచ్చించినా బయట కొనడానికి వీలులేంది ఇచట ఉచితంగా పొందవచ్చు. కానీ మీరు శాంతి కొరకు పరితపించేవారు మాత్రమే అయి ఉంటే, శాంతి కావాలని మీరు నిజంగా కోరుకుంటున్నారా? మీ ఆత్మ శాంతి కొరకే పరితపిస్తోందా? శాంతి కోసం మీరు పడే ఆవేదన దృఢంగానూ, గాఢంగానూ ఉందా? శాంతి లేని జీవితం ఏంటి? మానవాళికి నేనిచ్చే అమూల్య కానుక ఈ శాంతిధామం.

శాంతిని కోరే అన్ని మతాలవారికీ, అన్ని జాతులవారికీ అందరు భక్తులకూ హృదయపూర్వక స్వాగతం.. అందరితో పంచుకోగల్గింది ఒకటి నావద్ద ఉంది అనే భావన నన్ను ఆనంద పరవశుణ్ణి చేసింది. ఈ శాంతిధామాన్ని మీ అందరి సౌకర్యం కోసం, అందరి మేలు కోసం ఏర్పరచడానికి సాధనంగా నన్ను ఉపయోగించుకున్న ఆ భగవంతునికి నేను ఎంతో కృతజ్ఞుడను.

నా ప్రియమైన పాఠకుడా! ఇది నీకు నేనిచ్చే మౌలిక సంపద. నువ్వు నన్ను భౌతికంగా చూచావా లేదా? నాగురించి నీకు తెలుసా తెలీదా అనే భేదం లేదు, మనమంతా ఆ భగవంతుని సంతానమే అనే భావన ఒక్కటిచాలు. అందరం ఒకే మూలం నుండి పుట్టి, ఒకే భగవంతుని సమక్షంలో ఉండి, అవిచ్ఛిన్నమైన కాంతి, ఒకే సత్యమైన



దానిలో ఐక్యం అవుతాము, వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మూలం కావున ప్రియమిత్రమా! భక్తిమయమైన నీలో శాంతిని నెలకొల్పడానికి నాకు సహాయపడు. నీ హృదయంలోని శాంతి, నీ ఇంటిలో శాంతిని నింపగలదు. నీ ఇంటిలోని శాంతి, నీ చుట్టూయున్న సమాజానికి విస్తరిస్తుంది. సమాజం ఈ శాంతిని జాతికీ, తద్వారా ప్రపంచమంతటికీ విస్తరింపగలదు. శాంతికి అసలు మాటలే అవసరం లేదు. ఇదిగో నా మౌలిక సంపద. ఈ శాంతిధామాన్ని కానుకగా స్వీకరించు. రమ్ము, వచ్చి అనంతమైన శాంతిలో భాగం కమ్ము. ఆ రీతిగా మొత్తం ప్రపంచానికి ఒక వర ప్రసాదం కమ్ము. ఇది నీ సోదరుడైన ఓంకార్ యొక్క ప్రార్థన.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం ఓం ఓం

**నా మతం కేవలం మానవాళికి మాత్రమే**
**పరిమితమైనది కాదు.**

**– ఓంకార్**

# లోకశాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా !

మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామీ ! మా లోపల ప్రత్యణువునందును ఇమిడియుండి, మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకుశ్వాస, ప్రాణములకు ప్రాణము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైకమూర్తీ ! నిన్ను తెలిసికొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.

ఓ తేజోమయమూర్తీ ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల, ఈ విశ్వమందంతటను, అందరును నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక! ఓ సచ్చిదానంద స్వరూపా ! ప్రతిమానవ హృదయము నందును, నానాజాతి మధ్యస్థమునందును శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము. ఓ దేవా ! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు.

అన్ని మతములకు సమ్మతమైన ఈ ప్రార్థనను మీరు సదా భక్తితో స్మరించుచు లోక శాంతికి తోడ్పడెదరుగాక !



# లోకశాంతి ప్రార్థన

## ఒక చిన్న వ్యాఖ్యానం

శ్రీ స్వామి ఓంకార్‌జీకి ఉత్తేజభరితమైన స్ఫూర్తిగా ఉదయించి, అక్షరరూపం దాల్చిన మహామంత్రమే ఈ ప్రార్థన. మనశ్శాంతితో, ప్రశాంత స్థితిలో, భావ గర్భితమైన దాని అర్థాన్ని గ్రహించి, చిత్తశుద్ధిగా మననం చేస్తే ఇది తప్పక సమాధి యోగంలోకి తీసుకొని వెళ్ళగలదు. చిన్న మంచు బిందువు తాను ఒక మహాసముద్రపు అంతర్భాగమునే అని గుర్తించగలదు. అంతే కాదు ఈ మహత్తర సృష్టిలోని ఇతర మంచుబిందువులతో తనకుగల ఆత్మీయానుభూతినీ పొందగలదు. ఈ మంత్రం అన్ని మతముల, అన్ని శృతుల, అన్ని శాస్త్రముల సమాహారమై జ్ఞానానికి మూలవిద్య అయిన పరా విద్య సారమై యున్నది. సత్ చిత్ ఆనంద సారమే ఈ ప్రార్థన. ఈ మహామంత్రానుభవాన్ని రుచి చూచిన వారెవ్వరూ మరి దేనినీ కోరరు.

ఈ ప్రార్థన "పూజనీయమైన ఓ దివ్య స్వరూపా మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందనూ అంతటనూ నిండియున్న ఓ సర్వాంతర్యామీ..." అని ప్రారంభమౌతోంది. గడ్డిపోచ కూడా దేవుడు లేనిదే లేదు. విశ్వమంతా భగవంతునితో నిండివుంది. అది సంపూర్ణం – పూర్తి సంపూర్ణం కన్నా సంపూర్ణమైనది. దాన్నుంచి దేన్ని తీసివేసినా అది సంపూర్ణమే. ఈ మహత్తరశక్తితోనే మన మంతా ఉన్నాం, కదులుతున్నాం.

క్రీస్తు ప్రభువు "నేనూ నా తండ్రీ ఒకరే, " అంటారు. భగవాన్ శ్రీ కృష్ణ కూడా "నువ్వు ఏ విధంగా నా వద్దకు వచ్చినా నిన్నా విధంగానే కలుసుకుంటాను" అంటారు. ఎందుకంటే భగవంతుడూ, నువ్వూ, మనందరం ఒకటే... బుద్ధుడు, ముస్లిం మహానిర్వాణం గురించి

ప్రస్తావిస్తారు. ముస్లింలు అల్లాయే అన్నింటికి మూలము, ఆధారము అంటారు. పూజనీయమైన ఆ దివ్య స్వరూపాన్ని ఇప్పుడు ఇక్కడే పొందాలి అనేదే ఈ ప్రార్థనలోని అద్భుతమైన భావం. భగవదైక్యంలో నిన్న , నేడు, రేపు అనే భావానికి తావులేదు.

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా! అన్నప్పుడు – ఆదిమధ్యాంత రహితుడు అంతటా నిండి ఉన్నాడు. అని తెలుస్తుంది. భగవంతుడు సర్వవ్యాప్తుడైనప్పుడు నేను వేరు అనే పరిమిత భావన గానీ తగవులు గానీ యుండే అవకాశంలేదు. అందుచేతనే వ్యక్తుల మధ్య సమాజాలు, జాతులు, దేశాల మధ్య శాంతి సుహృద్భావాలు నెలకొని సౌభ్రాతృత్వం ఒక ఆశయంగా గాక ప్రకృతి సిద్ధంగా నెలకొంటుంది.

ఎంత అద్భుతమైన ప్రార్థన, దీనికి శ్రీ స్వామి ఓంకార్‌కి, శాంతి ఆశ్రమానికీ ఎంతో ఋణపడి ఉన్నాం. ఈ ప్రార్థన ప్రపంచమంతా నిండి ప్రతీ మానవ హృదయాన్నుండి ప్రతిధ్వనించి, ప్రపంచమంతా ఉన్నత ఆధ్యాత్మిక భావాలతోనింపబడి మొత్తం ప్రపంచ రూపాన్నే మార్చుగాక!

అప్పుడు ద్వేషము, యుద్ధాలు అంతరించి మానవాళి అంతులేని ఉన్నత మానవాళిగా రూపుదిద్దుకుంటుంది. మనలోని ప్రతీ వ్యక్తీ శాంతి ప్రార్థనలోని లోతైన ఆంతర్యాన్ని గ్రహించి, ఎల్లప్పుడు గాక పోయినా, కనీసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ప్రార్థన చేసి, భూమిని, శాంతి స్థావరమైన భూతల స్వర్గంగా చేయుదురుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

**శ్రీ ఆర్.ఎ.నారాయణ,** ఎమ్.ఎ.బి.ఎల్,
**సోదరి లలిత,** కోటగిరి,
వెరా స్లాటెర్రీ – ఇంగ్లాండు.



# మన లక్ష్యము

వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మార్గము. అందుచే మొదట దానిని నీ హృదయంలో స్థాపించు. తరువాత దానిని నీ ఇంటిలో వ్యాపింపచెయ్యి. నీ చుట్టూ ఉన్న సమాజానికి ప్రసరింప చెయ్యి. అలా పవిత్రమైన, ఆదర్శవంతమైన నీ ప్రశాంత జీవితం ద్వారా శాంతి విశ్వమంతా వ్యాపించు వరకూ ఒక హృదయము నుండి మరొక హృదయానికి ప్రసరించుగాక.

స్వామీజీ నుండి నేను గ్రహించినదేమి?

1. దైవమే ప్రేమ, ప్రేమే దైవం. ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ దైవముంటాడని నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

2. మతము – జీవితము అనేవి రెండుగా లేవు, అవి ఒక్కటే. అందుచేత నేను కనులు మూసుకొని ధ్యానంలో ఉన్నా, లేక కళ్ళు తెరచి సందేశములు టైపు చేయడం గానీ లేక ఏ ఇతర పని చేస్తున్నా భగవత్ సాక్షాత్కారం సమానంగా ఒకేరీతిగా ఉంటుందనీ నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

3. పనియే ఆరాధన. నేను చేసే ప్రతీపనీ భగవంతుని సేవ, దైవారాధనలో భాగమే. అని నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

4. కాలము యొక్క విలువను నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను. ప్రతీక్షణం చాలావిలువైంది. క్షణాలను వృధాచేయువాడు తన జీవితమునంతా వృధాచేయుచున్నట్లే. కోల్పోయిన దేన్నయినా తిరిగి సంపాదించు కోవచ్చు, కానీ అమూల్యమైన, పవిత్రము అయిన కాలాన్ని పోగొట్టుకుంటే తిరిగి దాన్ని సంపాదించలేము.

5. సోమరితనం అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. సోమరి తనకి

తాను అపకారం చేసుకోవడమే కాదు ఇతరులకూ అపకారం చేస్తున్నాడు. నిజంగానే, ఎవరైతే సోమరిగా ఉండి కనీసం తన ఆహారం కోసం కూడా ఏ పనీ చేయకుండా ఉంటారో వారికి  ఆహారం తినే హక్కులేదు అని స్వామీజీ నుండి గ్రహించాను.

6. పరిశుభ్రతయే దైవము. లోన, వెలుపలా కూడా ఎవరు పరిశుభ్రంగా ఉంటారో వారే భగవంతుని నిజమైన సంతానమని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

7. స్వామీజీ నుండి నేను గ్రహించిన మరొక అంశము పవిత్రతయే. అది ఆధ్యాత్మిక జీవితమునకు పునాది.  మనసా, వాచా, కర్మణా ఎవరు పవిత్రులో వారు నిజంగా ధన్యులు.

8. శ్వాసించేటప్పుడు కూడా ప్రతీ ఉచ్ఛ్వాసం లోనూ నిశ్వాసం లోనూ కూడా శాంతినే నింపాలని శ్రీ స్వామీజీ నుండి తెలుసుకున్నాను. అతి తేలికైన సహజమైన ప్రాణాయామ ప్రక్రియ నాడీశుద్ధి చేసి చివరకు నిస్ప్రాణంగా యున్న కుండలీని శక్తిని మేల్కొల్పును.  దీని వల్లనే భగవంతుని చైతన్యానుభూతిని పొందవచ్చు.  కష్టంతోకూడిన, రహస్య, అద్భుత మంత్రాల వంటి అపాయకరమగు, ప్రమాదకరమగు ఇతరమైన వానితో పని లేదు.  ముఖ్యంగా అలాంటివానికి తగిన శిక్షణ అవసరం.

9. ఏసు క్రీస్తు అనుసరించిన మార్గం "నీవలె నీ పొరుగువానిని ప్రేమించుము", "అంతా బ్రహ్మమయమే అన్నింటిలోనూ భగవంతునే దర్శించుము" అను కృష్ణుని ప్రత్యక్ష మార్గాన్ని దయాభావంతో కూడి, ప్రాణికోటినంతటిని కరుణామయభావంతో గౌరవించుట నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

10. స్వామీజీ  నుండి సర్వమత సమానత్వమును, విశ్వత్వమును గ్రహించితిని.  ప్రతీ మతములోని అవతారపురుషులను, ప్రవక్తలను మహానుభావులను గౌరవించి, పూజించుట, అన్ని మతములలోని



సారాంశమును ఆకళింపచేసుకొని, అందలి మంచిని గ్రహించి వివిధ మతములను గానీ, మత ప్రవక్తలనుగానీ పోల్చిచూచుట తగనిపని అని స్వామిజీ నుండి తెలుసుకున్నాను.

11. ఒక నూతిలోని చిరుకప్పవలె అజ్ఞానముతో ఉండక, విశాల దృక్పధము, విజ్ఞతతో విశాల ప్రపంచమునే స్వగృహంగా భావించి అందలి ప్రజలందరినీ నా సోదర, సోదరీ మణులుగా గ్రహించవలెనని స్వామీజీ నుండి తెలుసుకొంటిని.  అందరినీ ప్రేమతో ఎట్టి ప్రతిఫలమూ కాంక్షించక సేవ చేయువారు ఎంతటి ధన్యులు, ఇదియే అత్యున్నతమైన నా మతము.

12. అప్పుడప్పుడు అనిగాక దైవానుభూతిని ప్రతీక్షణమూ దైనందిన జీవితంలో పొందగల్గు అభ్యాసంచేయడం  భగవదనుభూతి పొందుటకు రహస్యం అని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

13. బాహ్యమైన బోధలు, పెద్ద పెద్ద నామరూపాలపై ఆధారపడక ఆత్మ విశ్వాసంతో ఆంతరంగిక దివ్యజ్యోతి ఘనతపై ఆధారపడుట మేలు అని స్వామీజీ నుండి తెలుసుకొంటిని.

14. మాటలాడుట రజతమైతే, మౌనము స్వర్ణము వంటిది, అని స్వామీజీ నుండి తెల్సుకున్నాను.  మౌనమే మానవునకు భూషణం. అది ఆధ్యాత్మిక జీవితపు మకుటం. అనవసరమైన మాటలు అపోహలకు, సమస్యలకు దారితీయును.  మౌనం నిజమైన శాంతికి దోహదపడి ఆత్మ జ్ఞానాన్ని కల్గించగలదు.

15. సమస్యలు, చికాకులు భూమిపై పడే దేముని వర్షపు జల్లులు. ఏ సమస్యనీ అది మనలను ఇబ్బంది పెట్టే వరకూ దానితో సతమతమగుట అనవసరం అని స్వామీజీ నుండి గ్రహించాను.

16. దేవుని మరచుటే మరణము.  ఆయన ఎరుకను ఎల్లప్పుడూ

అనుభవించుటయే దివ్యానుభూతితో కూడిన జీవితం అని స్వామీజీ నుండి గ్రహించితిని.

17. ప్రపంచంలో జీవితంలో ఎదురౌతున్న సమస్యలు, పరీక్షలు వచ్చే పోయే మేఘాలని గ్రహించి దయ, సహనముతో ఎదుర్కొనాలి. భూమిపై జీవితం గులాబిపూల పాన్పుకాదు. తియ్యని పాయసము కాదు. విజ్ఞానానికి శోధనలుంటాయి అని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

18. ధనం పోతే, ఏమీ పోయినట్లు కాదు. ఆరోగ్యం పాడయినచో కొంత పోయినట్లు కానీ ప్రవర్తన చెడిపోతే సర్వమూ పోయినట్లే. నిజంగానే సత్శీలమే ఆధ్యాత్మిక జీవితపు ఆత్మగా అలరారుచున్నది. అనునది స్వామీజీ నుండి గ్రహించితిని.

19. అంతర్గతమైన, ఆత్మయే సత్యము, నిత్య సంపూర్ణము, బయట నుండి తెలుసుకోవలసిన దేదీలేదు. అసలు వ్యక్తి చెయ్యవలసింది, తాను నేర్చుకొన్నది వదలి వేయుటే, నిజమైన శాంతి పుస్తకాలు వల్లెవేయడం వల్లరాదు. ప్రతీ దానిలో ఉన్న ద్వంద్వతాన్ని అధిగమించగల్గిన వాడే నిజమైన శాంతిని పొందగలడు. ప్రారంభదశలో ఉపయోగకరముగా కనిపించిన పుస్తకాలే, అత్యున్నత స్థితిలోని ఋషులు, వ్యర్థమైనవిగా పరిగణిస్తారు. అని స్వామీజీ నుండి గ్రహించాను.

20. జీవితమనే నదిని దాటుటకు పడవ అవసరమే, కానీ నది దాటాక శరీరం అనే ఈ పడవని పట్టుకు వ్రేలాడడమెందుకు? భగవంతుడే మహాసాగరం జీవితం ఒక నది. శరీరం ఒక పడవవంటిదని స్వామీజీ నుండి గ్రహించాను.

21. నిస్సారమైన ఎముకలవంటి ఇతరుల పలుకులు చర్విత చరణం చెయ్యడం, ప్రపంచంలోని ఆవులను లెక్కించడం అనవసరం. అంతకంటే కొంచెం అయినా పాలిచ్చే మనదనే ఆవుండడం మేలు.



దీర్ఘకాలంలో స్వాను భవమే మనకు ఉపయోగపడేది.

స్వానుభవం పొందిన మహనీయులే భూమాతకు వర ప్రసాదితులు. వారే ప్రపంచపు మార్గదర్శకులు. వారే మనలను చీకటుల నుండి వెలుగుకి, అసత్యము నుండి సత్యమునకు నశించే దాని నుండి అమృతత్వమునకు నడిపించగలరు.

భగవదనుభూతి అనుభవించుచున్న భూమిపైగల అట్టి మహనీయులకు మనం నమస్కరింతుముగాక.


లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం ఓం ఓం

**కుమారి జ్ఞానేశ్వరి.**

***నామ రూపాలకు పరిమితమైన దేనిలోనైనా ఎప్పుడు నిజమైన ఆనందం అనుభవించలేం.***

**– ఓంకార్**



# శాంతి కేంద్రాలు

మౌనంగా ఉన్న ఈ రోజుల్లో ఒక కోరిక, గతంలో నాలో ఎన్నడూ లేనంతగా, బలంగా కలిగింది. తూర్పు – పడమర – అసలు ప్రపంచమంతా, నేల మీద వారూ, వీరూ అనే తేడా లేకుండా ప్రతీ మానవ హృదయం లోనూ శాంతి కేంద్రాలు నెలకొల్పాలని, అసలు అంతరంగంలో శాంతికేంద్రాలు నెలకొల్పడమే చాలా తేలికైంది. కానీ దీనికి మనిషి తననే మూల్యంగా చెల్లించాలి. అపుడు కుల, తెగ, వర్ణ, జాతి, మొ॥ భేదాలేవీ లేకుండా అంతరంగం నుండే శాంతి ధారలు భగవంతుని సంతతివైపు ప్రవహిస్తాయి..

అంతరంగంలో ఈ శాంతికేంద్రాలని నెలకొల్పడానికి తప్పనిసరిగా కావలసిన దేమిటి? – అనే దాన్ని చూద్దాం.



1. మొట్టమొదటిగా మనం మానవ జీవిత పరమార్థకతను తెలుసుకోవడం. మరణానికి పిలుపు రాక ముందే తన శక్తినంతా కూడగట్టి దైవాన్ని మానసికంగా తెలుసుకోవాలి అనే కోరిక, తపన, ప్రగాఢ వాంఛలతో పరితపించాలి.

2. అందుకు ప్రతీరోజూ క్రమం తప్పకుండా కనీసం పదిహేను నిముషాలైనా మీ మత సంబంధ పవిత్ర గ్రంధాలను అది – గీత కావచ్చు, బైబిలు కావచ్చు మరేదైనా కావచ్చు చదవాలి. ఇది ఆధ్యాత్మిక అభివృద్ధికి తప్పక తోడ్పడుతుంది.

3. తేలికైన లోకశాంతి ప్రార్థనను తప్పకుండా కనీసం రోజులో రెండుసార్లయినా – ఉదయం లేవగానే ఒకసారి, రాత్రి పడుకునేముందు మరొకసారి చేయాలి. ఈ ప్రార్థన రోజులో పనిలో ఉన్నప్పుడైనా, విశ్రాంతిలోనైనా ఎన్ని ఎక్కువసార్లు చేస్తే అంత ఎక్కువ ఆనందం, ఆంతరంగిక బలం, శాంతి కలుగుతాయి.

4. పరోపకారార్థమిదం శరీరం అని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇతరులకు సేవ చెయ్యడానికే ఈ భౌతిక శరీరం ఉంది. అందుచేత ఆ భగవంతుని సంతతి అయిన అందరూ శాంతి ఒక హృదయం నుండి ఒక హృదయానికి వ్యాపించేలా చెయ్యాలి. ఇది శాంతి ప్రార్థన చేయడం ద్వారా వీలుపడుతుంది. ఎందుకంటే, దేవుని దివ్య సాక్షాత్కారం, ప్రార్థన చేసేటప్పుడు అనుభవంలోకి వస్తుంది.

5. వ్యక్తిశాంతే విశ్వశాంతికి దారి తీస్తుంది. కాబట్టి ముందుగా హృదయాల్లో శాంతిని నెలకొల్పుకోవాలి. పిదప దానిని క్రమంగా ప్రపంచ శాంతికి, తీసుకెళ్ళడానికిమనవంతు కృషిని, నిజంగా చేస్తున్నాం అనే భావనలో ఉంటాం.

6. శాంతి కేంద్రంలో ఎవరూ కూడా బాహ్యం నుంచి గానీ, లేక ఎవరో పరిమితమైన గురువు నుంచోగానీ ఏదో తెల్సుకోవాలని ఎలాంటి

ఆందోళనపడక్కరలేదు. ఎందుకంటే అంతా కూడా నిశ్చలమైన, నిర్మలమైన అంకిత భావంతో నిండిన హృదయంలోనే ఉంది. ఇక్కడ మనిషికి కావల్సిందల్లా, తాను ఆర్జించాననుకుంటున్న బాహ్య జ్ఞానాన్ని, బయట నేర్చుకునదాన్ని, పూర్తిగా మర్చిపోవడమే. శాంతి కేంద్రం యొక్క ప్రధాన సందేశం ఎప్పుడూ స్వావలంబనగా ఉండడమే, ఆది, మధ్య, అంతంలో బయట వానిపై నమ్మకం, ఆధారం లేకుండడమే.

7. భయము, అశాంతి, ద్వేషము, యుద్ధము అనే భావాలని అధిగమించేలా ఉండాలి. లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

ప్రియ పాఠకులారా! మొదట మీ పవిత్ర హృదయాల్లో శాంతిని నింపండి. పిదప మీ ఇంట్లోను, మీరున్న సమాజంలోనూ, మీ దేశమంతానూ, ఇంకా ప్రపంచమంతా శాంతిని నెలకొల్పడానికి తోడ్పడతారా? మంచి ఏదైనా ఇంటి నుండే కదా మొదలవ్వాలి. శాంతి ఇప్పుడే భక్తితో పరితపించే మీ హృదయాల్లో ప్రారంభమగుగాక. అలాగే మీ ఇంటినుండి శాంతి విస్తరించి, దగ్గర దూరం అనే తేడా లేకుండా మీరు, ఎక్కడికి వెళితే అక్కడికి ప్రసరింప జేయండి. మీ ఎరుక లేకుండానే శాంతిని ప్రసరింపజేసే దీపానికి ఒక పవిత్ర ఛాయగా మీరుండాలి అని కాంక్షించండి.

కాలం చాలా అమూల్యమైంది. మాటలు, చర్చించడాలు, చివరకి ఉపన్యాసాలతో కూడా అది వృధాకారాదు. మందులేని తుపాకి గుళ్ళు నిరర్ధకమే. మనక్కావల్సిందల్లా విశ్వప్రేమ, అత్యున్నత శాంతి, అంతానిండిన ఆత్మబలం.

మాయ, భ్రాంతి కప్పి ఉండడం వల్ల మానవుడు ఇంకా అంతరంగంలో శాంతి కేంద్ర స్థాపనకి మూల్యం చెల్లించడానికి సిద్ధంగా లేదు. అంతకన్నా ఇంటింటికి వెళ్ళి చందాలు వసూలు చేసి అధ్యక్షుడో, స్థాపకుడో, కనీసం కార్యదర్శో, నిర్వాహకుడో అవడానికి ఒక



ఆశ్రమమమో లేక సంఘమో భూమిపై స్థాపించడానికి సిద్ధపడతాడు. ఎందుకంటే, ఇలాంటి బాహ్య శాఖల్ని స్థాపించడానికి, తనలోని అహంకారాన్నో లేక వినాశనకారి అయిన స్వార్థాన్నో నిర్మూలించుకునే మూల్యం చెల్లించనక్కర్లేదు కదా! పేరు ప్రఖ్యాతులనే మేఘాల వెంటపరుగెత్తి ఇలా వాటితో అమాయక మానవుడు, తనలోని శాంతిని మరచి, బాహ్యమైనదాని వెంట గర్జించే సింహాన్ని మరచి పరుగులెత్తే గొఱ్ఱెలా పరుగులెడుతున్నాడు. ఓ మానవుడా! మేలుకో–ఇకనైనా నీలో శాంతి కేంద్రాన్ని నెలకొల్పు. అక్కడ నుండే నిరంతరం వాగుల్లాగ, నదుల్లాగ శాంతిని ప్రవహించనీ. నీలోనే శాంతి కేంద్రాన్ని స్థాపించుకోవడం చాలా తేలికైంది. ఇక్కడ ఎలాంటి నెల నెల కట్టవలసిన చందాలో, సంవత్సరానికి చెల్లించే విరాళాల బకాయిలో ఉండవు. నువ్వు చెయ్యవల్సిందల్లా, నీ శాంతి కేంద్రాన్ని బయట నుండి లోపలికి మార్చుకోవాలి. ఇదే సమయం, ఇదే నువ్వుండదగిన సరైన ప్రదేశం. ఈ రోజే మనది. అనిశ్చితమైన రేపుకాదు. మనం చేసే మంచి పనికి ఈ రోజే, అసలు ఈ క్షణమే మంచిది. ఈ క్షణమే శాంతి కేంద్రాన్ని మన హృదయంలో నెలకొల్పి మన ఆత్మశాంతికీ, మానవాళి మంచికీ తోడ్పడదాం. రా! కదలిరా! జాగుచెయ్యకు.

ప్రియ స్నేహితుడా! శాంతి తీర్థయాత్రలో తోటి ప్రయాణీకుడా! నీకు సహాయపడడానికీ, సేవచెయ్యడానికి మేమున్నాం, మా ప్రార్థనలు నీతోనే ఉన్నాయి.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం ఓం ఓం

# నిన్నెలా ఆరాధించను?

అది ఒకరోజు మైత్రేయ ఆశ్రమంలో తెల్లవారు ఝాము సమయం. ప్రపంచానికే ప్రాణదాత అయిన సూర్యభగవానుడు భూమ్యాకాశపు అంచులపైకి క్రమంగా వస్తున్నాడు. కొండలపై దేదీప్యమానంగా కాంతిపుంజాలు అల్లుకున్నాయి. నాలో వెలుగుతున్న దివ్యజ్యోతి కాంతితో నేను ఒక్కడినే ఉన్నాను. సూర్యుని నుండి వచ్చే బాహ్య కాంతికై ఉద్వేగంగా ఎదురు తెన్నులు చూస్తున్నా. అదొక భగవత్ప్రసాదితమైన దివ్యానుభూతి. నాలోపల బయట అన్నివైపులా భగవంతుణ్ణే దర్శిస్తున్నా అనే అనుభూతికిలోనై నాను. అప్రయత్నంగానే ఓ ప్రభు! నిన్ను ఎలా పూజించను! అందమైన, ఇంకా మంచి సువాసనలు కూడా వెదజల్లేపూలతోనా! లేక నీ ముందు కొబ్బరికాయలు కొడుతూనా, లేక మధురమైన పళ్ళతో కూడానా? నిన్ను ప్రార్థనలతోనా, సంకీర్తలతోనా లేక ధ్యానంతోనా ... దేంతో ఆరాధించను? దేవా! నీకు అత్యంత ప్రీతికరమయి అతి సమీపంగా ఉండే ఆరాధనేది? అసలు నీకు మాటలతోటి, మంత్రాలతోటి అవసరమేమిటి? మాటలేవీ నిన్ను సంతృప్తి పర్చలేవు. నీముందు మా ఆలోచనలూ నిర్జీవములే. మరి నిన్ను ఎలా ఆరాధించను? నిన్ను మనసుతోనో, మేధాశక్తితోనో ఆరాధించనా? నిజానికి నిన్ను మానసికంగా ఆరాధించడమే అత్యున్నత మైనదిగా భావిస్తాను.

ఆ మధుర ఘడియలో లోపల బయట, పైన క్రింద, దివ్యానుభూతిని పొందుతూన్నప్పుడు, కనీసం ఎప్పుడూ సహాయకారిగా ఉండే, లోకశాంతి ప్రార్థనను కూడా ఉచ్చరించలేకపోయా- ఆత్మను మేలుకొలిపే ఆ ప్రార్థనలోని ముందు రెండు మాటలైన “పూజనీయమైన ఓ దివ్య స్వరూపా” ఉచ్చరించడానికి ప్రయత్నించాను. కనీసం పవిత్రమైన, అతి తేలికైన ఈ రెండు మాటలూ కూడా ఉచ్చరించలేక



పోతున్నానా అని లోన అనిపించింది. వాస్తవానికి భగవంతుడు ఎలాంటి మాటలతోనూ మౌనాన్ని భగ్నం చేయడాన్ని అంగీకరించడు. శారీరక, మానసిక స్థితిలో స్వల్ప కదలికను కూడా ఆయన కోరడు. ఎందుకంటే ఆయన పూర్తి నిశ్చలత. ఆయన తరంగాలు లేని పూర్తి నిశ్శబ్దం.

కాసేపు నాలో నేనే అంతర్లీనమై లోన అతి నెమ్మదిగా జరుగుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాలను గమనించాను. ఈ స్థితిలో నీవు కూడా, కనీసం మనస్సులో కూడా ఏ మాటలనీ పలకలేవు (అనలేవు). ఉచ్చరించలేని అజపమంత్రమైన ‘సోహం’ (అది నేనే) ఉదయం నుండి సాయంత్రం వరకూ రాత్రీ , పగలూ కూడా నిరాటంకంగా సాగిపోతూనే ఉంటుంది. మొదటి నుంచి చివరి వరకూ, “సోహం (అది నేనే), తత్వమసి (అది నువ్వే) అనేది నెలకొని ఉంటుంది. అత్యున్నతమైన, అత్యంత సహజమైన, ఉచ్చరించలేని, దానిని గుర్తించు, నిశ్శబ్దంగా ఉండు. అది గ్రహించాక అంతా .......నిశ్శబ్దంలో లీనమైపోతుంది.

నిన్ను ఎలా ప్రార్థించను? నిన్ను నిశ్శబ్దంలో, ఎలాంటి తరంగాలు లేని నిశ్శబ్దంలో ప్రార్థించనా? దేవునికి అత్యంత సమీపమైన, అతి ప్రియమైన ప్రార్థన, ‘ప్రేమించుట’, అందరినీ ప్రేమించు ఎందుకంటే అందరం ఆయన పిల్లలమే. ఆయన యొక్క , ఆయనలోని-సజీవ చిహ్నాలమే. నేను నిన్ను ప్రేమించినంతగా ఒకరి నొకరు ప్రేమించండి. ఎవరు పక్షినీ, పశువునూ, మనిషినీ ప్రేమిస్తారో వారు అత్యున్నత ప్రార్థన చేస్తున్నట్లే ఎందుకంటే సృష్టిని ప్రేమించడం దేవుని ప్రేమించడమే కదా! నిశ్చయంగా దేవుడే ప్రేమ, ప్రేమే దేముడు. అందుచేత మనదృష్టిని విశ్వప్రేమ పై కేంద్రీకరిద్దాం. అదొక్కటే మనం దేవునికి చేసే అత్యున్నతమైన ఆరాధన.

అలా మనలోని శ్వాస భగవంతుణ్ణి రాత్రింపగళ్ళు నిరంతరంగా ప్రార్థించేలా చేస్తుంది. దీనివల్ల శబ్దంలోనూ, నిశ్శబ్దంలోనూ

చలనంలోనూ నిశ్చలతలోనూ కూడా దేవుణ్ణి గుర్తించగల్గుతాం.


ఈ దివ్య క్షణాలు భూమ్మీద ఉన్నా, స్వర్గంలో ఉన్నా అన్ని ప్రాణులు విశ్వప్రేమలో శాశ్వతంగా లీనమవడానికి తోడ్పడుగాక. కేవలం ప్రేమించడం కాదు. ప్రేమలో జీవించాలి. అతిలోతైన, దివ్యమైన, సందేశం అందులో ఉంది. ప్రేమలో మనం జీవించగల్గితే అన్నీ అందులోనే ఇమిడి ఉన్నాయి.

దేనినీ విడిచి పెట్టకుండా అన్నింటినీ తనలోనే ఇముడ్చుకున్న ప్రేమకి నమస్సుమాంజలులు. నిజంగానే దేవుని సరైన, తగిన నామం 'ప్రేమే'. పెల్లుబుకుతున్న ఎలాంటి మార్పుకు లోనుగాని ఏకైక సత్యమయిన, ప్రేమకి ప్రణమిల్లుతున్నా. పువ్వు వికసించడంలోనూ, పక్షి పాడే పాటలోనూ, చిన్న పిల్లవాని ఆటలోనూ, పనిచేస్తున్న మనిషి పనిలోనూ, ప్రకాశించే నక్షత్రాల కాంతిలోనూ వ్యక్త, అవ్యక్తమైన అన్నింటిలోనూ అది కన్పించడం లేదా!

ప్రియ పాఠకుడా! నువ్వు దేవుణ్ణి శాంతి అను, ప్రేమ అను, ఎలాగైనా పిలు అదే శక్తి ఇపుడు నా చేత వ్రాయిస్తోంది – నీ చేత చదివిస్తోందీ అదే. ఆయన ఆజ్ఞలేనిదే గడ్డిపోచయినా కదలదు. అందుచేత మన అంతరంగంలోని ఆ అఖండ జ్యోతిని ఇప్పుడే అనుభవిద్దాం! మన జీవితంలోని ప్రతీ క్షణంలోనూ ప్రతీ అణువులోనూ ఇమిడి యుండి అన్ని వైపులా, అంతటా అన్ని సమయాల్లోనూ మన ప్రతి శ్వాసలోనూ ఈ అనుభూతి పొందుదామా! జయం – జయం – జయం.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు
ఓంఓంఓం





# శాంతి సందేశము

## (భూమి పై శాంతి స్థాపన కొరకు)

ప్రియ మిత్రమా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఎందుకంటే దైవమంటే ప్రేమే. నా ఆత్మ నీకు సహాయపడాలనీ, సేవ చేయాలనీ ఆరాట పడుతోంది. ఎందుకంటే అలానీకు సహాయం చెయ్యడంలోను, సేవ చెయ్యడంలోనూ నేను దేవునికే సేవ చేస్తున్నాను. భూమిపై స్వర్గాన్ని నెలకొల్పాలంటే శాంతి అవసరం.

ప్రపంచ శాంతికి నీ వంతు సేవ ఏమిటి? మన హృదయాలలో శాంతి లేనపుడు, ప్రపంచ శాంతిని గూర్చి మనం చేసే ప్రార్థనలు దేవుని ముందు ఒక బూటకమే కదా!

దేవాలయాలలో ఎన్ని ప్రార్థనలు చేస్తున్నా, ఎక్కడ చూసినా అశాంతే. చాలా దేశాల మధ్య శాంతి, ప్రేమ, ఐక్యతా బదులు ఘర్షణ, ద్వేషము యుద్ధ చిహ్నాలే కనిపిస్తునాయి.

**అమూల్యమైన నిబంధన !**

"ఒరులేయవియొనరించిన ।
నరవర అప్రియము తన మనంబునకగుదా ॥
నొరులకు నవి సేయకునికి ।
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్" ॥

"ఇతరులు నీకు ఏమిచేయాలని ఆశిస్తావో నీవు ఇతరులకు అది చెయ్యి" అనే నీతిని ఏదో మిధ్యగానో, కథగానో గాక, మనం ఇతరులతో గల సంబంధాల్లో ప్రపంచంలోని సోదరదేశాలు పాటించాలి.

మతం అనేది ఏదో ప్రత్యేక సందర్భాల్లో అనుసరించేదిగా గాక మన నిజ జీవితంలో ప్రతీ క్షణం అనుభవించేదిగా ఉండాలి. దానిని (మనో వాక్కాయ కర్మల ద్వారా) మన ఆలోచనల్లోనూ, మాటల్లోనూ, చేతల్లోనూ– దేవాలయంలో ఉన్నా, ఇంట్లోఉన్నా వ్యక్తపరచాలి. ఎందుకంటే మతం అనేది దైవాన్ని మనలో దర్శించుకోవడానికే కదా!

పంట చూస్తే అతి విస్తారంగా ఉంది. కానీ శ్రామికులే అతి తక్కువగా ఉన్నారు. సత్యము, ప్రేమ, దేముని పేరుమీద ప్రపంచంలో శాంతిని స్థాపించుటకు మొదట నీ స్వంత హృదయంలో శాంతిని సాధించి సహాయపడవా?

"నేను రాజనీతిజ్ఞుడను కాదు, ఐక్య రాజ్య సమితి సభ్యుడనూ కాదు" అని విశ్వశాంతి–సాధనకి సహాయం చేయుడంలోనూ సానుభూతి చూపడంలోను, దయచేసి విఫలం కాకు. నువ్వు నిజంగా దివ్యమైన శాంతి వనంలో రాజనీతిజ్ఞుడవే. నువ్వు దేవుని రాజ్యంలో సభ్యుడవే. శాంతి నీ జన్మహక్కు. విశ్వ ప్రేమ నీ దివ్యమైన వారసత్వం. అంచేత



హృదయపూర్వకంగా ప్రేమతో శాంతికై కృషి చేయడం నీ విద్యుక్త ధర్మంగా భావించు.

యుద్ధాన్ని నివారించడానికీ భూమిపై శాంతి సాధనకు నీ హృదయ, ఆత్మ బలాలనన్నింటినీ కూడగట్టి ప్రార్థించు...రా...... రా ముందుకు ..... రా..... కలిసుంటే నిలబడతాం, విడిపోతే పడిపోతాం. ఐకమత్యమే జీవితం– విడిపోవడమే మరణం. అందుకనే నిన్ను అర్థిస్తున్నా, ప్రార్థిస్తున్నా నీ సహకారం కోసం.

జాతి, మత భేదాలు లేకుండా నువ్వొక దేశానికి అధ్యక్షుడివైనా, సామాన్య వ్యవసాయదారుడవైనా, చక్రవర్తివైనా శ్రామికుడివైనా, మతబోధకుడివైనా, సామాన్యుడవైనా, నిన్ను ఇప్పుడడుగుతున్నా..... నీ వంతు కృషిగా మొదట నీ హృదయంలో శాంతిని నెలకొల్పు ఎందుకంటే వ్యక్తి శాంతే విశ్వశాంతికి దారి తీస్తుంది.

మనం కోరుతున్న శాంతి సృష్టికి మూలాధారమైన విశ్వశక్తి మీద ఆధారపడిందేగాని ఏదో తమ వ్యక్తిగత లేక జాతీయ అవసరాలకోసం రాజకీయ నాయకులు చేసుకొనే ఒప్పందాల మీద ఆధారపడేలాంటిది కాదు.

మన సర్వస్వం తానే అయిన దేవునితో ఏకం గాని అందరి భావాలను అధిగమించనిదానిలో శాంతి ఎక్కడుంటుంది? నీలోనే ఉన్న దేవుని దివ్య సాక్షాత్కారాన్ని గుర్తించలేవా? నీ హృదయం లోపలను ఆయన తడుతున్న అనుభూతి కలగడం లేదా? ... అదిగో ఆయన ఇక్కడే ఉన్నాడు. అందులో కలిసిపో – అందులో లీనమైన అనుభూతి పొందు... పొందు... పొందు... నీ హృదయంలోని దేవుని అనుభూతిని నీవు పొందితే..... జాతి, మత, వర్ణ, కులం వంటి ఎలాంటి భేదం లేకుండా అందరిలో చూడగలవు. ఎందుకంటే మనమందరం భగవంతుని సంతతే కదా!

ఓ ప్రియమైన పాఠకా! నా కోసం ఒక్క చిన్న పనిచెయ్యవా? అయితే భగవంతుని సాక్షాత్కారానుభూతిని పొందు – రేపటి నుంచో, ఇంటికో, దేవాలయానికి వెళ్ళాకో కాదు. ఇప్పుడే ఈ క్షణమే ఇక్కడే ఈ సందేశాన్ని చదువుతూనే పొందు.

అరే ఉందు – అలాగే ....... కదలకు. ఆయన నీ కళ్లలో దివ్యకాంతితో మెరుస్తున్నాడు. ఆయన్ని నువ్వు చూడడం లేదా? కళ్ళున్నాయి కదా, చూడడంలేదా నువ్వు. ప్రార్థించు. నీ కళ్ళతోనే ఆయన్ని పట్టుకో. ఆయన నిశ్చలమైన, నెమ్మదైన కంఠధ్వనిని నీ చెవులు విననీ, ఆయన సేవ చెయ్యడానికే నీ చేతుల్నీ, ఉపయోగించు. ఆయన్ని కీర్తించడానికే నీ మాటలను వాడు. నీ హృదయం ఆయన్ని వ్యక్తీకరించనీ, ఆయనలో నీ మనసు లీనమైపోనీ, ఆయన్ని గుర్తించడానికే నీ ఆత్మ ఉన్నది.

సహ సాధకుడా! నీ నుంచి నేను కోరినదంతా ఇదే. దేవుని సృష్టి అయిన ఈ ప్రపంచమొక శాంతి ధామంగా కావడానికి ఎల్లప్పుడూ గుర్తించవలసిన మహోన్నతమైన సత్యం 'మానవ సేవయే మాధవసేవ'. దేవునికి చేసే అత్యుత్తమమైన ఆరాధన ఇదే. ప్రపంచానికి మేలు జరగడానికి మానవాళి అంతకూ నీ నుండి సమైక్యతా భావం వరదలాగ, శాంతి మహా నదీప్రవాహంలాగ, ప్రేమ అనంతమైన మహాసముద్రంలాగ ప్రవహించనీ. నీ హృదయాంతరంగ నివాసి నీకు శాంతి, ఆరోగ్యం, ఆయుష్షులు ప్రసాదించుగాక. నీ సోదరుని ప్రార్థన ఇదే.


ఓం ఓం ఓం

ఆమెన్

**వ్యక్తి శాంతి మాత్రమే ప్రపంచ శాంతికి సహాయకారి.**

**– ఓంకార్**





# అద్భుతం

ఆహా! దేవుని నామమెంత అద్భుతం! నువ్వు కూడా నిస్సందేహంగా ఆయన సంతతే కాబట్టి నీ పేరు కూడా అద్భుతమే అయివుంది. గత సంవత్సరం నా గుండె యొక్క అస్వస్థత వల్ల అనేకమంది భక్తులు ఆదుర్దాగా "స్వామీజీ మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అని అడుగుతున్నారు.

అనాలోచితంగానే చిరునవ్వుతో "నా ఆరోగ్యం అద్భుతంగా ఉంది" అని జవాబిచ్చా. నిజంగా నా గుండె అద్భుతంగా ఉంది. నా రక్తప్రసరణ అద్భుతంగా ఉంది. నాడీ స్పందన మామూలుగానే అద్భుతంగా ఉంది. నా శ్వాస, 'సోహం', ఎప్పుడూ అద్భుతంగానే ఉంటుంది. ప్రతీదీ లోపలే కాదు బయటా అద్భుతంగానే ఉంది. నేను కళ్లు మూసుకున్నప్పుడు పాదాలు మొదలకొని శిరస్సు దాకా ఆయన దివ్యసాక్షత్కారానుభూతి పొందుతాను. నాలోని ప్రతీ జీవకణం లోనూ ఆయనే నిండియున్నాడు. అలాంటప్పుడు ప్రతీ జీవకణం స్థిరంగానూ, నెమ్మదిగానూ, 'అద్భుతం' అంటూనే ఉంటుంది.

ఈ ద్వైత భావ ప్రపంచంలో ఆయన అత్యంత సూక్ష్మమైన అణువు నుండి అత్యంత పెద్ద గ్రహం దాకా నిండి ఉండడం అద్భుతమే. కళ్ళు మూసినపుడు ఆయన అద్భుతం. పూవులోని పరిమళం లోనూ, పక్షిలోని పాటలోనూ, పిల్లల కేరింతలలోనూ, మనిషి చేసే పనిలోనూ, అంతేకాదు పదవీ విరమణ చేసిన వృద్ధుని జీవితంలో కూడా ఆయన అద్భుతమే. వీచే గాలిలోనూ, సూర్యుని వెచ్చదనంలో కూడా ఉన్నది ఆయనే. మన చుట్టూ అద్భుతంగా ఉంటూనే ఆకాశంలో మిణుకు మిణుకు మనే నక్షత్రాలలోనూ అద్భుతంగా ఉన్నాడు.

ఇలా ప్రతీ ఒక్కరిలోనూ, ప్రతీదాంట్లోనూ కూడా అద్భుతంగా ఉండే ప్రపంచంలో ఉండడానికి మనమెంత అదృష్టవంతులమో కదా! నీవు అద్భుతమైనపుడు అందరూ అద్భుతమే. సందేహించకు – ఎందుకంటే ప్రతీఒక్కరం ఆ అద్భుతమైన దేవుని సజీవ ప్రతిరూపాలమే. ఆ దేవుడు (రెండో వాడనే వాడే లేకుండా) తానొక్కడే అయి ఉన్నాడు, అందుచేత ఆయన్ని ముఖాముఖీగా అంతరంగంలోనూ, బయట, అన్ని వైపులా ప్రతీ స్పర్శలోనూ, ప్రతీ శబ్దంలోనూ, ప్రతీ వాసనలోనూ, ప్రతీ దృష్టిలోనూ, ఆకాశంలోనూ తేలికగా గుర్తించవచ్చు. ఇదే అత్యంత తేలికైన, క్షేమకరమయిన ప్రత్యక్షమైన, సులువైన పద్ధతిగా కనిపిస్తోంది. ఎందుకంటే ఇక్కడ నీవు సుదీర్ఘమైన ప్రార్థనలు చేసి అలసి పోనక్కర్లేదు. ఘోర తపస్సు చేసి సుదూరంలో ఉండే స్వర్గం నుంచి ఆయన ఎప్పుడు క్రిందకు దిగి వస్తాడా అని ఎదురు తెన్నులు చూడనక్కరలేదు.

నువ్వు చేయవల్సిందల్లా ఆ అద్భుతమైన వానిని నీ అంతరంగం లోనూ, బయట, అంతటా గుర్తించి, మౌనంగా ఉండడం. స్థిరంగా ఉండి 'నేనే దేవుడిని' అనిగ్రహించు. అది నువ్వే నువ్వే. 'తత్వమసి' **"సర్వశక్తి పనిచేయుచున్నది – జీవుని విశ్రమించనిమ్ము"** ఎంత అద్భుతమైన మంత్రం. ఎంత అద్భుత సహాయకారి అయిన నిర్ధారణ. సర్వశక్తి రూపానికి పనిచేయుటకు అవకాశమిచ్చి (నశించే) జీవునికి



విశ్రాంతి ఈయడం ఎంత తేలిక.

అయినా అవిశ్రాంతిగా పనిచేసే మనసుని ప్రశాంతంగానూ కుదురుగాను భావతరంగాలు లేనిది గానూ చేయడం సుళువైన పనికాదు. సుళువో, కష్టమో ఏమైనా కానీయండి చంచలమైన మన మనస్సుపై ఆధిక్యం సాధించుటలోనే మన ముక్తి ఉంది. మనస్సు యొక్క పరుగులు తీసే వ్యాపకాన్ని అదుపులో పెట్టి దానిపై అధికారం సాధించడమే యోగా, పతంజలి "చిత్త వృత్తి నిరోధ యోగః" అంటారు. మనస్సుపై నియంత్రణ సాధించావా ఆ అద్భుతమైన దాని దర్శనం పొందగల్గుతావు. అంతే కాదు, నువ్వే ఆ కాంతులకే దివ్యకాంతివని మొదటి నుండి చివరిదాకా గ్రహించగల్గుతావు.

ప్రియ పాఠకుడా! నాపేరు అద్భుతం. నా పేరే కాదు నీ పేరు కూడా అద్భుతమే. ఉన్నదేదైనా అద్భుతమే.

అద్భుతాలకే అద్భుతమైన దానికి ప్రణమిల్లుదామా! అందరికీ శాంతి కల్గుగాక. అందరూ ఆ అనంతుని అనుభవం పొందుదురు గాక. పరిమితము స్వార్థపూరితము అయిన ఆలోచననీ, మాటనూ అధిగమించి అందరూ అద్భుతాలకే అద్భుతమైన వాని హృదయము, ఆత్మ, గమ్యం అయిన సర్వోన్నతనిశ్శబ్దంలో లీనమగుదురు గాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం తత్ సత్ ఓం.



# నా మతము

భగవంతుని ఆశీస్సులు పొందిన ప్రియ ఆత్మ స్వరూపులారా! నాలోని మత సంబంధ భావాలను మీముందు వ్యక్తపర్చుకునే మహదవకాశము నాకిచ్చినందుకు మీకు వినమ్రతతో నమస్కరిస్తున్నాను.

నేనొక వేదాంతిలాగనో, ఉపన్యాసకుని వలెనో, ఏదో ఒక తెగకు చెందిన హిందూ మత స్వామిగానో గానీ, లేక సుదూర తూర్పు దేశాల నుండి వచ్చిన స్వామి గానో మీ ముందు నిలబడలేదు. మనందరి తండ్రి అయిన ఆ సృష్టికర్త వారసత్వం పొంది మీతో సమానమైన రక్తమాంసములు కల్గిన వ్యక్తిగా ప్రేమతో మీకు శుభాకాంక్షలు తెల్పుచున్నాను. మనమంతా సర్వశక్తిమంతుడైన ఒకే తండ్రి సంతానం.



అందుచే మీ స్వంత సోదరునిగానే మిమ్ము పలకరిస్తున్నాను.

ఈ రోజు మన ప్రసంగ విషయం, దేవుని పేరుతోనూ, మతం పేరు మీదుగా, “నా మతము” అనే అంశం. ప్రపంచమంతా అసంఖ్యాకంగా ఎన్నో సమూహాలు, తెగలు, వ్యవస్థలు, సంఘాలు, కేంద్రాలు, వసతి గృహాలతో నిండిపోయింది. ఇటువంటి చర్చ ప్రతి వానికీ కావలిసినదే. ముఖ్యంగా నేటి నాగరిక ప్రపంచంలో ఇది మరింత అవసరం.

నిజంగా స్త్రీ పురుష భేదం లేకుండా, ప్రతీ మనిషీ ఏదో ఒక సంఘము లేక తెగకు చెందిన వానిగా ఉండడం ఆధునికంగా పరిపాటి అయింది.

ఏదో ఒక దేవాలయముతో గానీ లేక సంస్థతో గానీ సంబంధం కల్గియున్నప్పుడు వారిలోనూ వారితో కలసియున్న వారిలోనూ శాంతి నెలకొని యుంటుంది. లేనిచో కొందరు వెటకారముగా “ఆవిడకి అరవై సంవత్సరముల వయస్సు వచ్చినా, ఒక్కరోజు ఏ గుడికీ వెళ్ళలేదు” అంటారు. మరికొంతమంది “ఆc....ఆవిడే కాదు ఆవిడ కొడుక్కూడా అంతే” అని వెటకారముగా అంటారు.

ఈ రీతిగా ఎవరైనా ఏదో ఒక దేవుడిని నమ్మి దేవాలయానికి వెళ్ళే అలవాటు ఉంటే వారు తమ జీవితాలను ఒక దేవునికి అప్పగించామనే నమ్మకంతో శాంతిగా ఉంటారు. కొందరు దైవ కార్యక్రమాలకు చందా లేక విరాళము ప్రకటించి, వారు ఇయ్యకపోయినచో అతని పేరుని దాతలు లేక భక్తుల జాబితా నుంచి తొలగిస్తారు. ఈ రీతిగా అతనికి మోక్ష ద్వారములు మూసివేయబడినట్లు పరిగణిస్తారు. ప్రపంచములోని అన్ని తెగలు లేక సంఘాలకి చందాలు కట్టి మన పేర్లు నమోదు చేయించు కొనుట ఏ మతము? ప్రపంచలోని అన్ని పవిత్ర మత గ్రంథాలు చదువుట ఏ మతము? మతాధిపతులు

గానో, దేవాలయ నిర్వాహకులుగానో ఉండుట లేక వారితో సన్నిహితముగా ఉండుట ఏ మతము? అసలు ఏదో ఒక బాహ్య అంశం మనని ఒక మతస్తునిగా చేస్తుందా? ఒక పీఠాధిపతో లేక మఠాధిపతో మనని ఒక మతమునకు చెందిన వారిగా చేయగలరా? అసలు ఎవరైనా లేదా ఏదైనా వెలుపల ఉండేది మనని ఒక మతమునకు చెందినవానిగా చేయగలదా? అసలు మతమనేది ఒకరు ఇచ్చేదా? పుచ్చుకొనేదా? అసలు అది మన వెలుపల ఉంటుందా? అది మనలోనే జీర్ణించుకొన్న విషయం కదా? ఇలాంటి కొన్ని ముఖ్యమైన అంశాల గూర్చి ప్రస్తావిస్తాను.

ప్రియ మిత్రులారా! ముందుగా నేనొక విషయాన్ని మీ ముందు స్పష్టంగా ప్రకటించాలి. నాకంటూ ప్రత్యేకంగా ఒక మతములేదు నానుండి వేరైన మతమూ లేదు. అలాగని నన్నొక నాస్తికుడుగానో ఏమంత విశ్వాసములేని వానిగానో భావించవద్దు. నామతం అనేది శాశ్వతంగా నాతోనే ఉండేది. నిజానికి నాకు మతమంటే నాలోని అణువణువునా వ్యాపించి అంతర్గతంగా నాలో లీనమైనది.

ఈ మృదువైన కళ్ళతో ప్రతిదానిలోనూ చూస్తున్న విశ్వప్రేమ మయమైన మతమే నా మతము. మీ అందరి నేత్రాలలో కూడా కనిపిస్తున్నదీ అదే. నా మతము హృదయాంతరాళమునకు సంబంధించినది, ప్రేమ, ఏకత్వంతో కూడి సర్వమానవాళిపై తన కాంతిని ప్రసరింపచేసేది. ఈ శరీరానికో లేక మరో మతానికో, రూపానికో, పేరుకో మాత్రం పరిమితం చేస్తున్నానని అనుకోకండి. మతమంటే భగవంతుని అత్యున్నత వ్యక్తీకరణ. అది ఎన్నడూ ఏదో ఒక రూపానికో, పేరుకో, చివరికి ఒక తెగకో, కాలానికో కూడా పరిమితం కాదు.... కాదు......కానేకాదు.

ఆకుల మధ్య కదలికలో నామతమున్నది. ఆ మతము పక్షుల



శ్రావ్య గానంగా వినిపిస్తుంది. గాలిలోని వీచేగుణం నామతం. సూర్యుని ప్రకాశంలో ఉన్నది నా మతమే అతి చిన్న అణువు నుండి అంతరిక్షంలోని అతి పెద్ద గ్రహాల వరకూ ఆవరించియున్నది నామతము.

నామతము మానవ సామ్రాజ్యానికి మాత్రమే పరిమితమైంది కాదు. అన్ని జీవరాసుల సామ్రాజ్యాలలోనూ అది నిండి ఉంది. నీకు కొంచెం వింతగానే అనిపించవచ్చుకాని, నా మతం, భూగర్భంలోని ఖనిజాలకు కూడా సంబంధించినది. ఖనిజాలలోను, వృక్షజాలాలలోను, జంతుజాల, మానవాళిలోను కూడా నా మతం ప్రకాశిస్తూ ఉంటుంది. ఎందుకంటే స్వచ్ఛమైన కణం నుండి అతిచిన్న క్రిమికీటకాదుల నుండి కూడా వేరుచేయలేనిది. అది అందరిమతం. ఒక గొప్ప సాధువు మొదలుకొని అతిహీనమైన పాపి వరకు అందరికి చెందినది. అది మానవాళి అందరి మతం. అందరిలోని అన్ని మతాలమయమే నా మతం. నా మతం నన్ను ప్రతి ఒక్కరిలోను ఒకటైపోయేలా చేస్తుంది. అది మహ్మదీయమో, బౌద్ధమో, జొరాస్ట్రియమో, కన్‌ఫ్యూషియమో లేక ఏదైనా కావచ్చు.

అందుచే ప్రియశ్రోతలారా మనమందరం ఒక్కటే అను భావనలోనే నా మతం యొక్క గొప్పతనం ఇమిడి ఉంది. మీ అందరిలో నేను ఒక్కడినే అను ఐక్యతాభావంవల్లనే ఈ శరీరములో ప్రాణం నిల్చివున్నది. నా దైవత్వ భావనలో మిమ్ములను వేరుగా గాక నాతోనే ఉన్నవారిగా భావించడం జరుగుతుంది. మీ కష్టసుఖాలన్నీ నావిగానే భావించి మిమ్మల్నందరిని నాలోను, నేను మీ అందరిలోను ఒక్కటిగా అవ్వాలని కోరుకుంటున్నా. మొత్తం మానవత్వాన్ని లేక సృష్టిని విశ్వప్రేమ తన కౌగిలిలోకి తీసుకోవడం కన్నా మించిన ఆనందం ఏముంటుంది?

ఇదీ నామతం, ఇది నాదనుకుంటే నాది. మీదనుకుంటే మీది.

నా దృష్టిలో మతం అంటే విభజించడానికి వీలులేని ప్రేమ, వర్ణనాతీతమైన ఏకత్వము. అసలు సిసలైన ఆత్మ మతం ఇదే అయితీరాలి. సత్యం తెలుసుకోవాలనే కాంక్ష ఉన్న అందరికి ఇదే ఆచరణ యోగ్యమైన మతము. మనం అంగీకరించినా లేకున్నా సత్యాన్వేషకుల మతమిదే. ఇది ఎన్నడూ మార్పుచెందని, చెక్కు చెదరని సత్యం.

ఒక్క మాటలో చెప్పాలంటే, **తనలోనే ఇమిడియున్న దైవత్వాన్ని గుర్తించడమే మతం.** విశ్వప్రేమ అనే సింహాసనాన్ని అధిష్ఠించి సంతృప్తి అనే మహానందాన్ని వైభోవపేతంగా పొందే పాలకుడగుటయే మతం.

అవును, నిజంగానే, మతం పేరుతో దోపిడీలు జరిగాయి, హత్యలు జరిగాయి, అమాయకులపై మూకుమ్మడి హత్యాకాండలు చెలరేగాయి. చివరకు ఆత్మహత్యలు, ఇంకా నీచమైన కార్యక్రమాలు మతం పేరిట జరిగాయి, జరుగుతున్నాయి.

మతంపేరిటే కదా ప్రియతముడైన ఏసుప్రభువు శిలువ వేయబడినాడు. అన్ని కాలాలలోను మతబోధకులు ఇట్టి దురాగతాలకు బలి అవుతూనే ఉన్నారు. నిజానికి ఈ దురాగతాలన్నింటికీ మనం మతమునే తప్పుబట్టాలా? నిజానికి మతం అనబడే ముసుగు గతంలోను ఇప్పుడు కూడా, ప్రపంచంలో ఈ పాపకార్యాలన్నింటికీ మూలకారణం అయింది. అవుతోంది. కానీ అది ఎన్నటికీ విశ్వప్రేమతో కూడిన మతం కానేరదు. ఏసుప్రభువు, ప్రేమతోనే తన దేహాన్ని ఇష్టంగానే త్యాగం చేసాడు. ఆయన చివరి మాటలు "తండ్రీ వారిని క్షమించుము, వారేమిచేస్తున్నారో వారికే తెలియదు" అను మాటలలోను ఇదే ఆవేదన వ్యక్తమయింది. బుద్ధుడు ఒక పావురం జీవితం కాపాడడానికి తన ప్రాణమునే అర్పించుటకు సిద్ధపడినాడు.

నిజమైన మతంలో, ఎలాంటి విభేదాలకు గాని, తగవులకు గానీ, ఏవిధమైన ద్వంద్వ అభిప్రాయానికి గాని తావులేదు. ఇక్కడ



ఎవరివైపు వేలెత్తి చూపడానికీ, ఎలాంటి పరుష వాక్యం పలకడానికీ తావులేదు. ప్రేమమయమైన ఇలాంటి మతములో, ఏ వ్యక్తికి మనసులో కూడా ఎలాంటి ఏహ్యాభావం గానీ, ద్వేషం గానీ ఉండదు. ఎప్పుడైతే ఒక వ్యక్తి తన మతం విశ్వమతం అని భావిస్తాడో ప్రతీ వ్యక్తినీ, ప్రతీ దానిని, తనకు సంబంధించినదే అనే భావనవల్ల జాతి, కుల, తెగ, వర్ణ అనే బేధాలు ఏవీ లేకుండా అందరినీ, అన్నింటినీ ప్రేమించకుండా వుండలేడు.

'మానవుడు తనకన్నా మతం భిన్నమైంది', అని ఎంతకాలం నమ్ముతాడో, ఆ మతం ఎంత గొప్పదైనా సరే, అంతకాలం అతడు అజ్ఞానానికో లేక బలహీనతకో లోనుకాక తప్పదు. తననుండి మతం విడదీయరానిదని, ఎప్పుడూ తనలోనే జీర్ణించి ఉందని మానవుడు ఎప్పుడు భావించునో అప్పుడే అతడు, లేనిపోని చికాకుల నుండి, అజ్ఞానం నుండి, బలహీనతల నుండి విముక్తుడై దేవుని యొక్క లేక మతము యొక్క ప్రతీకగా వెలుగొందును.

దేవుడు, మతము అనే రెండు భావాలని నిర్వచించాలని నాకు కోరికగా ఉంది. అత్యున్నతమైన భావంలో దైవము – మతమూ వేరు కాదు ఒక్కటే!, చాలా మంది మతమంటే దేవుని వద్దకు చేర్చే మార్గముగా చెప్తారు. కనిపించేటి, కనిపించని వాటి అన్నింటికీ మూలాధారం భగవంతుడే. అందుచేత మతమనేది ఆ భగవంతుడనే ఆధారంతో వ్యక్తిని ముడి వేస్తుంది. మతమును అవగాహన చేసుకొన్నవాడు దేవుని తెలుసుకొన్నవాడే. ఖచ్చితంగా మతమును గురించి నిత్యవ్యవహారంలో కూడా పూర్తి అవగాహన ఏర్పర్చుకున్నట్లే? అతడు ఏవిధంగా చూచినా ఆ భగవంతునికన్నా భిన్నం కాదు భిన్నంగా ఉండనూ లేదు. ఆస్థితి పొందిన వ్యక్తి క్రీస్తు చెప్పిన "నేనూ నా తండ్రీ ఒక్కటే" అను మాటను అర్థం చేసుకొని ఆనందించగలడు.

సాధారణంగా ప్రతీచోట, ప్రతిరోజూ, ప్రతిమనిషీ నన్ను అడిగే ప్రశ్న 'నీదే మతము'? అంటే నన్ను ఏదో ఒక సమూహానికి చెందిన వాడిగా గుర్తించాలి అని వారు తెలుసుకోగోరుతున్నారు. అందుకు ఈ ప్రదేశంలో 'నేను క్రైస్తవుడను' అని జవాబిస్తే నన్ను పిచ్చివానిగా జమకడతారు. అదే నేను అమెరికాలో 'నేను హిందువుడను" అని జవాబిస్తే చర్చికి వెళ్ళేవారిలో చాలామంది "అయ్యో! ఇతడు దేవుని దయకు పాత్రుడు కాగల విశ్వాసము లేని వ్యక్తి" అని జాలిపడకుండా వుండలేరు. అదే రీతిగా బౌద్ధులకు నేను, బుద్ధుని అనుచరుడను కాను అంటే వారు నేను చీకటిలో అలమటించుచున్నానని భావిస్తారు. నేను ఇస్లాం అనుసరించుటలేదని తెలిసి ముస్లిం నన్ను ఇతడు "కాఫిర్" లేక "నమ్మకం లేనివాడిగా పిలుస్తాడు" లేక ఇంకో మతమునకు చెందినవారితో నాకు ఏ మతమునందు నమ్మకం లేదన్నచో వారు నాపై "నాస్తికుడనే" ముద్రవేయకుండా ఉండరు. అలా మనం, ప్రతీ చోటా మనుషులు తమదనే ఒక ప్రత్యేక మతములో ఎన్నవ్యక్తిత్వాన్ని పట్టుకొని వ్రేలాడుతూ, సజీవ సత్యాన్ని, నిజమైన మతాన్ని, చిత్రవధ చేస్తున్నాము. ఈ అన్నిరకాల వ్యక్తిత్వాలకు, ఇతర నమ్మకాలకు అతీతంగా ఉన్నప్పుడు తప్పితే మనం నా మతమే అన్నింటికన్నా గొప్పది, మిగిలినవన్నీ ఎందుకూ పనికిరావని అనకుండా ఉండలేము.

నన్ను ఎవరైనా తరచూ నీవేమతమునకు చెందినవాడవు? లేక ఏ నమ్మకపు సంఘానికి చెందినవాడవు? అని అడిగినపుడు కొంత అసౌకర్యాన్ని లేక సందిగ్ధతను పొందేవాడిని. మొదటగా నేను వారిని అడిగే ఎదురు ప్రశ్న నేను ఏదో ఒక తెగకో, మతానికో చెందిన మాంసం ముద్దనా? ఈ విశ్వప్రేమలో, ఈ సమూహాల్లో, ఏదో ఒక తెగకో, పేరుకో మాత్రమే చెందిన పరిమితుడను ఎలా కాగలను? కొన్ని వస్తువులు కొందరు వ్యక్తులకే చెందుతాయి. నేనేమన్నా ఏదో వస్తువునా?, పదార్థాన్నా? ఒక చర్చికో, దేవాలయానికో మాత్రం



చెందడానికి. అమాయక మానవుడు ఆదివారం, తనకు సంబంధించిన చర్చికి హాజరై, తన కొరకు ప్రార్థన చేయమని అచటి మతాధిపతికి అప్పగించి సంతృప్తి పడిపోతాడు. అతన్ని మతం ఇంకేమాత్రం ఇబ్బంది పెట్టదు. కానీ, నిజమైన మత విశ్వాసమునకు చెందిన వ్యక్తి అంతటితో సంతృప్తి పడడు. పడలేడు. మతమనే మహాసముద్రపు అగాధమైన అంచులవరకు ఈది...ఈది, దాని లోతుపాతులు కనుగొని, అన్నింటి తోనూ ఐక్యమై, మొత్తం ప్రపంచాన్ని అంతటిని తన కౌగిలిలోనికి తీసుకొనేంత వరకు సంతోషించడు.

ఇటీవలె ఫిలాడెల్ఫియాకి దూరంగా "చెస్టర్" అనే ప్రాంతంలో ఆదివారం దట్టంగా పెద్దచెట్లు కలిగిన, దట్టమైన అడవి వంటి ప్రదేశంలో అక్కడి సహజ సజీవ మతసమాజంతో గడపడం జరిగింది. ఆశ్చర్యానందాల తోనే అచటి చర్చి వ్యవహారములు చూచే మత బోధకుని కలుసుకోవడం జరిగినది. ఆయన నాపై దయతో క్రైస్తవ మత ప్రచార సంబంధమైన కాగితాన్ని ఇచ్చాడు. నా శరీర వర్ణం చూచి, మతవిశ్వాసంలేని వానిగా భావించి నాకు క్రైస్తవ మత బోధ చేయడం ప్రారంభించాడు. గొప్ప కీర్తివంతుడైన ఏసుప్రభువునకు హృదయపూర్వకంగా నమస్కరిస్తూ , నా భావాలు మీకు చెబుతున్నా. ఆయన నాకు బోధిస్తున్నది క్రైస్తవ మతం కాదు అది చర్చిమతం.

నిజమైన మత అమృతాన్ని తనివితీరా గ్రోలినవాడు అసలు ఆ మతాన్ని కౌగిలించుకోకుండా ఉండలేడు. అతడు సాధువు కావచ్చు, పాపికావచ్చు ఒక మహ్మదీయుడు కావచ్చు, లేక ఒక బౌద్ధమతస్తుడు కావచ్చు. వాస్తవానికి ఏసుప్రభువు నిజమైన మతం 'విశ్వప్రేమ' తప్ప మరేది కాదు. చర్చిమతం అంతా బేధములే క్రైస్తవమతమంతా ప్రేమే. హిందుత్వం అంతాకూడా 'విశ్వప్రేమ' తప్ప ఇంకేంకాదు.

సముద్రపు పై భాగం చూచినపుడు అంతా సందిగ్ధం

గందరగోళంగా ఉండొచ్చు. ఒక పెద్ద కెరటం ఎగసిపడి, దానివెనుకే ఇంకొకటి పైకిలేచి, తనవంతు వచ్చినపుడు ఢీకొని, నురగ తుంపరలు వెదజిమ్ముతుంది. కానీ ఆ సముద్రపు లోతుకి వెళ్ళినచో అచట ఎలాంటి కెరటాలు ఢీకొనడాలు, ఘర్షణ లేకుండా పూర్తి శాంతి, నిశ్శబ్దం ఆవరించి ఉంటుందే తప్ప మరేదీ ఉండదు.

అందుచేత ఏ మానవుడైనా ఆ మతమా, ఈ మతమా అని సమూహాన్నో పేరునో నమ్మి గ్రుడ్డిగా దానినే అంటిపెట్టుకొని సంతృప్తి పడిపోకూడదు. గొప్ప మతములన్నింటికీ మూలమైన విశ్వప్రేమ యొక్క అనుభూతి పొందేవరకూ అతడు తన మతపు లోతుల అంచువరకు వెళ్ళాలి. అప్పుడు మాత్రమే అతడు తన మతమునకు మానవాళికీ కూడా మహోపకారము చేసిన మహనీయుడు కాగలడు.

ఏ మతమూ ఇతర మతాలకన్నా తానే గొప్పదైనట్లు విర్రవీగకూడదు. ఒక తెగను మరొక తెగతోను, ఒక మతముతో మరొక మతమును పోల్చిచూచుట అవివేకమే తప్ప మరేమి కాదు. ప్రతీ మతానికి తనదంటూ ఒక ఉన్నత సత్యం ఉంటుంది. ఒక వ్యక్తి నిజంగా తన మతమును నమ్మి పూర్తిగా తూ॥చా తప్పకుండా తన మత సిద్ధాంతము ప్రకారమే నడుచుకున్నచో అతడు మిగిలిన అన్ని సిద్ధాంతాలనూ అంత ఖచ్చితంగా గౌరవించగలడు. అతడు తన మతములో గాని ప్రపంచంలోని మరేఇతర మతాలలోగానీ ఏదోషాన్నీ వేలెత్తి చూపలేడు. ఎవరు తన హృదయంలో నిశ్చల దైవభావమును కల్గియుందురో, వారు మిగిలిన అందరి హృదయాలలోనూ అదే భావమును చూడగలరు. ఇదే సూత్రం మత విషయంలోనూ వర్తిస్తుంది.

అసలు వాస్తవమైన విషయమేమిటంటే ఈ భూమ్మీద ఉండే ప్రతీ తెగ లేక మతంలోనూ రెండు రకాల అంశాలుంటాయి. మొదటిరకం అవశ్యకమైన ప్రాథమిక అంశాలు. రెండవరకం



అనావశ్యకమైన, అంత ముఖ్యముగాని అంశాలు. వీటిలో రెండవదైన అనావశ్యక అంశాలు మతానికీ మతానికీ మారుతుంటాయి. కానీ మొదటిదైన అవశ్యక అంశాలు మారకుండా అన్ని మతాలలోనూ ఒకటే అయి ఉంటాయి. ఒక మత, లేక తెగకు సంబంధించిన బాహ్య విషయాలను మాత్రమే పట్టుకొని వ్రేలాడువారు ఒకరితో మరొకరు కలహించుకుంటూ దెబ్బలాడుకుంటూ ఉంటారు. ఈ బాహ్య విషయాల స్థాయిని మించి, వాటియొక్క పైకి కనిపించే పూజ పద్ధతులు, నమ్మకాల స్థాయిని ఎవరు అధిగమిస్తారో వారు ప్రపంచంలోని అన్ని మతాలలోనూ గల అదే సౌందర్యాన్నీ, సత్యాన్నీ దర్శించి సచ్చిదానందాన్ని పొందగలరు.

అన్ని మతములలోనూ విస్తరించియున్న నా సోదర సోదరీమణులందరికీ నా సందేశము ఒకటే..... దయతో గ్రహించండి.

ప్రతీవారూ ఎవరి మతములను వారే కల్గియుండి, వాటిని వదలకుండా సాధనతో బాహ్యమైన ఆడంబరాలనీ నమ్మకాలనీ అధిగమించాలి. అప్పుడు ఆ స్థితిలో వారు మతంలో గాఢంగా అంతర్లీనమై పైపై సిద్ధాంతాలన్నింటినీ అధిగమించి, తమలోనే ఇమిడియున్న విశ్వప్రేమ భావ సౌందర్యాన్ని దర్శించకుండా ఉండలేరు. సత్యమైన జీవితాన్ని గడుపుచూ పైకి కనిపించే అవరోధాలూ, హద్దులూ, అధిగమించి, అన్ని మతాల వారితో ముఖాముఖి సంబంధాలు కల్గి 'విశ్వమతంతో ' జీవించగలరు. అదే మహత్తరమైన మానవ జీవిత పరమార్థం.

మతమనేది మానవుని జన్మహక్కు. అది అంతర్లీనంగా మాత్రమే ఉంటుంది. లోన ఉన్న అసలు సత్యాన్ని గ్రహించకుండా ఒక మతం నుండి ఇంకోమతానికి మారితే దానివల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం లేదు.

ఇక ప్రస్తుత అంశాన్ని ముగించేముందు నేను మరొక

ముఖ్యాంశాన్ని ప్రస్తావించాల్సి ఉంది. ప్రతీ చోట చాలా మంది అయ్యో! ప్రార్థన చెయ్యడానికీ, లేదా దేవుని కోసం గడపడానికి సమయం సరిపోవడం లేదండి అని వాపోతారు. ఇప్పుడు పైన ప్రస్తావించిన విషయాలలో కొన్నింటినైనా మనకు మనం ఆత్మ పరిశీలన చేసుకోడానికి ఒక నిముషం కేటాయించినా, 'సమయంలేదు' అనే సాకు అర్థంలేనిదిగానూ అవివేకంగానూ కనిపించక మానదు.

మతమునకు గానీ భగవంతుని గూర్చిగానీ ఆలోచించే సమయంగానీ తీరికగానీ , ఓపికగానీ లేదని చెప్పడం అజ్ఞానం కాక మరేమీకాదు. ఆపాదమస్తకం ఆ భగవంతుడే మహత్తరమైన తేజంగా లోన, పైనా కూడా నిండి ఉండగా ఈ సత్యాన్ని వినలేని చెవిటివారు గానూ, చూడలేని అంధులుగానూ ఉంటూ ఈ జనులు నిజమైన తమ జీవయాత్ర ఎలా కొనసాగించగలుతున్నారు. అసలు నిజమైన ప్రమాదం ఏమిటంటే మనం బయట ఉండే మతానికి మాత్రమే పరిమితమైపోయి, మన నిజమైన స్వరూపానికీ, జీవితానికీ దూరమగుటయే. వ్యక్తుల యొక్కగానీ, జాతుల యొక్కగానీ అంతః సౌందర్యముగానీ, మోక్షసాధనగానీ, వారు జీవించి ఉండగా గానీ లేక మరణించినా గానీ వారు తమ మతముతో ఏకమైపోయి దాని నుండి ఎడబాటు లేకుండా యుండుటయే.

మరొకవిధమైన అంధప్రజల్ని మన నిజజీవితంలో, ముఖ్యంగా నేటి బాహ్యనాగరికత పోకడలో, చూస్తుంటాం. వారు "ఓహ్ ! ఈ మతాల గురించి తలలు బ్రద్దలు కొట్టుకోకుండా మేం హాయిగా జీవిస్తున్నాం" అంటారు. వారు బహుశ తినడం, నిద్దరపోవడం, డాలర్లు లెక్కించుకోవడంతో సంతృప్తి చెంది ఆనందంగా ఉన్నామనే భ్రమలో ఉన్నారు. కానీ వారు ఈ అశాశ్వతమైన పరిమితమైన ఈ ప్రపంచపు ఆటబొమ్మలతో ఎంతకాలం హాయిగా ఉండగలరు? సజీవమైన అంతర్గత శక్తి, శాంతుల నుండి అయ్యో! వేరుపడి దానికి దూరమైపోవుట



లేదా? ఆనందంమా! అది ఎక్కడుంది? అసలు ఆనందమంటే ఏమిటి? మానవుడు నిజమైన శాశ్వతానందాన్ని ఎలా పొందగలడు?

నామరూపాలకి పరిమితమైన దేన్లోనూ నిజమైన ఆనందం లేదని చెప్తే చాలు. కాలమే మనుష్యులను పెరుగునట్లు చేసి, వారి స్వీయానుభ వాలే వారికి నిజమైన ఆనందాన్నితమలోనే వెదకునట్లు చేయును. దేవుని కుమారుడు ఏక్షణములోనైనా రావచ్చు. కాబట్టి మనం వెయ్యికళ్ళతో ఆయన రాకకై ఎదురుచూడాలి. లేదా బైబిలులోని 'పెళ్ళికొడుకు రాక' నీతికథలో ఐదుగురు మూర్ఖకన్యలవలె మనం నష్టపోదుము. అందుచే మన అమూల్య సమయాన్నీ, జీవిత పరమార్థాన్నీ మరచి తినడం, త్రాగడం, మొదలైన అనవసర పనులతో వృధాగా గడపకుండా ఎల్లప్పుడూ భగవంతుని చైతన్యముతో పెళ్ళికొడుకు రాకకై ఎదురుచూచు తెలివైన మిగిలిన ఐదుగురు కన్యలవలె సమయాన్ని గడపాలి. ఇలా నిజమైన మతముతో గడపలేనపుడు అతడు ఎంతధనికుడైనా అట్టి మానవ జీవితానికి అర్థంలేదు. అసలు ఆ జీవితమే వ్యర్థము.

నేను ఇండియా నుండి 'బెనారస్' అనే ఓడలో వచ్చునపుడు ఒక క్రైస్తవ సోదరునితో మాట్లాడ్డం జరిగింది. మా మాటల మధ్యలో నేనతన్ని "మీరు రోజూ పవిత్ర బైబిల్ గ్రంథం చదువుతారా?" అని అడిగాను. అందుకు ఆయన తడుముకోకుండా వెంటనే "అబ్బే బైబిలు చదవడం, ప్రార్థన చెయ్యడంలాంటి దురలవాట్లు ఎప్పుడో చాలా కాలం క్రితమే మానేశా" అన్నాడు. ఈ సమాధానానికి నివ్వెరపోవడమే నా వంతయింది.

అయినాసరే, బాహ్య విషయాలకే ప్రాధాన్యం ఇచ్చే నేటి ప్రపంచం దృష్టిలో అతడు ఒక విద్యావంతుడు, సంస్కారి, నాగరికుడు. నాగరికత అనే ముసుగులో కొందరు, మన ఇంగ్లీషు సోదరుని దృష్టిలో, "చెడు అలవాట్లయిన" బైబిలు చదువుట, చర్చికి వెళ్ళుట మానివేసి

పొగత్రాగడం, మద్యం సేవించడం వంటి “మంచి పనులు” వెలగబెడుతుంటారు. వారిని చూస్తే అయ్యో! అని జాలివేస్తుంది. కానీ వారూ పై పటాటోపజీవితం గడుపుతున్నా మనవలెనే దేవుని నుండి వచ్చిన వారే కదా అని మరలా అనిపిస్తుంది.

చివరికి నేను ప్రపంచంలో నాల్గురకాల మనుషులుంటారనే అభిప్రాయానికి వచ్చాను. వారు ఈ విధంగా ఉంటారు.

1. పశుప్రాయమైన జీవులుగా ఎప్పుడూ ఇంద్రియానుభవాలతో సంతృప్తి పడిపోతూ అదే సుఖమనే భ్రాంతితో ఉండేవారు. ఇలాంటి వారు భగవంతుని ఉనికినీ ఉన్నత జీవిత విలువలనీ దారుణంగా మరచిపోయిన వారు.

2. భగవంతుని గూర్చి ఆలోచించే సమయము, తీరిక లేదనే సాకుతో జీవించేవారు. ఇలాంటి వారి ఆత్మలో భగవంతుని ఆలోచన, విత్తనంగానే ఉంటుంది. వారు అసలైన సత్యాన్ని తెల్సుకుని, దానితో తమకున్న సంబంధాన్ని గుర్తించి, మరింత ముందుకి ఆ మార్గంలో సాగవల్సిన అవసరం ఉంది.

3. మతం యొక్క బాహ్య రూపాలతోనే సంతృప్తి చెందుతూ జీవించేవారు. ఇలాంటి వారు అంతగా ప్రాధాన్యంలేని విషయాలను వదలి, ముఖ్యము, సత్యము అయిన తమలోనే దాగి యున్న అనంతమైన ఆనందాన్ని శాశ్వత శాంతినీ పొందాలి.

4. మతమే తమ సర్వస్వము అనే భావంతో జీవించే వారు. ఇటువంటి వారు విభజించడానికి వీలు లేని ఏకత్వ భావంతో గతంలోనూ ప్రస్తుతము భవిష్యత్తులోనూ కూడా తమలోనే దైవాన్ని దర్శించగలరు.

‘దేవుని ప్రతిరూపాలు’ అని నిజముగా గుర్తింపబడడానికి అర్హులు పైన చెప్పిన నాల్గవ రకానికి చెందినవారు మాత్రమే. ఆ మహనీయు



లందరినీ కృతజ్ఞతతో స్మరించాలి.

ఆత్మపరిశీలన చేసుకొని మంచి అవగాహనతో ప్రతీవ్యక్తీ పైన తెల్పిన నాల్గురకములలోనూ తాను ఏ రకమునకు చెందిన వాడో నిర్ధారించుకోవాలి. మొదటి వర్గంనకు చెందిన వారు రెండవ వర్గస్థాయికి, రెండవ వర్గంనకు చెందిన వారు మూడవ వర్గస్థాయికి, అదేరీతిగా మూడవ వర్గము స్థాయికి చెందిన వారు నాల్గవ వర్గమునకు చెందు స్థాయిని చేరుటకు కృషిచేయవలెను. ఈ రీతిగా చివరకు అన్నిమతములకీ ఒకే అత్యున్నత స్థాయి అయిన విశ్వప్రేమ ఏకత్వభావన సాధించవలెను. ఏమతములోని నీతి వాక్యమైనా “ప్రగతిని పొందుము, అభివృద్ధి సాధించుము, నిల్వయున్న మురికినీటివలె స్తబ్దునిగా ఉండకు. ప్రగతియే జీవితం. స్తబ్దతే మృత్యువు” అనే చెప్తాయి.

ప్రియమైన దైవస్వరూపులారా! దేవుని నిజమైన ప్రతి రూపాలుగా మీ సహజ స్వరూపమును గుర్తించుటకిదే సమయం. మీ లోనే అంతర్లీనమై యున్న దైవత్వ నిజభావమును సత్యము, ఔన్నత్యము వైపు మళ్ళించండి. మీ లోని దైవత్వ భావాన్ని ఇంక ఎంత మాత్రం సమాధి కానివ్వద్దు. మీలోని విశ్వప్రేమైక మతాన్ని ఈ చర్చికో ఆ సంస్థకో అమ్మవద్దు. మీలోని దైవత్వ భావాన్ని మేల్కొలపండి. అపుడే మీరు అన్నిమతాలలో, అన్ని జాతులలో అసలు మొత్తం మానవాళిలో ఒక్కరుగా ఏక మగుదురు. ఇదే మీ జన్మహక్కుయిన దైవ తేజస్సు.

సర్వేజనా స్సుఖినో భవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

డిశంబరు 2, 1925 లో ఫిలడెల్ఫియాలోని మరియు మిషన్ వారి వద్ద ఇచ్చిన ఉపన్యాసము.

# నయాగరా జలపాత సందేశము

"భగవంతుడు పవిత్ర దేవాలయంలో ఉన్నాడు. సర్వ ప్రపంచము ఆయన ముందు నిశ్శబ్ధముగా ఉండుగాక".

ఇచట, భగవంతుడు తన వెలుపలి ఆలయంలో ఉన్నాడు. అందుచే ప్రపంచమంతా అతని చైతన్యముతో నిండి యుండుగాక. ఘనత వహించిన నయాగరా జలపాతమునకు శుభాభివందనములు. అనంతంగా స్వయం ప్రకాశమై మహోన్నతంగాప్రవహించు ఈ అద్భుతమును మెచ్చుకొందుముగాక.

ఇప్పుడు నేనెక్కడ ఉన్నాను? ఆ దివ్యమైన కాంతి ప్రకాశములోనే కదా! నా మాటలు మూగబోయాయి. జ్ఞానేంద్రియాలు తమ సహజ లక్షణాలని కోల్పోయాయి. మనస్సు కరిగి శరీరమంతా మొద్దుబారి నట్లు అయింది. ఎలాగో అతికష్టము మీద ఈ మహాజల పాతము గూర్చి వ్రాయదలచాను. ఆ మహా ప్రవాహాన్ని గాఢమైన మౌనంతో, కన్నులలో ఆనంద బాష్పాలు నిండుచుండగా ఆశ్చర్యముగా చూసాను. దాని సందేశమును నేను విందును గాక!

జలపాత సందేశము : లేక
జలపాతము నాతో అన్న మాటలు :

"ప్రియమైన తనయుడా!

ఎన్నడూ ఏవిధమైన ప్రతిఫలము కోరకుండా, నీకు ఉన్నదంతయు ముగింపులేకుండా ప్రజాసేవకు నిరంతరము ధారపోయుము. ఇప్పుడో, ఒకప్పుడో అనికాకుండా ఎల్లప్పుడు ధారపోయుము. నీ ప్రేమను అచేతనంగా కాకుండా చైతన్యముతో ప్రవహించనిమ్ము. నువ్వు ఎంత ఇచ్చివేస్తే అంత పొందుతావు. ఎక్కువ పొందటానికి అతితేలికైన మార్గము నీకు ఉన్నది ఇవ్వడమే.



ఆ దేవుని ప్రతిరూపంగా, అనంతమైన ప్రేమని, నిరంతర శాంతిని ప్రజలకు నువ్వు ఇవ్వగలవు. శాంతి, ప్రేమ అనునవి నీ జన్మ హక్కు. ఈ అమూల్యమైన కానుకలను ఒక పిసినారి వలె దాచుకోవద్దు. నీ యొక్క శాశ్వతమైన, అశాశ్వతమైన సంపదనంతా మొత్తము మానవాళితో పంచుకో.

సుఖశాంతులతో ప్రపంచమును స్నానమాడనీ, ఆయురారోగ్యాలతో మానవాళిని తడిసి ముద్దవనీ.

దాత ఎప్పుడూ గౌరవించబడతాడు, యాచకుడు ఎప్పుడూ అగౌరవ పరచ బడతాడు అందుచే ఇచ్చువాని గానే ఉండుము. ఇదిగో.... ఇలా నన్నొక సారిచూడు! "నేను ఏ ప్రతిఫలము ఆశించకుండా ఏ ఉద్దేశము లేకుండానే ఇచ్చివేయుచున్నాను". నేను దాచుకోలేను అందుకనే ఇచ్చివేస్తున్నాను. నన్ను చూడు, ప్రపంచమంతా సంభ్రమాశ్చర్యాలతో ఎలా చూస్తోందో! ఆహా! దాత ఎంత అదృష్టవంతుడు. ఎంత మనోహరుడు. అందుచే నా ప్రియమైన సోదరా! నీవు శాంతి, ప్రేమ, ఆనందము, సామరస్యము, కీర్తిని ఇచ్చే దాతవుకమ్ము. నీ అసలైన ఘనతని మాత్రమే గుర్తించి ప్రపంచమును 'ప్రేమ' అనే ప్రవాహములో ఓలలాడనిమ్ము. ప్రేమ అనే తృప్తిలోనే జీవించుము.

దాచుకొనలేవు కావున ఇచ్చివేయుము. ఇచ్చివేయుము. నువ్వు ఇవ్వగల వాడవు కనుక దాచుకొనలేవు అందుచే ధారపోయుము. ఇయ్యగలవు కావున ఇచ్చివేయుము. ఆగకుండా ఇచ్చివేయుము. మైమరచి ఇమ్ము. దాచుకొనుటలో మనకు ఆనందము లేదు. దానిని ఇచ్చివేయుటలోనే ఆనందము పొందుదుము. ప్రోగు చేయుట దుఃఖకారకము. పంచుకొనుట లేక ఇచ్చివేయుటలోనే ఆనందముంది. అందుచే ఇచ్చువాడు భగవంతునిలోను, దాచుకొనువాడు

మృత్యుభయంతోను ఉందురు.

నీకు ఇవ్వడానికి ఏమీ లేని నాడు నీ చివరి రక్తపు బొట్టు ఉన్నంతవరకూ (ప్రాణమున్నంత వరకు) సేవలోనైనా తరించు.

ఆ భగవంతుని దృష్టిలో పుచ్చుకొనే వారికన్నా ఇచ్చేవారు ఎక్కువగా ఆశీస్సులు అందుకొంటారు. ఎందుకంటే ఇచ్చేవారు ఇవ్వడంలోని ఆనందము, భగవంతుని ఆశీస్సులు అందుకొను ఆనందము రెండూ పొందుదురు. అందుచే నువ్వు ఖచ్చితముగా మంచి దాతగాను ఆశీస్సులు అందుకొను వాడిగాను అమరుడవుకమ్ము. అందుచే ప్రియ తనయుడా ఇప్పుడే 'విశాల' ప్రపంచమునకు **'నిరంతరము మైమరచి ఇచ్చివేయుము'** అను సందేశముతో ఇప్పుడే వెళ్ళుము. భాషలకు అందని ఈ నా సందేశముతో శాంతి ప్రేమలను ధారాళముగా ప్రవహించనిమ్ము. ఊఁ ...... ప్రవహించనిమ్ము"

నేను అట్లే మైమరచి నిశ్చల శాంతి భావం నాలోపల, బయట కూడా నిండియుండగా గంభీరంగా గర్జించే ఆ జలపాతంలో నిశ్చలతను అనుభవించగలిగాను.

ఈ సందేశము నన్నెంతో ఆనంద పరచింది. నాలో నూతనోత్సాహాన్ని నింపింది. నేను ఇవ్వదలిచాను కేవలం మాటలు, ఆలోచనలేకాక నా జీవితాన్ని ఆత్మనుకూడా ఇచ్చివేయదలిచాను.

నాకు భౌతికంగాను, మానసికంగాను, ఆధ్యాత్మికంగాను ఉన్నదంతా– 'ఉన్నది అంతా' మానవాళికి అంతటికి చెందుతుంది. ఓ ప్రియ భగవంతుని సంతతులారా! ఇదిగో నారక్తము, మాంసము, ఎముకలు, ఇదిగో నా మనస్సు, తెలివి, ఇదిగో నా హృదయము, నా ఆత్మ. అందుకోండి.

ఈ అనంతమైన నా ప్రేమను పంచుకోవడానికి తప్పకవచ్చి దానిని



పంచుకోండి.

దయచేసి నా ప్రేమను స్వీకరించి, ఆ మహాభాగ్యము నాకు కలిగించండి. నన్ను వేరు చేయకండి. ఎందుకంటే ప్రతీ అణువు, నాలోని ప్రతీకణం మీకు చెందినదే కదా!

నేను ఈ భౌతికరూపంలో జీవించి ఉండడం మీతో నా ప్రేమనంతా పంచుకోవడానికే.

ఒక్క మాటలో చెప్పాలంటే – **ఇమ్ము** ఇదే పవిత్ర నయాగరా సందేశము.

ఓ ప్రియమైన నయాగరా ! నిన్నేరీతిగా ప్రేమించను? ఈ యావత్ప్రపంచానికీ నీ విచ్చిన ఈ మహోన్నత సందేశానికి నీకెలా కృతజ్ఞత తెలుపగలను?

అక్కడ నుండి తిరిగి రావడానికి నెమ్మదిగా కదిలాను. నా కాళ్ళు అయిష్టంగానే దారిని అనుసరిస్తున్నాయి. కానీ నా హృదయం నిండా నిజమైన శక్తి నిండి ఉంది. నా కాళ్ళు ఇక ఏ మాత్రం నేలమీద లేవు. గాలిలోనే నడుస్తున్నాను.

ఆ కొండల్లో గుట్టల్లో వాటిలో ఆప్యాయతననుభవించుతున్నా. చెట్లని, మొక్కల్నీ ఆత్మీయంగా స్పృశించాను. పైరగాలితో ముచ్చటించాను. జీవదాత అయిన సూర్యునితో నా ఊపిరిని కలిపాను, చిన్న పిల్లలమందహాసాన్ని పంచుకున్నా. అటు ఇటు పోతున్న సోదర సోదరీమణుల హృదయపూర్వక ఆత్మీయతను ఏకత్వ భావనలో అనుభవించాను. ఎప్పుడు ఓంకారాన్ని స్మరిస్తున్నా గానం చేస్తున్నా, దానిని ఏకొద్దిమందికో గాకుండా సృష్టిలోని అందరకూ ఇస్తున్నా. ఇస్తూనే ఉన్నా. అయినా ఇప్పుడు నేనొక కొత్తజీవిని. నయాగరా నాకు నూతన జన్మనో లేక పునర్జన్మనో ప్రసాదించింది. నేనిప్పుడు

మహాకాంతి వెల్లువలను, శాంతి నిండిన నదులను, సజీవ మహా సాగరాలను ధారపోయగలను.

ఈ ఘనత అంతా నయాగరా జలపాతందే. నాకు జీవితాన్ని, ప్రేమను, కాంతిని ఇచ్చిన నయాగరా బిడ్డనే నేను.

**జ్ఞాపిక :** చాలా సంవత్సరాల క్రితం అమెరికాలోని అత్యద్భుతమైన నయాగరా జలపాతాన్ని దర్శించినపుడు పూజ్యశ్రీ స్వామి ఓంకార్‌చే ఇది వ్రాయబడింది. సందేశపూర్వకంగా యున్నవారి భావాలు ఆ రోజుల్లో తూర్పు, పశ్చిమ దేశాలు అనే బేధం లేకుండా ఎందరినో ఉత్తేజపరిచి ఎంతగానో ప్రశంసించబడినవి. ఎన్నో పునర్ముద్రణలు వేయబడి ప్రజాదరణ పొందినవి. "న్యూవరల్డ్ కాలెండర్ లేడీ" అని ప్రఖ్యాతగాంచిన మిస్, ఎలిజిబెత్ ఎకిలస్ దీనిని శాశ్వతముగా పదిలపరుచుకొనుటకు వీలుగా ఒక ప్రమాణ పత్రంగా ముద్రణ చేయించి అన్ని చర్చిలకూ బుఫాలోని శాంతి సంస్థలకు పంపారు, దివి నుండి ఒక దివ్యాత్మ పంపిన సత్య సందేశముగా వారందరూ భావించారు. ఈ రీతిగా శాంతి బీజాలు వెదజల్లిన సోదరి ఎలిజిబెత్ ఎకిలెస్‌కు మా హృదయ పూర్వక అభినందనలు.

**సోదరి సుశీలాదేవి.**

లోకా స్సమస్తా సుఖినోభవంతు

ఓం ఓం ఓం



# ఒకే ప్రపంచము

ఉన్నది ఒకే ప్రపంచమా లేక రెండు ఉన్నవా? ఉన్నది ఒకే ప్రపంచం, కానీ అంతులేని కోర్కెలతో ఈ ఒకే ప్రపంచాన్ని మానవుడు రెండుగానూ అనేక కోర్కెలు, ఆశలకు తగినట్లుగా అనేక ప్రపంచాలుగానూ ఉన్నట్లు చూస్తున్నాడు. వేదాంతమనగా జ్ఞానమునకు అంతము. అదికూడా ఒకే సత్య ప్రపంచాన్ని లేక ఒకే భగవత్ చైతన్యాన్ని గుర్తిస్తుంది. "చీకటిలో తాడును చూచి పాముని భ్రమించే మానవుడు సత్యమైన తాడుని గుర్తించలేకున్నాడు." అంటుంది. అట్లే అజ్ఞాని అయిన మానవుడు బలహీనత, భయాలవల్ల సత్యజ్ఞానంలేక అంతులేని ఆందోళనకీ, దుఃఖానికి లోనవుతున్నాడు.

అంతరంగంలోనూ బాహ్యంలోనూ అంతానిండి ఉన్నది ఆ భగవంతుడొక్కడే. ఆ భగవంతుని చైతన్యంతో జీవించగల్గిన మానవుడు ఆహా! ఎంత అదృష్టవంతుడు! ఉత్తేజభరితమైన ఆలోచన ఇపుడు ప్రాధాన్యం పొందడానికి పూజ్యులు శ్రీరామానంద తీర్థుల వారి ప్రియమైన ఒక ఆలోచనే కారణం. వారు నీలగిరిలో గల కోటగిరిలోని మన ఆశ్రమంలో లక్ష్మీ విహార్‌లో సుమారు రెండు వారములు బస చేశారు. వారి మౌనం, శాంతి, ప్రేమపూర్వకమైన వారి ఆదర్శ జీవితంలో కొన్ని రోజుల భాగ్యాన్ని శాంతి ఆశ్రమం పొంది పునీతమైంది. రోజూ మాటలతో గాక, మౌనంతో మేమిరువురం సుదీర్ఘంగా భాషించుకునే వారము. స్వామీ శ్రీరామతీర్థ వారి అభిమానమైన, మాకు ప్రియమైన రామతీర్థ శాంతికళాశాలను, దాని గొప్ప భవిష్యత్తును గూర్చి కొన్ని సందర్భాలలో ప్రస్తావించేవారు. మాతోనేయున్న శ్రీ వినోబాభావే గారి ప్రత్యేక ఆశీస్సులు అందుకున్న శ్రీరామతీర్థ శాంతి కళాశాల ఎంత ధన్యమైనది! అది మంచి భవిష్యత్తుతో వర్ధిల్లగలదు.

శ్రీరామానంద తీర్థజీవంక నేను చూచునప్పుడు, వారి పూజ్య

గురుదేవులైన శ్రీ నారాయణ స్వామిజీ, దైవ భావనలో వారి సేవా కార్యక్రమాలను ఈ స్వామి రామానంద తీర్థ ద్వారా నిర్వహించు చున్నారా? అనే భావం కలిగేది.

ఇటీవల మేము మా తాత్విక విషయములు ప్రస్తావించు చున్నప్పుడు స్వామి రామానందతీర్థ నాతో "స్వామీజీ! మీరు ఉన్నతమైన మీ స్వంత ప్రపంచంలో నివసించుచున్నారు" అన్నప్పుడు ఆ మాటలు నా హృదయాన్ని తాకి నా ఆనందానికి అవధులు లేకుండా చేశాయి.

ఆహా! నిజంగానే అంతా ఆ భగవంతుని మయమే అయి ఉండి అందులోని ప్రతీఒక్కరు సజీవమైన భగవంతుని రూపాలే అయిన ప్రపంచంలో నివసించుట ఎంతటి భాగ్యమో కదా! స్మామీజీకి నా పై గల ఈ ప్రేమపూర్వక ఉన్నత భావము నిలుపుకొనుటకు నేను తరుచూ అంతర్ముఖుడనై పాదముల నుండి శిరస్సు వరకూ భగవంతునిలోనే యున్నానా లేదా అని చూసుకొనే వాడిని. ప్రతి అణువు లోను అనంతమైన ఆ దివ్య జ్యోతిని ఒక జీవిలో అనుభవైక్యంగా చూడగల్గుట ఎంతటి అద్భుతానుభవం. మరలా వేంటనే నా చుట్టు యున్నదంతా భగవన్మయమేనా కాదా, బాహ్యంలో కూడా ప్రతీ పువ్వూ, పక్షీ, పశువు, మనిషిలోనూ ఆయననే చూడగల్గుతున్నానా లేదా అని కనులు తెరచి చూసే వాడిని.

నిజంగానే దైవచింతనలో యున్న వానికి దైవం తప్ప ఇంకేమీ ఉండదు. చల్లని పిల్ల వాయువులోనూ వెచ్చని సూర్యకాంతిలోనూ ఉన్నది ఆ దైవమే. మనస్మృతులు చెప్పినట్లు ఆ భగవంతుని వల్లనే సూర్యుడు ప్రకాశించుచున్నాడు. గాలీ వీచగల్గుతోంది. పువ్వు వికసించగల్గుతోంది, పక్షులు పాడగల్గుతున్నాయి, పసివాడు ఆడుకోగల్గుతున్నాడు, ముని ధ్యానంలో ఉండగల్గుతున్నాడు.

భగవత్సాక్షాత్కారాన్ని ధ్యానముతో నిరాకారునిగానేగాక, అంతా



ఆయన సృష్టే గనుక బయట కనిపించే ప్రతీ అణువునందూ కూడా అనుభవించ గలగాలి. ప్రపంచమంతా, మహాసముద్రంలో పుట్టిన నీటి బుడగ వలే, భగవంతుని యందే పుట్టి, వాని యందే నిలచి, చివరకు భగవంతునిలోనే లీన మగును. అశాశ్వతమైన నీటి బుడగను గాక, శాశ్వతమైన సత్యమైన సచ్చిదానంద స్వరూపమైన మహాసాగరాన్ని గుర్తించగలిగిన వారు ధన్యులు. అదే సత్యం, జ్ఞానం అనంతానందం.

అవును నిజమే, స్వామీజీ అన్నట్లుగానే నేను నాదనే ప్రపంచంలోనే నివసిస్తున్నా. ప్రియ పాఠకులారా! ఆ భగవంతుడే మీలో ఉండి చదువుతున్నాడు. ఈ ఏక ప్రపంచంలో కంటికి కనిపించేదంతా ఆ దైవ స్వరూపమే. భగవంతుడు తప్ప మరేదీ లేదు. "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ". రెండవదనేది ఏదీలేని ఏకభావనే బ్రహ్మము లేక దేవుడు. అతడి స్వరూపం మౌనం తరంగాలనేవి ఏవీలేని మహోన్నత మౌనం. అట్టి సంపూర్ణమౌన స్వరూపునకు మనము శిరస్సు వంచి ప్రగాఢ భక్తి భావంతో నమస్కరింతముగాక!

ఇప్పుడు ఆచరణ సాధ్యమైన నా సందేశవిషయాన్ని చెప్తాను. ఇదంతా సచ్చిదానంద స్వరూపమైన ఏక ప్రపంచం కావున నేను సుఖ దుఃఖాలు రెండింటిలోనూ భగవద్భావనలోనే ఉండుటకు ప్రయత్నిస్తు న్నాను. భగవద్భావనే నిండి యున్న ప్రపంచంలో ఇక సుఖ దుః ఖాలకి తావేది? మరొక అడుగు ముందుకెళ్లి ఆలోచిస్తే ఆ భగవత్ చైతన్యాన్ని మెలుకువగా ఉన్నప్పుడే గాక నిద్రలోనూ అనుభవించడానికి ప్రయత్నిస్తున్నా. నిజంగానే అసలు నిదురే పోని ఒక శక్తి యున్నది. అదే భగవంతుడు. అదే అంతర్జ్యోతి. అదే విభజించడానికి వీలులేని, రెండవది అనేది లేని, సోహం (అతడు నేనే) అనే జ్యోతి. మరింత లోతుగా చెప్పాలంటే ఆ భగవత్ సాక్షాత్కారభావన బాధలోనూ, నిద్రలోనే గాక చివరకు మృత్యువులో కూడా అనుభవించాలనే గట్టిగా కోరుకుంటాను.

ప్రశ్న : మరణంలో కూడా దైవ భావన సాధ్యమా?

జవాబు : ఆ......! ఎందుకు సాధ్యం కాదు? "దైవం తప్ప మరొకటి లేనే లేదు" అనే భావనలో నీవు ఉన్నప్పుడు అది తేలికగా సాధ్యమే. ఎందుకంటే భగవంతుడు మార్పు లేని నిత్య సత్యమే కదా! ఈ సత్యమనేది మరణం పిదప కూడా సత్యంలోనే ఉందికదా!

అసలు భగవంతుడనే భావనలో బాధనేది ఉంటుందా? ఆ భావనకు నిదురనేది ఉంటుందా? భగవద్భావనకి మృత్యువనేది ఉంటుందా? స్వానుభవంతో భగవత్సాక్షాత్కారంలోనే యుండే వ్యక్తికి, దేవునితో ప్రత్యక్షంగా ముఖాముఖీ అనుభూతి భాగ్యాన్ని పొందిన వ్యక్తికి, ఇది తేలికైన, అర్థమయ్యే, అతి చిన్న విషయం. కానీ కేవలం గ్రంథ పఠనం ద్వారా మేధా సంపద గల పండితునికి ఈ సత్యాలు అసత్యంగానూ వింతగానూ, విచిత్రంగానూ గందరగోళంగానూ నమ్మశక్యం కానివి గానూ కూడా ఉండవచ్చు. మనం ఇక్కడ ఇప్పుడు ప్రస్తావిస్తున్నది దివ్యజ్యోతి మయము, ఏక ప్రపంచభావన అయిన భగవత్ చైతన్యం గురించి. ఇక ఆ దివ్య జ్యోతి ఔన్నత్య శిఖరం నుండి సామాన్య నిత్య జీవిత స్థాయికి దిగివచ్చి, మనం రోజుచేసే చిన్ని చిన్న అంశాల్లోనూ, పెద్దవైన విషయాలలోనూ, భగవంతుని దర్శిద్దాం. అట్లా భగవంతుని ఎల్లప్పుడూ దర్శించగలగడంలోనే నిజమైన సంతోష రహస్యం దాగి ఉంది. అందుచేత భగవంతుని అనుభూతిని అంతరంగం లోనూ బాహ్యంలోను పొందే భాగ్యాన్ని ఇపుడే అలవాటు చేసుకొందాం. ఆఖరికి వ్రాసే నా చేతికదలికలోనూ అది యున్నది. దీన్ని మీరు చదువగలుగు తున్న శక్తిలోనూ అది ఉన్నది. ఆ అనుభూతి పొందుటకు ప్రియపాఠకులారా ప్రయత్నిద్దాం !

నిజముగానే ఆయన మనకళ్ళలో మెరుస్తున్నాడు, మన మనస్సులో ఆలోచన చేస్తున్నాడు, మనహృదయ కవాటాలను తడుతున్నాడు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసలలో 'సోహంగా' ప్రవహించుచున్నాడు. అతడే విశ్వ



శక్తిగా ఉన్నాడు. మనం సాధారణమైన, చూడగలిగిన సోహంను నమ్మకంతోనూ, ఆగకుండాను అనుసరిస్తే అదే మన అదృశ్యంగా ఉన్న సోహం భావనలోకి ఏకప్రపంచ ఆత్మ భావనే లక్ష్యంగా నడిపించగలదు.

ఆ భగవంతుని దివ్య జ్యోతిని దర్శించగలుగుట మనను అందరి జన్మ హక్కు. అట్లు ఆ చైతన్య భావాన్ని పొందు భాగ్యమును భగవంతుడు ప్రసాదించు గాక. బాధ, సుఖ-దుఃఖాలలోనూ, నిదురలోను, మెళుకవలోను చివరకి జీవించుటలోను, మరణించుటలోను కూడా అది ఒకే రీతిగా ఉంది. - సత్యాన్ని గ్రహించి దానిని పొందే ప్రయత్నం చేద్దాం.

వాస్తవానికి భగవత్ చైతన్యము అనే ప్రపంచం ఎలాంటి భిన్నత్వమునకు లోను గాక పూర్తి స్వేచ్ఛ కలిగి యున్నది. ఎప్పుడైనా ప్రపంచంలో వివిధ జాతుల మధ్య దేశముల మధ్య శాంతి సద్భావము, సామరస్యము నెల కొనాలి అంటే అది స్థిరమైన, ధృఢమైనటువంటి, సత్యము, లేక ఒకే భగవత్ ప్రపంచ భావనలోనే ఏర్పడాలి. అట్టి ఒకే భగవత్ భావనా ప్రపంచం మాత్రమే వ్యక్తులలోను తూర్పు, పశ్చిమ అనే తేడా లేకుండా ప్రపంచంలోనూ అజ్ఞానము, ద్వేషము, అహంకారము, గర్వము ఏహ్యాభావములను తొలగించి శాంతిని స్థాపించ గలదు. అట్టి ఏక ప్రపంచ భావనకు, దివ్య కాంతికి మ్రొక్కుదుముగాక.

పూజ్యశ్రీ స్వామి రామానంద తీర్థ వారికి సుదీర్ఘ సేవాభావ జీవితము కొరకు, శాంతి కొరకు ప్రార్థన చేయుచూ వినయముగా ఈ వ్యాసము సమర్పించబడినది.

(జీవితమంతా ఒక్కటే అనే కనీస సత్యమునైనా తెలుసుకొనుటకు మానవుడు మేలుకొనుగాక)

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.
ఓం ఓం ఓం



# అత్యంత ధనవంతుడు

ప్రశ్న: ప్రపంచంలోకెల్లా అత్యంత ధనవంతుడెవరు?

జవాబు: నిస్వార్థుడు, కోరికలేని వాడు ఎవరో అతడే సృష్టి అంతటికీ అత్యంత ధనవంతుడు.

నా ఈ డబ్బై సంవత్సరాల జీవితానుభవాన్ని తరచి చూడగా అనంతంగా లభిస్తున్న భగవంతుని ఆశీస్సులూ, అలాగే ఎప్పుడూ పొందుతున్న రక్షణ వల్ల నేనే ప్రపంచంలోకెల్ల అత్యంత ధనవంతుడినని నా అంతర్వాణి చాటి చెబుతోంది. తరచూ నేనే ఆ భగవంతునికి నచ్చిన ముద్దు పిల్లవాడినని అనుకుంటూ ఉంటాను. ఎందుకంటే ఆయన జాగ్రత్తగా సాకవలసిన కుంటి గొర్రెపిల్లను నేనే కదా! ఆయన మందలో మిగిలిన గొర్రెల విషయం కాసేపు పక్కకు పెట్టి తప్పిపోయిన గొర్రెకోసం శ్రద్ధగా వెతికి తెచ్చి మందలో కలుపును. భగవంతునికి



తన పిల్లల మీదున్న ప్రేమ అంత గొప్పది.

ప్రపంచమంతటికీ వెలుగునిచ్చే అ సూర్యుడినీ, ఆకాశంలో మెరిసే కళ్ళలా కనిపించే కోట్లకొద్దీ నక్షత్రాలనీ, అందమైన చందమామనీ చూచినప్పుడు దివ్యమైనవన్నీ నా స్వంతమే అనిపించి, వీటికి నేనే అసలైన యజమాని అవడం చేత నేనే కదా, ఈ ప్రపంచంలోకెల్ల అత్యంత ధనవంతుడిని అనిపిస్తుంది. జీవప్రధానములైన పంచభూతములు భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం మాటేమిటి? అవును, ఇవన్నీ కూడా నావే. ఆకాశంలో గానీ, భూమ్మీదగానీ, పైన గానీ, క్రిందగానీ ఎటువైపు చూసినా నాకు చెందనిదంటూ ఏదీలేదు. వీటినన్నింటిని నేను ప్రేమిస్తున్నాను. కాబట్టే అవన్నీ నావే. మరి పక్షులు, జంతువులు మనుషుల మాటేమిటి? అవీ నావే. చక్కని సువాసనలు వెదజల్లే పూలు, మహోన్నత హిమాలయ పర్వతాలు, జీవనది అయిన గంగ. ప్రంపంచంలోని అన్ని నదులు అగాధములైన మహాసముద్రాలు – ఇవన్నీ కూడా నావే.

ప్రశ్న: నేను ఒక్కడినా? లేక ఇద్దరుగా ఉన్నానా?

జవాబు: నేనెప్పుడూ ఒక్కడుగానే ఉన్నాను.

రెండోది అనేది ఏదీలేని ఒక్కడినే కాబట్టి అన్నీ నాకే చెందుతాయి. నా ప్రేమలోనే అందరూ ఇమిడి ఉన్నారు. అన్నీ నా స్వంతమే అవడం చేత ఇక ప్రపంచంలోని సంపద అంతా సహజంగా నాకే చెందుతుందని వేరే చెప్పనవసరం లేదు కదా! ప్రపంచంలోని అన్ని బ్యాంకులలోని అన్ని ఖాతాలల్లో గల ధనమూ నా స్వంతమే అని భావించినపుడు నేనెంత ధనవంతుడిని అనిపిస్తుంది. అందరూ నా వారే అయినపుడు వారు ఉదారంగా దానములిచ్చే దానకర్ణులా! కాదా! అనే భేదం నాకు లేదు. ప్రపంచంలోని సంపదకంతకూ యజమాని అని భావించడం చేత నాకు ఎప్పుడు ఏది కావల్సినా ఆ భగవంతునితో ఒక్క చిన్న

మాట అనగానే ఆయన ఎలాంటి స్వార్థంలేని నా చిన్న కోర్కెను తీరుస్తాడు. తరచుగా అడక్కుండానే తీరుస్తాడు. ఆహా! ఎంత దయ భగవంతునికి నామీద! నన్ను ఎంత బాగా అర్థం చేసుకున్నాడు! భగవంతుడు నన్ను దేశాటన చేసే ఒక సాధువుగా నీలగిరి కొండలలోని లక్ష్మీవిహార్‌కి తీసుకువచ్చి పళ్ళ తోటలు, టీ తోటలు, ఎప్పుడూ నీరుండే ఏరు, గొప్ప భవనాన్ని ఇచ్చి క్రమంగా ఒక రాజుగా చేశాడు. నాకు చెందిందేదైనా మీకందరికీ చెందుతుంది, ఎందుకంటే ఆయన నాకేమిచ్చినా అది భగవంతుని పిల్లలందరికీ చెందుతుంది. నా సంపదంతా అందరి సమిష్టి ఆస్తి.

మనోహరమైన కోటగిరి ప్రపంచపు అత్యంత ఆరోగ్యమైన ప్రదేశంగా భావించబడుతోంది. తూర్పుదేశాలలోని "బ్రిగ్‌టన్‌గా" దీన్ని పిలుస్తారు.

ఆనందోత్సాహాలతో నేను తరచూ 'అనారోగ్యమనేది లేకుండా ఆనందం గానూ, ఆరోగ్యం గానూ, దీర్ఘకాలం జీవించాలని కోరుకుంటూ ఉంటే అత్యంత శాంతియుతము, ఆరోగ్యమైన ప్రదేశం నీకు కోటగిరే' అని తరచూ నాలో నేను అనుకుంటుంటాను.

తరచుగా ఆరోగ్యము, శాంతి కోరి సమీపంలో వారేగాక దూరప్రాంతాల నుండి కూడా భక్తులు వచ్చి కొన్ని రోజులు ఇచట గడపాలని కోరుకుంటున్నారు. కానీ వారందరికీ వసతి సదుపాయం సరిపోక అసౌకర్యంగా ఉండేది. అందుచేత ఒక ప్రార్థనా మందిరము, దానికి ఒక వైపున యున్న వరండాలో గ్రంథాలయం, మరొక వైపున యున్న వరండాలో అతిథుల సౌకర్యం కొరకు రెండు గదులు నిర్మించాలని తీర్మానం చేశాము. అందరి సౌకర్యం కొరకు జరిగే ఈ నిర్మాణము చేయుటకు రూ. 20,000/–లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అపరిమితమైన భగవంతుని సంపదలో ఈ చిన్న మొత్తము



ఒక లెక్కలోనిదికాదు.

ఒక్క భక్తుడు తలుచుకున్నా చాలు – ఈపని పూర్తవడానికి. అతడు భక్తకోటికి ఒక గ్రంథాలయం, ప్రార్థనా మందిరం, రెండు వసతి గృహాలూ సమకూర్చగలడు. శాంతికాముల సౌకర్యార్థం అతని లేక ఆమె పేరు మీద అది శాశ్వతమైన కానుకగా నిలిచిపోతుంది.

ఈ ప్రార్థనా మందిరం ఒకరే కట్టించారా? లేక వెయ్యి మంది కట్టించారా అన్నది ప్రశ్న కాదు. ఏది ఏమైనా అది పూర్తయిందా లేదా అనేది ప్రధానం. గత సంవత్సరం భగవంతుని దయవల్ల రాయి, ఇటుకలతో పునాది పని పూర్తిచేయగలిగాం. ఈ ఏడాది గుమ్మాలు, కిటికీలు మొదలైన చెక్క పనులు పూర్తి చెయ్యగలుగుతున్నాం. ఆహా! దైవమెంత కరుణామయుడు.

మొదట కొందరు అత్యుత్సాహంతో ఉదారంగా వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చడం మరచిపోయినపుడు, నాకు విచారంగానే ఉంటుంది. కాని అలాంటి వారి వెంటబడి వారి వాగ్దానాలు గుర్తు చేసి, వారినెప్పుడూ బాధించను. సర్వవరాలను ప్రసాదించే ఆ భగవంతుడినే అట్టివారి హృదయాలలో ప్రవేశించి, వారు చేసిన వాగ్దానాలను వారికి గుర్తుచేయవలసినదిగా ప్రార్థింతును. భగవంతుడు వారి హృదయాలను తట్టగానే, శుష్కించిన హృదయాలలో కూడా దాతృత్వం పరవళ్ళు తొక్కే వుంటుంది. ఆహా! భగవంతుడు చేయలేనిదేముంది! ఆయన దివ్య స్పర్శ లోభిని దాతగాను, ఎండిన హృదయాలను ప్రేమ నిండిన కల్పవృక్షాలుగానూ చేయగలదు.

మొదట అతివిలువైన ఈ ఆశ్రమ భూములు స్వాధీనం చేసుకునే సమయంలో, విలువైన చెక్క సామాగ్రికి గానూ రూ. 20,000/–లు చెల్లించవలసిందిగా కోరారు. చెల్లించవలసిన సమయం సమీపిస్తుండగా రాత్రికి రాత్రే ఆ మొత్తాన్ని భగవంతుడు వారికి అందేలా చేసి లక్ష్మీ

విహార్‌ని పూర్తి హక్కులతో మాకు అప్పగించారు.

ఎంతోజీవం ఉట్టిపడుతూ ఆత్మని జాగృతి చేసేదిగా ఉంది ఈ క్రింది కవిత

**దాన మొసగుట:**

ఇమ్ము... ఇమ్ము... ఇచ్చివేయుము.
మక్కువగా అక్కున దాచింది.
మారేను మున్ముందు పనికిరాని మన్నై
ప్రాణమేపోవునపుడు ఈయలేవు తృణమైనా
గట్టిగా నొక్కి పట్టినా జారేను వేళ్ళ మధ్య నుండి
ఇస్తివేని దానంగా పారేను అమృతధారలై ఇలలో

ఏది తెల్సుకుంటే సర్వమూ తెలుస్తుంది? నీలోని భగవంతుని ఉనికి తెల్సుకొని, సత్యవర్తనములో ఉంటే అన్నీ అందులోకి వచ్చి చేర్తాయి. సత్యమైన భగవంతుని తెల్సుకొన్నచో నీవే ప్రపంచంలోకెల్లా అత్యంత ధనవంతుడివిగా గ్రహించగలవు. సర్వవ్యాపకునిగా భగవంతుని గుర్తించిన నాడు అన్ని ప్రపంచాలకి అధిపతివై సృష్ఠిలోనే నీవు అత్యంత ధనికుడవని గుర్తిస్తావు.

"అసలు ప్రాక్ పశ్చిమ దేశాలే కాదు, మొత్తం ప్రపంచంలోని సమస్యలకు గానీ, గతంలోగానీ ప్రస్తుతం గానీ ఇక ముందైనా గానీ జరిగే యుద్ధాలకీ, ప్రపంచయుద్ధాలకి తన కొరకే తాను జీవించే స్వార్థపరుడు, అజ్ఞానియే కారకుడు. తన దేశంలో గానీ ప్రపంచంలో గాని సమస్యలకి అతడే కారకుడవుతున్నాడు" అని అంతరంగంలో నేనెల్లప్పుడూ అనుకుంటాను.

స్వార్థపరుని పేరు ప్రఖ్యాతులు ఎండిపోయిన గడ్డిపోచలు, లేక వాడిపోయి రాలిపోతున్న పువ్వుల్లాంటివి. లక్షలాది మంది అమాయక ప్రజల మృతికి కారకులైన యుద్ధోన్మాదులు, క్రూరులు మహాబలవంతుల



మని విర్రవీగిన వారేమయ్యారు? నిర్మలమైన, విశ్వాసముతో కూడిన, అమాయకమైన ప్రజలకే ఆ భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. ప్రస్తుత ప్రపంచంలో అశాశ్వతమైన భౌతిక విషయాల వెంట పరుగులెత్తకుండా భగవంతుని వైపే మొగ్గుచూపుదాం. ఎప్పుడైన ఆరేపోయే ప్రాణజ్యోతి ఆరిపోకముందే అమూల్యమైన ఈ మానవజన్మ పరమార్థాన్ని గ్రహిద్దాం. మనలోని ఏమనిషికి ఏదీ కావాలో, ఏ జాతికి ఏది మేలో ఆ భగవంతునికి మాత్రమే తెలుసు. అందుచే క్షేమం కొరకు కావలసింది మన అభీష్టం కాదు. ఆయన అభీష్టం.

ప్రియపాఠకులారా! దొంగలు దోచుకోలేని, కాలం నాశనం చెయ్యలేని, అనంతమైన సంపదను మీతో పంచుకోవాలని నా హృదయం ఆరాటపడుతోంది. అదే మీకు పవిత్రమైన మానవజన్మ లక్ష్యాన్ని, మానసిక శాంతిని ప్రసాదించగలదు. అన్ని బంధాలకు కోరికే మూలం. కోరికలను జయించినపుడే సంతృప్తి అనే సింహాసనంపై ఆసీనుడవై భగవనుదనుగ్రహాన్ని ఇప్పుడు ఇక్కడే పొందగల్గుతావు.

ఎవరైనా అజ్ఞాని "అయితే స్వామీజీ మరి ఈ ఆశ్రమాలు, ఆసుపత్రులు, గురుకులములు, ముద్రణశాల, గృహాలు, శాంతి నివాసములు మొదలైనవి కోర్కెల ఫలితాలు కాదా?" అని అడగవచ్చు. దానికి నా జవాబు "అవి నన్ను బంధించే కోర్కెలు కావు. ఎందుకంటే అవిన్నీ మీ ఉపయోగం కోసమే. అవన్నీ మీకు చెందినవే, అవి నా నుండి మీరు పొందిన వారసత్వపు ఆస్తి".

అన్ని కోర్కెలు తీర్చే ఆ కల్పవృక్షమే భగవంతుడు. అందుచే సర్వవ్యాపకమైన ఆ నీడలో కూర్చుని ఆయన సంతతికి మేలు చేకూర్చేవన్నీ సమకూర్చమని కోరుకుంటాను. ఈ పసివాని కోర్కెలను ఆయన వెంటనే తీర్చును. అన్ని కోర్కెలు తీర్చువాడు, సర్వసంపదలు చేకూర్చువాడు, ధనవంతులకే ధనవంతుడు, ఉన్నతులకే అత్యున్నమైన అట్టివానికి భక్తి ప్రపత్తులతో శిరస్సువంచి నమస్కరిస్తున్నాను. ఆయన

అడుగుజాడలలోనే నడిచే శక్తినీ, అంతకన్నా ముఖ్యంగా, ఆయన వలె కోర్కెలు లేనివానిగా ఉండునట్లు అనుగ్రహించమని ఆ భగవంతునే వేడుకొనుచున్నాను. నిజమైన శాంతి, కోర్కెలను జయించువానిలోనే ప్రవహించును. ఆది మధ్యాంతరహితుడైన ఆ భగవంతుడొక్కడే ఎట్టికోరికా లేనివాడు.

పవిత్ర మానవజన్మ లక్ష్యమైన సేవను గూర్చిన ఈ చక్కని గేయంతో నా సందేశమును ముగించుచున్నాను.

నీవు చేయగలిగినంత మంచిని,
నీకు గల అన్ని విధములుగానూ,
నీకు గల అన్ని మార్గాలలోనూ,
నీకు లభ్యమయ్యే అన్ని ప్రదేశాలలోనూ,
నీకు వీలైన అన్నిసమయాలలోనూ,
నీకు సాధ్యమైన వారందరికీ
నీకు ఎంతకాలము వీలయితే అంతకాలం చేస్తూనే ఉండుము.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు.

ఓం ఓం ఓం





## అత్యంత ఆరోగ్యవంతుడు

'అత్యంత ధనవంతుడు' అను గతవ్యాసం వ్రాసిన నాటి నుండి నేను ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిననే భావన నాలో ఎంతో ఆనందాన్ని కల్గించింది. దానిని వ్రాయడం లో నేను పొందిన ఆనందము, బలము, మన శాంతి పత్రిక పాఠకులలో కూడా వ్యాసము చదువునపుడు కొందరైనా అనుభవించి ఉంటారని భావిస్తాను. అంతరంగంలో కల్గిన భావంతో 'ప్రపంచంలో అత్యంత ఆరోగ్యవంతుడు'

అనే వ్యాసం కూడా, నా డబ్బై సంవత్సరాల వయస్సుని పరిగణనలోకి తీసుకునీ వ్రాయడం ప్రారంభించాను.

కోరికలేని మానవుడే అత్యంత ధనవంతుడు, అత్యంత ఆరోగ్యవంతుడు. మానవుడు తప్పక మంచి ఆరోగ్యము, బలము కల్గిన వాడై యుండాలి. ప్రపంచంలో అత్యంత ఆరోగ్యవంతుడెవరు?. నా జీవితాలోకనం చేసుకొని మనోబలం హృదయ బలం ఆత్మ బలముతో పదేపదే (అతిశయోక్తిగా కాకుండా) ఆనందంగా నేనే అది నేనే అని చెప్పగలను. నేనే ప్రపంచంలోకెల్లా అత్యంత ఆరోగ్యవంతుణ్ణి – కనీసం ప్రపంచ అత్యంత ఆరోగ్యశాలురలో ఖచ్చితంగా ఒకడినైనా అయి ఉంటాను.

అమాయక విమర్శకులు వెంటనే " అయితే మీ గుండె జబ్బు విషయమేమిటి?" అంటారు. అంతే కాదు ఈ వారమే నాకు తీవ్రమైన పంటి పోటు కూడా వచ్చింది. అయినప్పటికీ నేను పదేపదే ఆనందంతో చెప్పగలను నేను అత్యంత ఆరోగ్యవంతుడునని. ఒక చిన్న గుండె నొప్పిని నాకూ భగవంతునికీ మధ్య అడ్డుగా నిలవనిస్తానా? అలాగే ఏదో చిన్న సామాన్యమైన పంటినొప్పిని నాకూ భగవంతునికీ మధ్య అడ్డుగా ఉండనీయను! వీల్లేదు–కుదరదు. వెయ్యి సార్లయినా సరే అదంతే. ఆరోగ్యం నా జన్మహక్కు. అనారోగ్యమో బలహీనతో కాదు కదా! ఎలాంటి అనారోగ్యమైనా, శారీరక నీరసమైనా కదలి పోతున్న మేఘాల వంటివే. ప్రకాశించే ఆరోగ్యమే భగవంతుని నుండి మనం పొందిన నిజమైన వారసత్వం. అతి తీవ్రమైన నొప్పికి గురైనపుడు కూడా, నమ్మశక్యంకాని సత్యమేమంటే నా కొరకు నేను ప్రార్థించుకోవాలనే ఆలోచనే రాలేదు. నాకు గుండె నొప్పి వచ్చిన రోజుల్లో కూడా, భగవంతుడా! నా జబ్బు నయం చేయమని ఒక్కసారికూడా ప్రార్థించలేదు, అని వ్రాస్తే మీరు నమ్మగలరా? ఇది నిజం. నేను దైవ ప్రార్థనని నమ్మేవాడినే, కానీ ఆ ప్రార్థన ఎప్పుడూ నా కొరకు కాదు.



నా క్షేమం కొరకు నేను ప్రార్థన చేస్తే అది స్వార్థం అవుతుంది. ఇతరుల కొరకు చేసే ప్రార్థనలో నాకు ఆనందముంది. ఆ విధంగా ఇతరుల ఆరోగ్యమే నా ఆరోగ్యం వారి ఆనందంలోనే నా ఆనందం ఉంది.

ఎముక మార్పిడి వంటి అతిక్లిష్టమైన రోజుల్లో తీవ్ర రక్త స్రావంతో పక్కంతా రక్తసిక్తమైనపుడు, బాగా నన్ను కనిపెట్టుకున్నవారు అలసి సొలసి నిద్రలోకి జారుకున్నప్పుడు సైతము, ఆ భగవంతుడు నా ప్రక్కనే యుండి "బిడ్డా! నే నెప్పుడూ నీకు తోడుగానే ఉన్నాను.! చక్కగా సంతోషముగా యుండు" అని నా చెవిలో రహస్యముగా చెప్పుచూ నన్ను కనిపెట్టుకొనేయున్నాడు. ఆయన సర్వరక్షకుడు , నిత్యసహాయకుడు, విశ్రాంతి అనేది ఎరుగని వాడు. కొన్ని సమయాల్లో నేను ప్రార్థన చేశాను. అయితే అది నొప్పి నివారించమనో, బలహీనత తగ్గించమనో లేక పూర్తి ఆరోగ్యస్థితి ఈయమనో గాక నొప్పిని ఓర్పుతోను చిరునవ్వుతోను ఎదుర్కొనే శక్తిని ప్రసాదించమని. నన్ను పలకరించిపోయే మేఘాల వంటి అనారోగ్యాన్ని గానీ, ఆవరోధాలుగా నిల్చిన దేనినైనా గాని, నేను పరిపూర్ణ శిఖరాలు అందుకోడానికి ఎక్కేమెట్లు గానే స్వీకరించాను.

ఇలా ఆరోగ్యం గురించి ధనం గురించి వ్రాస్తున్నప్పుడు జ్ఞానంతో నిండిన ఈ క్రింది మాటలు నాలో మెదులాడుతున్నాయి.

ధన నష్టం జరిగితే ఏదీ కోల్పోలేదు
ఆరోగ్య నష్టం జరిగితే కొంత కోల్పోయాము
శీలమునకే నష్టం జరిగితే సర్వం కోల్పోయాము.

నా ప్రవర్తన అత్యున్నత సంపద అగుగాక. మానవునికి మహోన్నత వరం ఆరోగ్యం. ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండేవాడు ఎప్పుడూ ధనికుడే, కనీసం మానసికంగానైనా. సంపదతో అనుగ్రహింపబడి, దానిని పేదగా, అనారోగ్యవంతులుగా యున్న దేవుని

సంతానముతో పంచుకునేవాడే ప్రపంచంలో కెల్లా అత్యంత ఆనంద భరితుడు. అర్థించేవాడు కాదు. ఇచ్చేవాడే ఎల్లప్పుడూ అదృష్టవంతుడు. భగవంతుని పిల్లలుగా భౌతిక సంపదయేగాక మానసిక సంపదను కూడా ఇతరులకు ఇస్తూ వారితో పంచుకోవడం ఒక అదృష్టం. మంచి వారైన నా వైద్యుల సలహాలకు భిన్నంగా నేను ఆలస్యంగా ఆహారం తీసుకోవడం ఎక్కువ దూరం నడవడం విపరీతంగా శ్రమించి అలసి పోవడం, లాంటివి చేస్తున్నాను. అయినా దయామయుడైన భగవంతుడు నన్ను మీకు సేవచేసే భాగ్యం కలిగించడానికి ఆరోగ్యంగానే ఉండనిస్తున్నాడు.

ఏది జరగవలసి ఉందో అది దాని నిర్ణీత సమయంలో జరిగి తీరుతుంది. ప్రార్థనలు మన భవిష్యత్తును మార్చగలవా? 'ఏది విత్తుతామో ఆ పంటనే పొందుతాము' అనేది సహజ న్యాయం. మునులైనా, పాపులైనా, విజ్ఞులైనా, అజ్ఞానులైనా, ధనికులైనా, పేదలైనా ఈ న్యాయం ముందు ఒకటే. అందరికీ నిష్పక్షపాతంగా ఒకేరీతిగా అది వర్తిస్తుంది. ఇది "గణిత శాస్త్రం ముందు మేధావి, మోసగాడు కూడా ఒకటే" లాంటిది.

మితమైన, ప్రకృతి సిద్ధమైన ఆహారమే ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ మానసిక శాంతినీ కల్గించును. మనము తినే ఆహారమే మన ప్రవర్తనని నిర్ణయించును, జంతువుల వలే తింటే అట్లే ప్రవర్తించెదరు. ప్రకృతి సిద్ధమైన ఆహారము, సాత్వికమైన ప్రవర్తన తీరునే కల్గించును. ఆవులు, ఏనుగులు ఆకులు అలములూ తిని సాధు ప్రవర్తనతో ఆరోగ్యంగానూ, బలంగానే ఉన్నాయి. కానీ తోడేలు, పులి వంటి జంతువులు రక్తము, మాంసం ఆహారంగా గ్రహించి క్రూరంగాను భయంకరంగానూ ఉన్నాయి.

మన ఆధ్యాత్మిక జీవితంలో ఆహారం ప్రధాన పాత్ర వహిస్తోంది.



కొంతమంది మనం తినే ఆహారానికి, ప్రవర్తనకీ సంబంధం లేదనీ, దానిని పెద్దగా పట్టించుకోనక్కరలేదు, అని తేలికగా చూస్తారు. కాని మనం తినిన ఆహార ప్రభావం వెంటనే మన శరీరము, మనస్సు, ఆలోచనలపై తప్పక ఉంటుంది. ఏకోటి మందికో ఒక్కరు, జీవన్ముక్తుని వంటివారు, భౌతిక జీవన విధానం నుండి స్వేచ్ఛ పొందిన వారుంటారు. స్థూల శరీరానికి, మనసుకీ , ప్రపంచానికీ అతీతంగా ఉంటారు. అట్టి కారణజన్ములు ఏదైనా తినగలరు, ఏమైనా చేయగలరు. మానవాతీతులైన అట్టివారిని ఉదాహరణగా తీసుకుని పంచేంద్రియాలకి బానిస ఐన సామాన్యుడు దేనిని పడితే దానిని, తిని ఆరోగ్యానికీ, మానసిక ఆనందానికీ హాని కల్గించుకోరాదు. ముఖ్యంగా రక్తమాంసము లకు హాని కల్గించి, స్వైరవిహారము చేసే పంచేంద్రియాలను రెచ్చగొట్టే ఆహారము తినరాదు. ఋషుల అడుగు జాడలలో నడుచుచూ, తాత్విక జీవనానికి సహాయపడు నారింజ, అరటి పళ్ళు మొదలైన శాకాహారములనే తినుటకు ప్రయత్నించుట ఎప్పుడూ మంచిది, క్షేమకరమైనది. పాలు, మజ్జిగ, గోధుమలు, దంపుడు బియ్యము అన్ని రకముల పప్పుధాన్యాలు మంచి ఆరోగ్యానికి సహాయకారులే. ఆకు కూరలు వండ్లరసాలు శరీరంలో మలిన పదార్థాలను వదిలించుకోవడానికి సహకరిస్తాయి. అంతేగాక మితమైన, ప్రకృతి సిద్ధమైన ఆహారం ఆరోగ్యవికాసానికి ఎంతో మేలు చేస్తుంది. ఎవరో అన్నట్లు 'రోజుకొక ఆపిల్ పండు తిను, వైద్యునితో పనేవుండదు'. మరో ప్రకృతి వైద్యుడన్నట్లు "రోజుకొక కొబ్బరి కాయ మాత్రమే ఆహారంగా తీసుకుంటే ఏ రోగమూ, ఎలాంటి నీరసం లేకుండా నూరు సంవత్సరాల పైబడి మంచి ఆరోగ్యంతో జీవించగలరు". ఇంకొందరు "ఏకాదశి పౌర్ణమి వంటి పర్వదినాల్లో నైనా ఒక్కరోజు ఉపవాసం ఉంటే అది మంచి ఆరోగ్యానికి తోడ్పడుతుంది" అంటారు. మరొక బుద్ధిమంతుడు "ఉపవాస, విందు భోజనాల మాట అటుంచి భగవంతుణ్ణి

తెలుసుకొనుటయే నీ లక్ష్యము, దానిని ఇప్పుడు ఇక్కడే సాధించుము” అని అంటాడు.

ఉపవాసం వల్లనే భగవత్సాక్షాత్కారం అవుతుందనుకుంటే అది ఇప్పుడే చేయుము. అలా కాదు సుష్ఠుగా భుజిస్తేనే భగవంతుని దర్శించగలను అనుకుంటే అదీ ఇప్పుడే చేయుము. ఉపవాసమే చేస్తావా, విందు భోజనమే చేస్తావా అనేది ముఖ్యం కాదు. మానవ జీవిత పరమార్థమైన భగవంతుని సాక్షాత్కారం ఇప్పుడు ఇక్కడే పొందుటకు ప్రయత్నింపుము.

భగవంతుడు ఆరోగ్యమునే మహా భాగ్యంగా మానవులకు ఇచ్చాడు. సరైన ఆహారం తీసుకోక, దురలవాట్లకు లోనై, ఇంద్రియాలకు బానిసలై, సక్రమ జీవితం గడపక, మానవులే ఆరోగ్యమనే మహాభాగ్యాన్ని దూరం చేసుకుంటున్నారు. విజ్ఞుడు కూడా మానవుని కొరకు భగవంతుడు సృష్టించిన ప్రకృతి సిద్ధమైన ఆహారమునే మితంగా తీసుకొని అమూల్యమైన ఈ జీవిత పరమార్థాన్ని సాధించుటకు ప్రయత్నించాలి.

జంతువులు సంతృప్తి కరమైన ఆరోగ్య జీవితం గడపడానికి అవి తమ సహజ నైజాన్ని ప్రాకృతిక న్యాయాన్ని అనుసరించడమే కారణం. ఆకలైనపుడు తింటాయి. ముఖ్యంగా అవి ఏ మాత్రం జబ్బుపడ్డా తిరిగి కోలుకునేదాకా ఏమీ తినకుండా పొట్టనింపకుండా పస్తుండి ఒక మూల నిశ్శబ్దంగా పడుకుంటాయి. “ప్రకృతికే తిరిగి పోదాం లేదా ప్రకృతివైపు మళ్ళుదాం”, ఈ చిన్న నియమాలే మానవులని విశ్రాంతి తోనూ, ఆరోగ్యంగానూ, తెలివైన వారిగానూ చేస్తాయి.

యాభై సంవత్సరాల క్రితం నేను అమెరికా దేశానికి మొదటిసారిగా వెళ్ళాను. అక్కడి ప్రజలకి ఆరు నెలల కొకసారి దంత వైద్యునిచేత పళ్ళు ఎరీక్షించుకొని శుభ్రం చేయించుకునే అలవాటు ఉంటుంది. దాన్ని వాళ్ళు ‘దంతాల సమీక్షాపరీక్ష’ అంటారు. నా మిత్రులు కూడా



నన్ను ఆరీతిగానే ఒక ప్రముఖ దంత వైద్యుని వద్దకు తీసుకొని వెళ్ళారు. ఆయన నా దంతాలను పరీక్షించి “నా మొత్తం అనుభవంలో వేలాది మందిని పరిక్షించానే గానీ ఇంత గట్టిగాను, సక్రమంగానూ ఉన్న దంతాల్ని చూడలేదు” అని అన్నారు. ఆ మాటలు నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కల్గించాయి. ‘ఇంత మంచి దంతాలకి కారణం ఏమిటి”? అని ఆయన నన్ను ప్రశ్నించినపుడు నేను నవ్వుతూ “ఇంతవరకూ నా దంతములు భారతదేశములో ఏ వైద్యుడికి చూపించి ఎరుగను. ఇదే మొదటిసారి అమెరికాలో అవి పరిక్షింపబడ్డాయి. అదంతా దేవుని దయ ఆయన గొప్పతనం” అన్నాను.

**<u>భగవత్కృపే</u> :-** ఇక నా ఆరోగ్యం గురించి చెప్పాలంటే, నా ఆరోగ్యాన్ని నేనెంత నిర్లక్ష్యం చేసినా, అతి దయతో ఆ భగవంతుడే, నేను ఆరోగ్యంగా ఉండేలాగ చూస్తున్నాడు. నా గుండె జబ్బు తర్వాత వైద్యులు కొండలపైకి ఎక్కవద్దనీ, కారులో దూరపు ప్రయాణాలు చేయవద్దనీ, సలహా ఇచ్చారు. కానీ ఆదోనికి నలభై మైళ్ళ దూరంలో ఉన్న మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామి వారి జీవసమాధి దర్శించుకోవాలనే బలమైన కోరిక నాకు కలిగింది. ‘జీవసమాధి’ అంటే జీవించి ఉండగానే సమాధిలోకి ప్రవేశించి ఇక మరల తిరిగి రాకుండా ఉండుట. “శ్రీరాఘవేంద్ర స్వామి వారి సజీవ సమాధి దర్శించి అచట కొద్ది సేపు ధ్యానం చేయాలని ఉంది” అని నా కోరికను చెప్పాను. అచటి వారు “ఆ దారి అస్సలు బాగులేదు. జీపులు కూడా అతికష్టం మీదగానీ అక్కడకు వెళ్ళలేవు” అన్నారు. “ఎంత కష్టమైనా సరే, ఆ పవిత్ర ప్రదేశం నేను చూచి తీరాలి” అన్నాను. చివరకి ఒక మంచి జీపు ఏర్పాటు చేశారు. బాగాపాడయిన ఆ రోడ్డు మీద ప్రయాణం కన్నా గుర్రం పై స్వారీ తేలిక అనిపించేలా ఉంది. తొందరపడి తీసుకున్న ప్రమాద భరిత నిర్ణయానికి నొచ్చుకున్నాను. ఎందుకంటే నా గుండె కూడా, లోన ఉన్న ఇంజనులా కొట్టుకోవడం

ప్రారంభించింది. భగవంతుని దయవల్ల, గుండె, లోపల తన పనిచేసి, రక్త ప్రసరణ చేస్తున్నా, కష్టంగానే ఉంది. మొత్తానికి రానూ పోనూ ఎనభై మైళ్ళూ పూర్తి చేశాం. ఎలాంటి ఇబ్బంది లేకుండానే ప్రయాణం జరిగింది. నాకు బలంగానూ, ఆనందంగానూ ఉంది అనుకున్నట్లుగా మంత్రాలయం దర్శించగల్గినందుకూ మరి కొంతమంది నూతన ఆశ్రమ భక్తులను, శాంతినికోరుకొనేవారిని పొందినందుకు, దారిబాగులేకపోయి ఇబ్బందిగా ఉన్నా, మహాత్ములతో మహాసమాధివద్ద గడపడం వల్ల ఎంతో ప్రశాంతంగానూ, విశ్రాంతిగానూ ఉండడంచేత అందరం ఆ ప్రయాణానికి ఎంతో సంతోషించాము.

ఇక నాప్రస్తుత ఆరోగ్యవిషయానికి వస్తే ప్రఖ్యాత రొటేరియను డాక్టరు వెంకటేశ్వరరావుగారు ఇటీవలే ఆశ్రమానికి వచ్చి రక్తపుపోటుతో సహ నాఆరోగ్యం అంతా సవ్యంగా ఉంది అన్నారు.

ఆహా! దైవము ఎంతమంచివాడు. ఒకవంక గుండె ఇబ్బందికలిగినా ప్రస్తుతం పంటిపోటు ఉన్నా ఎంత శాంతినీ, ఆరోగ్యాన్నీ, ఆయన నా ఎడల మరింత ప్రేమతో ఇచ్చాడు, నేను ప్రపంచంతో కెల్ల ఆరోగ్య వంతుడినని చెప్పుకోవడంలో ఎంతో ఆనందం అనుభవిస్తాను. కనీసం ప్రపంచంలోని దేవుని సృష్టిలోగల అత్యంత ఆరోగ్యవంతులలో ఒకడినని తృప్తి పొందవచ్చుకదా.

విచిత్రంగానూ నమ్మశక్యం కాకుండానూ కన్పించవచ్చునేమోగానీ, నేను ఈ "అత్యంత ఆరోగ్యవంతుడు" వ్యాసం వ్రాయుట ప్రారంభించు సమయానికే నన్ను ఇప్పటివరకు ఇబ్బందిపెట్టుచున్న పంటి నొప్పి హఠాత్తుగా మాయమైపోయింది. నాలోపల వెలుపలా కూడా ఆరోగ్యము, శాంతి నెలకొన్నవి. నాలోని దయతోనిండిన, పూర్తి అవగాహనతోకూడిన, దివ్యజ్యోతికి ఎంతో కృతజ్ఞుడిని. అనంతమైన ఆ దయకు, అపరిమితమైన ఆయన ప్రేమకు, నాకళ్ళు కృతజ్ఞతతో



నిండి చెమరుస్తున్నాయి. ఆయన అస్థిత్వం నాకు పూర్తిగా సత్యం, నాఅణువణువునా ఆయన చొచ్చుకొని యున్నాడు. పరిమితమైన ఈ ప్రపంచానికి ఇంతకంటే ఏం వ్రాయగలను! ఏం చెప్పగలను! భగవంతుడు ఉన్న ప్రతీదీ ప్రకాశిస్తూ ఉంటుంది. ఎందుకంటే ఆయనొక దివ్యజ్యోతి స్వరూపుడు. ఆయన లేనిదేదైనా సరే అంధకారం, అజ్ఞానం, అనారోగ్యం.

సూర్యుని ప్రకాశము, ప్రసన్నములైన ఆకిరణాలు ఆరోగ్యాన్నీ ఆయుష్షునూ ప్రసాదిస్తాయి. ఉదయం, సాయత్రం ఎండలోకూర్చుండి ప్రాణప్రదమైన ఆ సూర్యకిరణములు శరీరము లోని అన్ని కణముల లోనికీ ప్రవేశించుట ఎంతో ఉపయోగం. ప్రకృతిసిద్ధమైన ఆహారమునకు తోడు సూర్యకిరణాలతోపాటు గాలి నీరు కూడా కలసినచో నమ్మకమైన దివ్యవైద్యులవలె శాంతి ఆరోగ్యం ధీర్ఘాయుషుని ప్రసాదించగలవు.

ప్రియమైన పాఠకులారా! అనారోగ్యంకాదు, ఆరోగ్యమే మీజన్మహక్కు ఖచ్చితముగా మీరు ఆరోగ్యానికి వారసులు. నేనే కాదు మీరుకూడా అత్యంత ఆరోగ్యవంతులే. ఏదో వస్తూపోతూ ఉండే మేఘాలవంటి నీరసం, అనారోగ్యం వంటి వాటికి లొంగిపోయి తలవంచి అధైర్య పడకండి. సూర్యుడిని అప్పడప్పుడు కమ్మే మేఘాలవలె అవి వస్తూ పోతూ ఉంటాయి. నీలోనే ఉన్న లక్షలకొలది సూర్యులదివ్య కాంతిని ప్రార్థనతో ఇప్పుడు ఇక్కడనే గుర్తించి, నీసృష్టికర్తకు ఆసృష్టికి కూడా ఒక దివ్యప్రసాదముకమ్ము. అన్నిటినీ మించి ఆ భగవంతుని సాక్షాత్కారమును నిరంతరముగా పొందుతూ ఉండుము.

నీసోదరుడైన ఓంకార్ ప్రార్థనిదే.

ఓం ఓం ఓం.



## అత్యంత ఆనందమయుడు

నేను ఇటీవల వ్రాసిన వ్యాసములలో 'అత్యంత ధనవంతుడు' అనే వ్యాసం ఒకటి. తరువాత వ్రాసినది 'అత్యంత ఆరోగ్యవంతుడు' ఇక ఇప్పుడు చివరిగా వచ్చింది. "అత్యంత ఆనందమయుడు" ఒకోసారి ఇలా వ్యాసాలు వ్రాయడం కూడా సమయం వృధాచేయడమేమో అని నా కనిపిస్తుంది. కానీ ఈవ్యాసాలు ఒకప్పుడు కాకపోతే మరొక్కప్పుడు ఎక్కడో ఒకచోట, ఎవరికో ఒకరికైనా, ఎంతోకొంతైనామేలు చేస్తాయనే నాలోని తపన-చిన్నఅశ నన్ను వ్రాయమని ఒత్తిడి చేస్తున్నాయి. ప్రపంచంలోకల్ల ధనవంతుడు అంటే మొత్తం సంపదంతా తనవద్దనే గలవాడు అని కాదు. ఎవడు తనసంపదను భగవంతుని సంతానమునకు సేవచేయుటకు వినియోగించునో అతడే



నిజమైనధనవంతుడు. ఎంతో సంపదకల్గియుండీ కూడా ఇతరులను విస్మరించి తనకొరకేతాను జీవించేవాడు, (నాదృష్టిలో) కటికపేదవాడు. గతంలోనూ ప్రస్తుతమూ ఇకభవిష్యత్తులోనూ ఏసుప్రభువు, గౌతమబుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, ఆదిశంకరులు, మన కాలంలోని మహాత్మాగాంధీ ప్రపంచపు అత్యంత ధనికులు కాదా! ఇలా నిజమైన సంపద అంటే ఆధ్మాత్మిక సంపదయే. అది ఎవరిని మినహాయించక అందరినీ తనలో ఇముడ్చుకునే ప్రేమ, కరుణ మయమైనది. ఈ నశించని ఆధ్యాత్మిక సంపద ఫలితమే ఆరోగ్యము. ఎక్కడ ఈసంపద ఉందో అక్కడే శాంతి, సంతోషం నిండి ఉంటాయి.

భారతదేశపు ఆధ్యాత్మిక కవులలో ఒకరైన త్యాగరాజు నిత్యజీవనమైన శాశ్వతమైన తనగేయమొకదానిని. "శాంతములేక సౌఖ్యములేదు....." అని మొదలుపెట్టారు. అలాశాంతిలేకుండా నిజమైన సౌఖ్యము ఎవరికీ ఉండదు, అది బైరాగిగానీ, మహారాజా అయినా అత్యంత ధనవంతుడైనాసరే. అలా శాంతి లోనే ఆనందం ఉంది.

ప్రశ్న: శాంతి ఎక్కడ ఉంది?

జవాబు: ఎచట కోరిక లేదో అక్కడే శాంతి ఉంది. ఈభూమ్మీద ప్రతీమానవుని లక్ష్యము ఆత్మానందం, అతని జన్మహక్కైన శాంతియే. ఒక విధంగా చూస్తే సంతోషం, శాంతి రెండు కాదు ఒకటే. అవి జీవితమనే నాణానికి గల బొమ్మ, బొరుసు. ఎక్కడ శాంతి ఉంటుందో అక్కడ సంతోషమూ, ఎక్కడ సంతోషం ఉంటుందో అక్కడ శాంతి ఉంటాయి.

ప్రశ్న: ప్రపంచంలో కెల్ల అత్యంత ఆనందమయుడెవరు?

జవాబు: పూర్తి సంతృప్తి పరుడై కోరికలేని మానవుడే అత్యంత ఆనందమయుడు.

కోరిక అనేది మానవుని – అది స్త్రీని గానీ, పురుషుని గానీ బంధించి ఆందోళనకు గురిచేస్తుంది. శాంతి సంతోషాలు అనేవి కోరికలేని వానికే స్వంతం. నిశ్శబ్దంగానూ, ప్రశాంతంగానూ ఒంటరిగా దేవునితో నేనున్న ఘడియల్లో నా అంతరంగంలో కలిగే భావన. ఇది:

ప్రశ్న : ఓ ఆనందమా! నీ వెక్కడున్నావు ?

జవాబు: భగవంతుని భావనతో ఏకమైన చోటే ఆనందం ఉంది.

ప్రశ్న : భగవంతుడు! ఎక్కడ ఉన్నాడు ?

జవాబు : ఆయన నీలోనే యున్నాడు. నిశ్చలము నిర్మలమైన నీ హృదయాంతరాళంలోనే ఉన్నాడు.

భగవంతుని ఇప్పుడు ఇక్కడే తెలుసుకొనుటయే నేటి ఈ వ్యాస ముఖ్యాంశము. నా జీవితపు ప్రధాన ఆశయము కూడా ఇదే. దేముని అనుభూతిని ఇప్పుడు ఇక్కడ పొందలేనపుడు అనిశ్చితము, అగమ్యము అయిన భవిష్యత్తులో ఎప్పుడో ఎలా పొందగలవు? అదే ఇప్పుడు ఇక్కడే పొందినచో ఎల్లప్పుడూ శాశ్వతముగా పొందుతూనే ఉంటావు కదా! నిజంగానే ఆయన ఎల్లప్పుడూ నీతోనే, నీలోనే, నీచుట్టూనే యున్నాడు. సర్వాంతర్యామి కావున, ఆయన నీయొక్క, మరియు ఈ విశ్వమంతా అణువణువునా ఆవరించి యున్నాడు. ఇప్పుడు, ఎల్లప్పుడూ, నిజానికి భగవదైక్య భావమే ప్రేమ. ఆ భగవంతుడే అందరిలోనూ, అన్నింటిలోనూ ఉన్నాడు. అందుచేత కనిపించే ప్రపంచంలోనే మనం ఏకత్వ, ఐక్యభావన పొందడంలోనే ఆనందం ఉంది. మనకి నచ్చినా నచ్చకపోయినా శాంతి, సంతోషం కోరుకునేవారమే ఐతే, ప్రతీ దానిలోనూ ఈ ఏకత్వ భావన అనుభవించడం తప్పదు. అది కనిపించేదవనీయండి, కనిపించని దవనీయండి వారు మనని ప్రేమించే వారు కానీయండి, లేక విమర్శించే వారు, ఖండించేవారు కానీయండి ఈ ఏకత్వ భావన తప్పదు.

"ప్రేమ అనేది విశ్వాత్మకమైనది. రెండవది అనేది ఏదీ లేని



మొదటిది. దానిని మీరు భగవంతుడు, దేవుడు, శాంతి, ఆనందం, ఆత్మ, పదార్థం, దివ్యశక్తి అని మీకిష్టమైన పేరుతో పిలవండి. పేర్లు ఎన్నైనా ఉండనీయండి పర్వాలేదు. దాన్ని గురించి అసలు పట్టించుకొన వలసిన పనేలేదు. ఎందుకంటే ఉన్నదే ఒక్కటి కదా! తరచూ అనుకునేది ఉన్నదీ ఒక్కటే. మునులు వివిధ సందర్భాలలో వివిధ నామాలతో వ్యవహరించారు. కావలసింది ముఖ్యంగా ఆ దివ్యశక్తిని వాస్తవంగా గుర్తించడమే. పవిత్ర మానవ జన్మ లక్ష్యం ఆ అస్థిత్వాన్ని చైతన్యంతో ఇప్పుడు ఇక్కడే మన ఆత్మ స్వీయానుభవంతో పొందడమే.

ఆ దివ్య సాక్షాత్కారాన్ని అంతరంగ సాక్షాత్కారాన్ని, అన్నింటా చొచ్చుకొని పోతున్న సాక్షాత్కారాన్ని ఇప్పుడు ఇక్కడే పొందినచో నీవే ప్రపంచంలోకెల్లా అత్యంత ఆనందమయుడవు. స్వార్థంలో ఎన్నడూ ఆనందమనేది ఉండదు. స్వార్థం, ఆనందం రెండూ పరస్పర భిన్న ధృవాలు. ఈ రెండూ ఒకదానికొకటి చాలా దూరంగా, చాలా వ్యత్యాసంతో ఉన్నాయి. ఉత్తర–దక్షిణ ధృవాలలాగ, కాంతి–చీకటి లాగ, ఆనందమయుడెన్నడూ స్వార్థపరుడు కాదు, కాలేదు కూడా. అతడు తన కొరకే తాను ఎన్నడూ జీవించడు. అతడెప్పుడు ఇతరుల ఆనందం కొరకే జీవిస్తాడు. అందుచేత అతను ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. **నేను తరచూ అనే నా మాటలు నీకు గుర్తుచేస్తున్నా– నువ్వు దుఃఖముతో ఉండాలనుకుంటున్నావా నీ గురించి ఆలోచించు. నువ్వు సంతోషంగా ఉండాలనుకుంటున్నావా ఇతరుల గురించి ఆలోచించు.**

"ఇతరులు అంటే ఆ విభజనీయమైన భగవంతుని ప్రతిరూపాలే". వారంతా ఒక్కటైయున్ననూ అనేక రూపాలుగా, అనేక మందిగా కనిపిస్తున్న నీ ప్రతిరూపాలే. నిజమైన దైవ ప్రేమ అంటే వీటన్నింటినీ ప్రేమైక స్వరూపాలుగా గ్రహించగల్గడమే.

నిస్వార్థసేవ గూర్చి తేలికయిన మాటల్లో ఒక ఉత్తేజకరమైన చిన్న కథ ఉంది.

ఒకానొకప్పుడు ఒక గురువుగారుండేవారు. ఆయన తన శిష్యునికి ఒక మహామంత్రాన్ని ఉపదేశించి, "నాయనా! ఇది అత్యంత రహస్యంగా ఉంచుకో, ఏపరిస్థితుల్లోనూ, ఎప్పుడూ దీనిని ఎవ్వరికీ చెప్పకు" అని, మరింత దృఢంగా ఆ శిష్యునితో, "చూడు నాయనా – ఈ మంత్రాన్ని ఇతరులెవరికైనా చెబితే, నీ తల వెయ్యిముక్కలుగా పగులుతుంది. జాగ్రత్త సుమా!" అని కూడా హెచ్చరించారు.

ఆ శిష్యుడామంత్రాన్ని ఎంతో నమ్మకంగా భక్తితో జపించి ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలుసుకున్నాడు. ఒకనాడు తనలో తాను ఆ శిష్యుడు ఇలా అనుకున్నాడు "అయ్యో! లక్షలాది అమాయక ప్రజలు గాఢాంధకారపు అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతుంటే నేనొక్కడినే ఈ అనంతానందాన్ని ఎలా అనుభవించగలను?". ఆ మర్నాడే అతడు అక్కడి ప్రజలందరినీ రమ్మని ఆహ్వానించి ఒక కొండపైకెక్కి ఆ మంత్రాన్ని అందరికీ గట్టిగా చెప్పాడు. వారితో "ఈ మంత్రాన్ని మీరందరూ జపించి దైవ సాక్షాత్కారాన్ని ఇక్కడే ఇప్పుడే పొందండి" అన్నాడు. ఈ విషయం తెలిసి గురువు గారు శిష్యునికి కబురంపి "ఎందుకు గురువాజ్ఞని ధిక్కరించి అవిధేయుడై ప్రవర్తించావు" అని అడిగారు. అప్పుడు ఆ శిష్యుడు సవినయముగా శిరస్సు వంచి "ప్రియ గురువర్యా ! లక్షల మంది అజ్ఞానంతో అలమటిస్తూ మృత్యుబారిని పడుతుంటే నేనొక్కడినే అమృతతుల్యమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని ఎలా అనుభవించగలను? వారి ఆనందంలోనే నా ఆనందం ఉంది. వారి శాంతిలోనే నేను శాంతిని పొందగలను. ఇన్నివేల మంది రక్షింపబడుతుంటే నా వంటి ఒక్క ప్రాణం పోతే మాత్రం ఏమవుతుంది?" అన్నాడు. ఈ సమాధానానికి గురువుగారెంతో సంతోషించి అతని నిస్వార్థబుద్ధికి మెచ్చి, శాంతి సంతోషములతో వర్ధిల్లమని ఆశీర్వదించారు.

అందుచేత చూడండి నా ప్రియ పాఠక మిత్రులారా! నిజమైన ఆనందం, ఎలాంటి జాతి, మత, కుల, వర్ణ భేధాలు లేని ఆ భగవంతుని



సంతానంతో కలసి, మనకున్న దాన్ని అనుభవించడంలోనే ఉంది. అందుకు శాంతి ఆశ్రమం మీ కందరికీ హృదయ పూర్వక ఆహ్వానం పలుకుతోంది. తూర్పు పశ్చిమ దేశాలనే బేధం లేకుండా శాంతి భగవంతుని సంతానమైన మన అందరి ఉమ్మడి ఆస్తి. శాంతినే వెదికే ఆత్మీయులందరికి నే నిచ్చే వారసత్వ సంపద ఇదే. ఈ మీ స్వంత శాంతి ధామంలో, (ఎంత సొమ్ము వెచ్చించినా) బయట పొందలేని శాంతి సంతోషాలను, ఉచితంగా పొందండి.

మాయామోహంలో పడి మానవుడు శాంతి సంతోషాల కొరకు, అవి లేని బయట, వాటి కొరకు వెదుకుతున్నాడు. నిర్మలమైన, నిశ్చలమైన అతని హృదయంలోనే అవి ఉండగా, మానవుడు చేసే ఈ అజ్ఞానపు వెదకులాట దురదృష్టంతోను, బాధ తోను కూడిన కస్తూరి మృగం వెదుకులాటను గుర్తుకు తెస్తుంది. అది తనలోనే ఉన్న కస్తూరి పరిమళం కోసం కొండా కోనలన్నీ వెదికి వెదికి, చివరకి ఏ వాడిగా ఉన్న చెట్టుకొమ్మో గుండెల్లో గుచ్చుకుని చనిపోతుంది.

ఓ మానవుడా! బయట ఉండే స్వాములు, యోగులు, బాబాలు, పటాటాటోపంతో ఉండే మహాత్ముల వెంటపరుగులు తీస్తూ వ్యయ ప్రయాసలు పొందే బదులు కాలం మించి పోకముందే నీలోనే ఉన్న ఆ ఆనందాన్ని ఇప్పుడే ఇక్కడే పొందుము. కాలం చాలా విలువైంది. అసలు వస్తువుని వదిలేసి, దాని నీడ వెంట వృథాగా పరుగులెట్టి వెదుకుతూ, విలువైన ఆ కాలాన్ని వ్యర్థం చేస్తున్నావు.

ఈ మధ్యనే ఆశ్రమ పురాతన భక్తురాలైన శ్రీమతి యు.నారాయణరావు మనోరమ బెంగుళూరు నుండి ఆశ్రమానికి వచ్చినపుడు ఆమెకు ఇష్టమైన నామదేవుని గీతం పాడారు. అది నాకెంతో ఆనందాన్ని కల్గించింది.

పాండురంగా ఓ పాండు రంగా!
ఉంటే ఉండనీ పోతే పోనీ ఈ తనువు.

ఉంటే చాలు ధృఢంగా నీపై నాదు నమ్మకం
విడువ విడువ ఎన్నడూ నీదుపాదాలు
అని చేస్తున్నా నీ ముందే ఈ ప్రమాణం
జపించేను నీ నామమే పదే పదే
దాచాను హృదిలో నా ప్రేమ ఎంతో పదిలంగా
చేసేను ఇలా నా విన్నపం కేశవరాజుకి
ప్రియ దైవమా నీకే వదిలేస్తున్నాను
ఈ ప్రమాణాన్ని నిలబెట్టే బాధ్యత కూడా.

ఇలాంటిదే అష్టావక్రగీతలో నేను చిన్నప్పుడు వల్లెవేసిన వాక్యం గుర్తు చేసుకున్నా " ఈ శరీరం వెయ్యేళ్ళుండనీ లేక ఇప్పుడే పోనీ – నాక్కావల్సింది పుట్టాక, పెరుగుదల నశించుట మొదలైనట్టి మార్పుకు లోనుగాని, ఎల్లప్పుడూ స్వయం ప్రకాశంగానూ సజీవంగానూ ఉండే ఆత్మయే" పవిత్రమైన వేదాలలోని స్మృతి వాక్యాలు కూడా నాకు అనంతమైన ఆనందాన్ని కల్గించాయి 'ద్వైత భావము' లేక (వేరే ఇంకొకటి ఉంది) అనే మాయలోపడి నేను దుఃఖానికి లోనయ్యాను. ఇప్పుడు నాకు జ్ఞానోదయం అయింది. నేను దేనిని తెలుసుకోవాలో దానిని తెల్సుకున్నాను. కాంతులకే దివ్యకాంతికి నేను కేంద్రమై యున్నాను. విభజించడానికి వీలులేనిదది. ఎందుకంటే దైవం తప్ప వేరే మరొకటన్నది లేనే లేదు.... లేదు..... సుఖ సంతోషాలకు ఆయనే కేంద్రం.

చెప్పవలసినదేముంది? ఓ ఆనందమా నీ వెక్కడ ఉన్నావు? స్వచ్ఛమైన నిస్వార్థంలోనే నీవున్నావు. ఆ భగవంతుని చైతన్యంలో అన్ని కోరికలూ దహించివేయబడి ఎంతటి చిన్న స్వార్థమైనా కూడా నశించిపోతుంది. అసలు ఆనందమనేది ఇంకొదాన్ని గురించి ఆలోచించకుండా ఉండడంలోను, ఇంకొకరినెవరినీ చూడకుండా ఉండడంలోను, ఇంకొకరిని ఎవరినీ వినకుండా ఉండే స్థితిలోనూ



ఉంది– ఎందుకంటే ఉన్నదంతా ఒక్కటే కదా. అన్నింటిలో కనిపించేది, వినిపించేది రెండవది అనేది లేని ఒక్క బ్రహ్మమే.

మాయా మోహంలోపడి, తనలో నున్న దివ్యజ్యోతిని మరచి, నిర్లక్ష్యం చేసి తన చుట్టూనే ఆవరించి ఉన్న దానిని ఇప్పుడు ఇక్కడే గుర్తించక, ఎండమావుల వెంట పరుగులిడుతూ తమ అమూల్యమైన కాలాన్ని వృథా చేసుకునే వారిని ఈ రోజుల్లో చూచి బాధ కలుగుతుంది. వారు సాధువులో, యోగులో, బైరాగులో, భిక్షువులో ఎవరైనాకావచ్చు. సర్వాంతర్యామిగా నీ చుట్టుపక్కల, దగ్గరగానూ, దూరంగానూ యున్న దైవాన్ని ప్రత్యక్షంగా అనుభవించకుండా కళ్ళుమూసుకొని, నానా బాధలూ పడుతూ, ఎలాంటి నిశ్చయంలేని భవిష్యత్తులో ఎప్పుడో ఆ దూరాన్న ఉన్న ఊహా స్వర్గం నుంచి దిగి వస్తాడు అనుకుంటారెందుకు? ఆ భవిష్యత్తు ఏమిటో మనకు తెలియదు. ఈ ప్రస్తుత క్షణం మాత్రమే మనది. ఆయనను ఇప్పుడు ఇక్కడే తెలుసుకోవాలి. నీకు దగ్గరగాఉన్న వారిలోనూ నీకు తెలియని సుదూర ప్రాంతాల్లో ఉన్న వారిలోనూ దర్శించు. భగవంతుని దృష్టిలో దూరమన్నదే లేదు. ఆయన దేశ కాల పరిస్థితులకు అతీతుడు. అన్నిటికి అతడే మూలకారకుడు. ఆ భగవంతుడు సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, సర్వజ్ఞాన సంపన్నుడు, సర్వశక్తిమంతుడని గుర్తించుటలోనే మన సంతోషము ఉంది. అలా మనము గుర్తించుటలోనే మన సంతోషము కేంద్రీకృతమవుతుంది. అక్కడే పవిత్రమైన మనసుతో అనంతమైన ఆనందంలో ఉందుముగాక! క్షణ క్షణం వస్తూపోతూ ఉండేలా మారుతూ ఉండే ఈ భౌతిక ప్రపంచపు అంశాలలో గాక, మార్పులేని సత్యంలోనే అనంతమైన ఆనందమును పొందవలసియున్నది.

అలా మార్పులేనిది భగవంతుడొక్కడే. అందుచే మార్పులేని, శాశ్వతము, అనంతము, అమరము, అయిన ఆనందం భగవంతునిలోనే ఉన్నది. అమాయక పసివాని చేష్టలవలె నాకు తెలియకుండానే

(ఉద్దేశపూర్వకంగా గాక) భగవంతునితో రహస్యంగా ఇలా అడిగేవాడిని.

ప్రశ్న: ఓ నా దైవమా! నీవెక్కడున్నావు?

నాకన్న స్థిరమైన కంఠంతో మృదువుగా ఆయన ఇట్లు జవాబు చెప్పెడివాడు.

జవాబు : ఇదిగో నాయనా! నీ ప్రక్కనే ఉన్నా కదా!

కొన్నిసార్లు నా అమూల్యమైన కాలాన్ని ఇతరులతో ఎక్కువగా మాట్లాడుతూ వృధా చేస్తుంటాను. వారి నుండి తిరిగి వచ్చి, నిశ్శబ్దంగా భగవంతుని సన్నిధిలో యుండగా నాకు తెలీకుండానే "స్వామీ నిన్ను మరిచానా ? వారితో గందరగోళపు కాలక్షేపంలోపడి అధిక ప్రసంగంలో నీ గురించిన శ్రద్ధ మరిచితినా? నిజముగా నీవు నిశ్శబ్దంలో ఉన్నావు". మరల ఆ భగవంతుని మాటలు నెమ్మదిగా నాకిట్లు వినిపించేవి, "నేను శబ్దము, నిశ్శబ్దము– రెండింటిలోనూ వ్యక్తముగానూ, అవ్యక్తముగానూ కూడా ఉన్నాను. భక్తుల రూపంలో నీ యొద్దకు వస్తున్నాను. వారిని ప్రేమించితివా నీవు నన్ను ప్రేమించినట్లే వారికి సేవచేయుట ద్వారా నాకే నువ్వు సేవచేస్తున్నావు".

నిశ్శబ్దంగా ఆయనలో లీనమై
"ఇతరుల సంపదయే నా సంపద
ఇతరుల ఆరోగ్యమే నా ఆరోగ్యము
ఇతరుల సంతోషమే నా సంతోషము
ఇతరుల శాంతియే నా శాంతి" అనుకునే వాడిని.

లోకా స్సమస్తా సుఖినో భవంతు

ఓంఓంఓం

***పవిత్ర ప్రపంచ రక్షకుడవైన ఓ భగవంతుడా***
***నాతో మాటలాడుము. – మిల్డ్రెడ్ హేవర్డ్***



# సత్యమేవ జయతే

అశాశ్వతమైన ఈ జీవితాన్ని గడుపుతున్న ప్రతీవ్యక్తి నిజజీవితంలో అంతులేని సమస్యలు, బాధలు, వత్తిడి, దుఃఖము, ఎదుర్కొంటాడు. అప్పుడే "సత్యమే జయించును" అనే ఒక విచిత్రమైన ఓదార్పుతో తనని తాను సముదాయించుకోవడం పరిపాటి. నల్లని మేఘాల వెనుక తెల్లగా మెరిసే వెలుగు రేఖ వలె ఈ ఓదార్పు కొంత ఉపశమనాన్ని ఇస్తుందనడంలో ఎట్టి సందేహమూ లేదు. ఎందుకంటే 'సత్యమే జయిస్తుంది' అనే వాక్యం ముమ్మాటికి నిజం. నాస్తికుడికైనా ఆస్తికుడికైనా ఇది మార్చలేని దివ్యసత్యం. అందుచే ఏమాత్రం విజ్ఞత లౌకిక జ్ఞానం ఉన్నవాళ్ళూ, దైవ సత్యమైన 'సత్యమే జయిస్తుంది' అనే సూత్రాన్ని గౌరవించి తీరవలసిందే.

కాని ప్రతీవ్యక్తి ఈ దైవ న్యాయాన్ని తన నిజజీవితంలో ఎంతవరకూ పాటిస్తున్నాను అనే అంశాన్ని నిష్పక్షపాతంగా ఆత్మ పరిశీలన చేసుకొని చూడాలి. ఈదైవ న్యాయాన్ని నూటికి నూరు పాళ్ళు నిజంగా తాను తనచుట్టు పక్కల వారితోను, ఇతరులతోనూ, తాను సభ్యుడిగా ఉంటున్న ఈ సమాజంలోను, చివరికి సోదరజాతులతోను మనో, వాక్, కర్మలలో త్రిశుద్ధిగా ఆచరిస్తున్నానా? లేదా? అనే అంశాన్ని పరిశీలించాలి. 'సత్యమే దైవము'. దైవమే ప్రేమ. ప్రేమే దయ. అంటే ఎవరినీ మినహాయించకుండా అందరినీ ప్రేమించగల తత్వము.

మానవ జీవితాలలో గాని జాతుల చరిత్రలోకాని తీవ్రమైన ఉపద్రవాలు పరీక్షలు ఎదుర్కొన్నపుడు తరుచు మనం గొప్ప ఇతిహాసాలయిన రామాయణము, మహాభారతాన్ని గుర్తుకు తెచ్చుకొని ప్రేరణ, శక్తి, పొందుతాం. ఇలాంటి సందర్భాలలో దుర్బుద్ధి కలిగిన

దుర్యోధనుడు, అతని వంద మంది సోదరులూ, పంచపాండవుల చేతిలో పరాజయం పొందడం గుర్తుకు తెచ్చుకొంటాం. వాస్తవానికి కృష్ణుడు వారి వైపు ఉండి, దారి చూపించడమే ఇందుకు కారణం. సత్యహరిశ్చంద్రుని కథలో దరిద్రము, ఆకలి, అవమానం, చివరికి మరణంకూడా వెదుక్కునే సమయంలో కూడా సత్యానికి మారుపేరు అయిన అతడు తన జీవిత విధానాన్ని మార్చుకోలేదు. అవును హరిశ్చంద్రుడు జయించాడు. యావత్ ప్రపంచానికి సత్యం ఆచరించుటకు ఒక మార్గదర్శకుడిగా నిలిచాడు. మనంకూడా మన జీవితాలలో ఎంతవరకు హరిశ్చంద్రుడి మార్గాన్ని పాటిస్తున్నామో లెక్క చూచుకోవాలి. అదేరీతిగా ధర్మవర్తనానికి మారుపేరు అయిన ధర్మరాజు, ఆదర్శ భక్తుడు యోధుడు అయిన అర్జునుని జీవితాలతో సరిపోల్చి చూచుకోవాలి.

**1. సత్యమే జయిస్తుంది :** మనము గనక మనో, వాక్ కర్మలలో తూర్పు పశ్చిమ దేశాలలోని ఋషులు చెప్పిన మార్గంలో తప్పకుండా నడిచినపుడు మాత్రమే.

**2. సత్యమే జయిస్తుంది :** మన జీవితాలలోనూ, హృదయం లోను ధనపిశాచిని కొలుస్తూ బైటకి మాత్రం దానధర్మాల గురించి మాట్లాడే వారుగా ఉండనప్పుడు.

**3. సత్యమే జయిస్తుంది :** మనం అసలు వస్తువుని వదిలి, ప్రపంచానికి దివ్యజ్యోతి అయినదేదో దానిని వదిలి, దాని నీడ వెంట పరుగులు తీయకుండా ఉంటే

**4. సత్యమే జయిస్తుంది :** మద్యపాన నిషేధాన్ని బైట ప్రచారం చేసి ఇంట్లో తాగకుండా ఉంటే.

**5. సత్యమే జయిస్తుంది :** జాతీయ నిర్మాతలమని గొప్పలు చెప్పుకుంటూ అధికారదాహంతో బానిసలై క్షణికమైన కీర్తి, పేరు వెంట



పరుగులు తీయకుండా ఉంటే.

**6. సత్యమే జయిస్తుంది :** లేనిపోని అనుమానాలతో ఇతర వ్యక్తులపై ద్వేషము, పగ పెంచుకోకుండా ఉంటే.

**7. సత్యమే జయిస్తుంది :** బైటకి ధర్మదాతలుగా వ్యవహరిస్తూ, నల్లధనాన్ని మూట గడుతూ, వార్తా పత్రికలలోను ఇతర ప్రచార సాధనాలలోను గొప్ప దాతగా ప్రచారం చేసుకోకుండా ఉంటే.

**8. సత్యమే జయిస్తుంది :** అనాథలని ప్రేమించినపుడు, పేదవారిని, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని తనవారిగానే భావించి వారికి సేవ చెయ్యగలిగినప్పుడు.

**9. సత్యమే జయిస్తుంది :** నీవు స్వార్థపరుడు గాక నీ సుఖము, నీ కుటంబం యొక్క సుఖాన్ని మాత్రమే చూసుకోకుండా, ప్రపంచంలోని ప్రజలంతా నావారే అనే ఒక ఉన్నత భావంతో ధైర్యంగా చిరునవ్వుతో " ఈ ప్రపంచమంతా నా ఇల్లే, ఇందలి ప్రజలందరూ నావాళ్ళే. వారిని ప్రేమించడం, వారికి సేవ చెయ్యడం మాత్రమే నామతం'' అనుకొన్నప్పుడు.

**10. సత్యమే జయిస్తుంది :** నీ హృదయంలో ప్రేమ, నీమనస్సులో నిర్మలత్వం నిండి భగవంతుని సంతతి అయిన అందరి క్షేమము కోరిన రోజున నువ్వు పూర్తిగా విజయం సాధించాలంటే, సత్యానికి తిరుగు లేని ఘనత సాధించాలంటే, ఏసుక్రీస్తు యొక్క ప్రేమ, బుద్ధుని దయ, కృష్ణుని జ్ఞానము, మహ్మద్ ప్రవక్త వినయము, జురాష్ట్రియర్ యొక్క దివ్యతేజస్సు మరియు సుగుణాలు, తూర్పు పశ్చిమ దేశాలలోని ఋషులు, సాధువులు యొక్క మహోన్నత లక్షణాలు, సాత్వికత, తప్పనిసరిగా అలవరచుకోవాలి. వ్యక్తులమైన మనమే అన్ని దుఃఖాలకి, యుద్ధాలకి, ఘర్షణలకి, మూకుమ్మడి చావులకి కారణం. అందుచే మానవుల హృదయాలలో ప్రేమ, సౌశీల్యత, రాజ్యముల మధ్య శాంతి

తీసుకొని రావలసిన భాధ్యత మనదే. హఠాత్తుగా గ్రామాలమీద. పట్టణాలమీద, ద్వేషభావంతో అణు బాంబులు వేసారని తెలిసి నా హృదయం బాధతో బరువెక్కిపోయింది.

ఈ రీతిగా అమాయకులు దారుణమైన హింసకు నాశనానికి గురికాకుండా వీనిని ఆపుటకు తరుణోపాయము చూడవలసి ఉన్నది. మన దృష్టిని స్వార్ధము నుండి నిస్వార్ధము వైపు మరలించుదుముగాక. ప్రపంచ శాంతియే మన ఆత్మ యొక్క లక్ష్యము అగుగాక. ఏ జాతి అయినా దుర్మార్గము, క్రూరత్వముతో, వ్యవహరించునప్పుడు, మిగిలిన సోదర దేశములన్నీ ఏకమై, తమ ఐకమత్య బలముతో అట్టి దారుణమునకు ఒడిగట్టిన దేశము, ఏదైననూ సరే, ఎదుర్కొని తీరవలసినదే.

ఇంతవరకు సత్యమునకు, భారతదేశమునకు అండగాఉన్న బలమైన దేశములు భారతదేశము ఆపదలో ఉన్న సమయంలో నిరాశకు గురిచేసి పక్కకు తప్పుకొనవచ్చు. ఇది "మానవుడు ఎల్లప్పుడు నిరాశ పరచును కాని దైవమెన్నటికి అట్లు చేయడు" అను సత్యమును జ్ఞప్తికి తెచ్చును.

భారతదేశము తన కాళ్ళపై నిలబడి ఇతర బలమైన దేశముల యొక్క మాటల ఓదార్పు పై ఆధారపడకుండా ఉండుగాక! తన అంతర్లీనమైయున్న భగవత్ జ్యోతినే విశ్వసించు గాక! ఆ భగవంతుడే మనకు నిరంతర రక్షకుడు. ప్రపంచంలో ఎన్ని సమస్యలు, పరీక్షలు, ఉపద్రవములు ఎదురైననూ ధర్మము విషయానికి వచ్చేసరికి చివరకు 'సత్యమే జయించి తీరును'. శిలువ వేయబడిన తరువాతనే కదా ప్రపంచములో వెలుగురేఖలు ఉదయించినవి.

ఓ ప్రియమైన దైవస్వరూపులారా! 'దేవుని యొక్కగాని, సత్యము యొక్క గాని దివ్య న్యాయానికి మనము అతీతులము కాదు' అని



గ్రహించుటకు ఇదియే సరియైన సమయము. మనము ఎంతటి తెలివైనవారమైనా, కవులమైనా దేవుని మాయ చేయుట కాని, ఏమరుపాటు చెందునట్లు గానీ చేయలేము. మనము భూములు సాగుచేయు రైతులు కావచ్చు లేక దేశ భవిష్యత్తును నడిపించు అధ్యక్షుడు కావచ్చు. మనము మన దేశము యొక్క ప్రపంచ శాంతి యొక్క భవిష్యత్తుకి బాధ్యులమే. దుర్మార్గము తన నాశనము తానే కోరి తెచ్చుకొనును. కత్తిని పైకెత్తినవాడు ఆకత్తితోనే తనను తానే నాశనము చేసుకొనును. సత్యమే ఎల్లవేళలా జయించును. చరిత్ర పాఠములు దీనినే తెలుపుచున్నవి. దేవుని పేరిట గాని లేక సత్యము పేరిట కాని అమాయక బలహీన పేద ప్రజల బాధలకి, చావులకి మనం కారణం కాకూడదు. అనాదిగా మనకు లభించిన ఈ చక్కని నాగరికతా సంస్కృతులను మనమే నాశనము చేసుకోకుండా ఉండాలి.

మన పూర్వీకులు జాతి నిర్మాతలు. అనేక త్యాగాలు చేసి ఈ నాటి అభివృద్ధికి, జ్ఞానానికి కారకులయ్యారు. మన స్వార్థంతో, నీచమైన నేరాలతో, వినాశనంతో దానిని నాశనం చెయ్యకుండా ఉండాలి. మనమే శాంతి స్థాపకులం, జాతి నిర్మాతలము, మానవాళి రక్షకులము అవ్వాలి. ఈ మహాయజ్ఞంలో మనకు చేతనైన రీతిగా మన శక్తిని ధారపోసి మనహృదయాంతరాళాలలో శాంతిని సాధించాలి. పిదప ప్రపంచంలో యుద్ధానికి సిద్ధపడుతున్న శక్తుల హృదయాలదాకా ఈ శాంతి భావము చేరునట్లు చేయాలి.

కేవలము పెద్ద రాజకీయవేత్తలో, గొప్ప నాయకులో గాక సత్యమును, దైవమును తిరస్కరించిన సామాన్య వ్యక్తులు కూడా ఇట్టి నాశనానికి కారకులౌతున్నారు. అందుచే ఈ మానవజాతి విధ్వంసాన్ని ఆపుటకు భగవంతుని ఉనికిని గుర్తించి శాంతిని, మంచి భావాలని, వ్యక్తులలోను జాతులలోను విస్తరించునట్లు చేయాలి.

గతంలోకన్నా ఎక్కువగా మన మనసులు, హృదయాలు, ఆత్మలు ఏకంచేసి ఆ బలములో సత్యమునే నమ్మి విశ్వశాంతికి కృషి చేయుదుము గాక! ప్రస్తుత విపత్కర పరిస్థితులలో జాతి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడానికి ఎట్టిస్థితిలోను 'సత్యమే జయించును' అని నమ్మి ముందుకు సాగాలి.

విశ్వశాంతి గీతము శాంతి సందేశము ఈ విపత్కర పరిస్థితులలో శాంతికై ఎదురుచూస్తున్న హృదయాలకు, జాతులకు, **శాంతిగీతం** అగుగాక.

## విశ్వశాంతి గీతము

### (శాంతి సందేశము)

దివ్య సోదరభావమై
విశ్వశాంతి ధ్యేయమై
ఏకమూలమై ప్రవాహమై
అందరికీ ఒకే న్యాయమై
ఉంచేను ఏకలక్ష్యమై
కలిపేను అందరినీ ఒకే జీవమై
వెలిగేను విశ్వ ప్రేమమయమై
క్రోధ ఈర్ష ద్వేష భావాలు
అయ్యో! ఉంచాయి విడదీసి మనల నిన్నాళ్ళూ
ముగిసేను వాటి పాలనా ముచ్చట
జాతి, వర్గ, తెగ, కుల భేదాలు పోయాయి పోయాయి
సమసి పోయాయి.
గడిచిపోయిన స్వప్నంలో కలసిపోయి పొగమంచులా
అరే! ఇది స్వప్నమా! అని



మేలుకొన్న మానవుడు తెల్సుకున్నాడు కడకైనా
ఇక అనంతాకాశంలో, ఆపైన స్వర్గంలో
అన్ని జలాలపైన, ఉపరితలాలపైన
వెలయుగాక శాంతి వెల్లివిరియుగాక
ఓషధులు మొక్కలు వృక్షాలు శాంతినే వెదజల్లుగాక
అంతరిక్ష గ్రహాలు వెలుగుగాక, శాంతి నిండిన
కాంతి వెదజల్లుగాక
ఇలపై శాంతి వెలయుగాక
ఎల్లెడల శాంతి, ఎల్లరకూ శాంతి

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు
ఓం ఓం ఓం





# ఈ క్షణం

## దివ్యమైన ప్రస్తుతం

నా జీవితాన్ని ప్రస్తుత క్షణం మీదే కేంద్రీకరిస్తాను. తరువాత క్షణం మీద కాదు. ఎందుకంటే రాబోవు క్షణం అనిశ్చితం. ప్రస్తుత క్షణమే వాస్తవం. ప్రస్తుత జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తే ఒక జీవితమే చిన్నా భిన్నమైపోవచ్చు లేక నాశనమే కావచ్చు. ప్రస్తుత ఘడియని వృధా చేసుకుని ఎప్పుడో రాబోయే దాని పైనే ఆధారపడితే ఒక వ్యక్తి జీవితంలో అదెప్పుడూ రాకపోవచ్చు. జీవితాన్ని తేలికగా తీసుకునే (సోమరి) బద్దకస్తుడు ఎల్లప్పుడూ మంచి పనిని రాబోయే సమయానికో,



మరుసటి రోజుకో వాయిదా వేస్తుంటాడు.

మన ఆశ్రమంలో ఈ క్రింది నీతి వాక్యం చూస్తుంటారు. నీవు చేద్దామనుకున్న మంచి పనిని ఈ రోజే చెయ్యి. ఎంచేతనంటే ఆమరునాడు నీవు చూస్తావో లేదో!

ఎవరైనా (నా వద్దకు) వచ్చి "నీకు రాబోయే క్షణంలోనే భగవత్సాక్షాత్కారం ఇస్తాను" అంటే నేను "కాదు కాదు రాబోయే క్షణం దాకా నేను వేచి ఉండలేను. ఇప్పుడే, ఈ సజీవ క్షణం లోనే, నాక్కావాలి" అంటాను.

సజీవమైన ప్రస్తుత క్షణాన్నే నిర్లక్ష్యం చేసుకుంటే అనిశ్చితమైన రాబోయే క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటానని రూఢిగా ఎలా నమ్మను?. అనిశ్చితమైన రాబోయే క్షణంలోనే ఆ కాంతులకే కాంతిలో ఒకడి నవగలిగి నపుడు. ఇపుడు మాత్రం కాలేనా, కాకూడదా? నేను ఇపుడు కనుక అదివ్యానుభూతిని పొందితే ఎప్పుడూ పొందుతా కదా! ఇప్పుడు, ఒక క్షణంలోని చిన్న భాగమయినా నేను నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తానేమో. ఎందుకంటే క్షణంలోని ఈ చిన్ని భాగాలే కలిసి పెద్ద అగాధమై,పతనానికి, నాశనానికీ, సోమరితనానికీ దారి తీస్తాయి.

అది ప్రయత్నమే కావచ్చు, కానీ ప్రస్తుత సజీవ క్షణాలని మాత్రమే నమ్మేవారిలో నేనూ ఒకణ్ణి. ఇపుడు కనుక ఆయన దివ్యానుభూతిని నేను పొందితే ఆ అనుభూతిని నేను ఎల్లప్పుడూ పొందుతూనే ఉంటా.

నేను గనుక ప్రస్తుత క్షణాన్ని అత్యుత్తమంగా వినియోగించుకుంటే నేను తరువాత వచ్చే క్షణాన్ని తప్పనిసరిగా, అంత అత్యుత్తమంగానూ వినియోగించుకు తీర్తాను. అలాగే భవిష్యత్తులో కూడా అన్ని సమయాల్లోనూ దాన్నే కొనసాగించగలను.

**"క్షణాలని వ్యర్థము చేయువారు తమ జీవిత మంతా వ్యర్థం చేసుకుంటారు"** అనే మాటలు ఆహా! ఎంత సత్యం.

ఓ రాబోయే క్షణమా! శిరస్సు వంచి నీకు పాదాభివందనం చేస్తా. కానీ ప్రస్తుతం ఈ సజీవ క్షణాన్నే ఆలింగనం చేసుకుంటా! ఎందుకంటే ఇదే దివ్యమైనది.

నిజంగా బద్ధకమే మరణం, అది ఒక క్షణమైనా సరే. ఆ దివ్య సాక్షాత్కారానుభూతిలోనికి చొచ్చుకు పోతున్న ఆ దివ్య కాంతి, ఒక దివ్య జీవనమే కదా!

ప్రియ పాఠకుడా! ప్రార్థించు, ప్రస్తుత సజీవ క్షణాన్ని గట్టిగా ఒడిసి పట్టుకో. కలగనకు. దారిలో ఇంక ఎంత మాత్రం అటు ఇటూ తచ్చాడకు. నువ్వు సరైన దార్లోనే ఉన్నావు. అసలు ఈ ప్రస్తుత సజీవ క్షణాన్ని పూర్తిగా సద్వినియోగ పర్చుకుంటే ఆయనలో నువ్వే కేంద్రంగా ఉన్నావు.

నీ అంతరంగంలోని ఆ దివ్య కాంతి దర్శనాన్ని ఈ క్షణంలోనే పొందు. అది నిన్ను అత్యంత ఆనంద శిఖరాగ్రాలపైకి చేర్చుగాక! అది శరీరము, మనస్సు, ప్రపంచము కంటే గొప్పది. అంతే కాదు కాలము, అంతరిక్షము, కారణం కంటే అతీతమైంది. నిన్ను ప్రేమించే నీ సోదరుని ప్రార్థన ఇదే.

లోకా స్సమస్తా సుఖినో భవంతు

ఓం ఓం ఓం



# స్వీయ సంస్కరణ

ప్రపంచమంతా ఇతరుల్ని సంస్కరించడానికి ప్రయత్నించే వారితోనిండిపోయింది. ఎవరిని చూచినా ఇతరుల్ని సంస్కరించడానికి ఆతృత పడేవారే గాని తనని తాను సంస్కరించుకోవడానికి ఆరాటపడేవారెవరూ కన్పించడం లేదు. స్వామి రామతీర్థ "ఇతరులని కాదు – తమని తాము సంస్కరించుకునే వారు కావాలి" అంటారు. మతం అనేది "స్వీయ సంస్కరణ"తో ఆరంభమై "స్వీయ సాక్షాత్కారంతో అంతమవుతుంది".

## నిన్ను నీవు తెల్సుకో

నిన్ను నీవు సంస్కరించుకోవడంలోనే నువ్వు నీ ఆంతరంగిక దివ్య జ్యోతితో ముఖాముఖీ సంబంధంలో ఉంటావు. నేను ప్రతీవారినీ సంస్కరించాలని ప్రయత్నించి ప్రయత్నించి విఫలుడినై, ఇక నన్ను నేను సంస్కరించుకోడానికి ప్రయత్నిస్తూన్నానేమో, కొంతవరకైనా కాంతిని చూడగల్గుతున్నా. నన్ను నేను సంస్కరించుకోవడం ద్వారా ఇతరులని కూడా సంస్కరించగల్గుతున్నా. ఒక ఆదర్శ ప్రాయమైన జీవితం గడుపుతూ ఇతరులకి ఉదాహరణగా ఉండడమే మంచిది. ఉపన్యాసాలు ప్రసంగాల కన్నా నిస్వార్థమైన ఆదర్శజీవితం గడుపుతూ ఇతరులకు ఒక సజీవ నమూనాగా ఉండగల్గడం కంటే మించిన అదృష్టమేముంటుంది ?

ప్రశ్న: మనిషి ఇతరులకి బోధించడానికే ఆతృత పడతాడెందుకు?

జవాబు: ఎందుకంటే ఇతరులకి బోధించడం తేలిక కదా!

ఒక వ్యక్తికి బోధించడానికి గానీ, ఆ వ్యక్తిని సంస్కరించడానికి గానీ ఎవరూ, అతికష్టంతో కూడుకున్నటువంటి తనని తాను

సంస్కరించుకోవడం, అనేదాన్ని గూర్చి ఆరాటపడక్కర్లేదు కదా! కాలం చాలా విలువైంది. ఇతరులని సంస్కరించాలనే ప్రయత్నంలో దాన్ని వృథా చేయకూడదు. లేనిచో అది ఎక్కడికి దారితీస్తుందో తెలీదు.

నిన్ను నీవు సంస్కరించుకోడానికి ప్రయత్నిస్తే కొంత వరకైనా సాధించగలవు. నీలోనే ఉన్న దివ్యకాంతిని కొంతైనా చూడగలవు. ఈ సంస్కరణని నువ్వు మామూలుగా తీసుకునే ఆహారంతో మొదలుపెట్టు. సామాన్యమైన, సహజమైన ఆహారాన్నే తీసుకో. ఎందుకంటే ఆధ్యాత్మిక జీవితంలో ఆహారం ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. ఒకరన్నారు "నీ ఆహారమేంటో చెప్పు, నువ్వెవరో చెప్తాను" అని.

ఉద్రేక భరితమైన అన్ని ఆహారాలనీ వదిలెయ్యి. సామాన్యంగానూ, సహజంగానూ ఉండే వాటినే తిను. అన్నింటికన్నా ముఖ్యంగా, దేంట్లోనైనా సరే మితంగా ఉండు. 'అతి సర్వత్ర వర్జయేత్' అంటారు కదా! అతిగా ఉండకు. విజయవంతమయ్యే ఏ జీవితానికైనా మితంగా ఉండడమే ముఖ్యం. ప్రతీరోజూ నీకు ఒక 'స్వీయ సంస్కరణ రోజు' అనుకో. నీవు ఎల్లప్పుడూ నీకు సహాయంగా ఉండే, లోక శాంతి ప్రార్థనతోనో లేదా నీకు నచ్చిన ఏదో ఒక ప్రార్థన తో రోజుని మొదలుపెట్టు. ఎందుకంటే సర్వాంతర్యామి అయిన ఆ భగవంతుని సమక్షంలోనే ఎప్పుడూ ఉన్నావు కదా! అందుకే రోజంతా నీ విద్యుక్తధర్మాలని నెరవేరుస్తూనే ఆయన దివ్యానుభూతిని పొందుతూ ఉండు. రోజులో దేవుడు మన నుంచి దూరమైన క్షణమన్నదే ఉండదు. మనం ఆయనలోనే జీవిస్తూ, శ్వాసిస్తూ, కదుల్తూ పనిచేస్తూ ఉన్నాం. ఇలా మన దినచర్య అంతా పూర్తయ్యాక ఆయన ఆశీస్సులకు ధన్యవాదాలతో ప్రార్థించి ఆ దివ్యానుభూతిని పొందుతూ శ్రమిద్దాం. ఇలా విశ్రమించడం వల్ల ప్రతీ ఉదయం మరలా ఆ సర్వాంతర్యామిని ప్రతీ వ్యక్తిలోనూ చూచే భాగ్యం పొందుతాం. ఎందుకంటే అంతా



దైవమయమే కదా!

"ఈశావాస్యమిదం సర్వం"! ఈ ప్రపంచమంతా అంతర్యామిగా వెలుపల బయటకూడా ఈశ– ఈశ్వర్ చేతనే నింపబడి, పూర్తిగా కప్పబడి ఉంది. నీవు మాట్లాడాలనుకుంటే దేవుని గురించి మాత్రమే మాట్లాడు. నీ అమూల్యమైన సమయాన్ని పనికిరాని విషయాలు మాట్లాడుతూ వృథా చెయ్యకు. ఎన్నడూ సమయాన్ని అనవసరమైన ఊసుపోక కబుర్లతో దుర్వినియోగం చెయ్యకు.

### నిరంతరాయంగా ప్రార్థించు–గాఢంగా ధ్యానించు

నీ ఆనందం దైవముతో అనుసంధానింపబడుగాక! ప్రతి శబ్దంలోనూ నీవు దేవుని ధ్వని మాత్రమే వినడానికి ప్రయత్నించాలి. ధ్వని అంతా దేవుని నుండి ఉద్భవించినదే కదా! దేవుడు నిశ్శబ్దం – అసలు ఎలాంటి తరంగాలు లేని పూర్తి "నిశ్శబ్దం" కూడా. నిజంగానే నన్ను నేను మార్చుకుని ఇతరులను మార్చగలుగుతున్నాను. నా నిస్వార్ధ ఆదర్శజీవితం ద్వారా ప్రపంచాన్ని సంస్కరించే ప్రయత్నం చేస్తా. వాస్తవంగా వ్యక్తి శాంతే విశ్వశాంతికి బాట వేయగలదు. ముందుగా మన హృదయాల్లో శాంతిని నింపి, తరువాత మన ఇళ్ళలోనూ, సమాజాలలోనూ, దేశాలలోనూ, చివరికి ప్రపంచమంతా శాంతి స్థాపనకు మనవంతు కృషి చేద్దామా!

ఇలా సంస్కరణ అనేది అంతరంగంలో నాతోనే మొదలవ్వాలి. నాలోని ప్రతీ శ్వాస నా మనసుని విశ్వజ్యోతి – ప్రపంచ జ్యోతి వైపే ప్రవహించేలా చేయుగాక! నా ప్రతీ హృదయస్పందనా అందరి శాంతి కొరకే జరుగు గాక! నేను ఇతరులను మార్చలేకపోవచ్చేమో గానీ నన్ను నేను మార్చుకోగలను. ప్రపంచాన్ని నేను సంస్కరించ లేకపోవచ్చు గానీ నన్ను నేను తప్పకుండా సంస్కరించుకోగలను.

ఎవరు తమ హృదయాలలో నిర్మలత్వం, పవిత్రత కల్గియుంటారో

ఆహా! వారెంత ధన్యులు! శాంతి వారికే స్వంతము. ప్రపంచ నిర్మలత్వానికి స్వీయ నిర్మలత్వమే సహాయకారి అవుతుంది.

ప్రియమైన పాఠకులారా! ప్రపంచశాంతికి మీ వంతు విరాళమేమిటో చెప్పండి. అది మీ స్వయం నిర్మలత్వం అగు గాక. అది మీ స్వీయ సంస్కరణ అగుగాక. తక్కువ మాటలు ఎక్కువ నిర్మలత్వం, శాంతితో కూడిన నిశ్శబ్దం అయి వుండు గాక. స్వీయ సంస్కరణతో కూడిన నీ ఆదర్శ జీవితం సృష్టికర్త ఆనందానికీ, అలాగే ఆయన సంతతికీ దీవెన అగుగాక.

లోకా స్సమస్తా సుఖినోభవంతు.

ఓం ఓం ఓం





# 80వ జన్మదిన సందేశము

'కాలము అలలు ఎవరికోసం ఆగవు' – అనే నానుడి ఎంత సత్యం –కాలము ఎలా ఎగిరిపోతోంది! మన ఆశ్రమంలో ఉత్తేజపూరితమైన వాక్యం ఒకటుంది. 'సోమరులను, స్వార్థపరులను మ్రింగివేయుటకు కాలసర్పం తన నోరు తెరచుకొని ఉన్నది' – నిస్వార్థపరులకు, అంకితభావంతో యున్న వారికీ, కాలము ఒక మౌనమిత్రుడే గాక ఒక వరం కూడా,

'ఈ రోజు మానవ మిత్రుడగు గాక' అనేది ఇంకొక ఉత్తేజకర మైన వాక్యం. నేను ఇంకొక ఉత్తేజకరమైన వాక్యంపై నా దృష్టిని మరల్చాను. అదేమంటే 'నువ్వు రాత్రిని నిద్రలో వ్యర్థపరిచావు. పగలునికూడా మాటలతో వృథా చేస్తావా?'

నువ్వు ఎనభై సంవత్సరాలు వృధా చేశావు. మిగిలిన సంవత్సరాలు కూడా ఇలాగే మాటలతో, ఆశ్రమం పేరుతో సేవ పేరుతో బోధనలనీ, ఉపన్యాసం అనీ హడావిడిచేస్తూ ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకంతో వృథా చేసేస్తావా? ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మౌనం రేపటి నుంచీ ప్రారంభంకానుంది. అప్పుడే ఒక రోజు పూర్తిగా మాటల్తో గడిచిపోయింది. మాటలు గందరగోళాన్ని సృష్టిస్తాయి. మౌనమొక్కటే ఆత్మను మేలుకొలుప గలదు.

ఒక పండితుడన్నట్లు 'మాటలు వట్టిరాళ్ళ మూటలు' ఇన్నేళ్ళూ నేను మీకు రాళ్ళనే తినిపిస్తున్నా. మీలో కొందరు ఆ రాళ్ళతోనే సంతృప్తి పడిపోతున్నారు. ఇప్పుడు ఎనభైయ్యవయేట నేను తీసుకున్న నిర్ణయాల్లో ఒకటి ఇంక ఎంతమాత్రం రాళ్ళని తినిపించకుండా, ముఖ్యంగా నాపైనే ప్రేమతో నమ్మకం పెట్టుకున్నవారికి, భగవంతుని సత్స్వరూపమైన 'దివ్యమౌనమనే' నిజమైన ఆహారాన్నే అందించదలిచాను. నిజ ఆత్మని

మేలుకొలిపి చైతన్యాన్ని అందించే ఆహారం "మౌనమే".

ఎనభైయవ సంవత్సర సూర్యోదయం మీకందరికీ నా జన్మదిన శుభాకాంక్షలు. నిజంగా మీ శాంతియే నా శాంతి.

మీ గృహాలని శాంతి వెదజల్లే స్వర్గసీమలుగా చేయాలి. అందుకుగాను భక్తినిండిన మీ హృదయాల్లో ముందుగా శాంతి నింపడానికి నన్ను సహాయపడనీయండి. ఈ రీతిగా మీకు సేవ చేసి ధన్యుడనుకానీయండి. మీ మనోవాక్ కర్మలలో శాంతినే వ్యక్తపరచండి. అలా ఒక మనిషికీ మరో మనిషికి మధ్య శాంతి ప్రసరిస్తే, అది సమాజము, జాతి పరిధులు దాటి ప్రపంచానికి విస్తరించి, చివరికి మీ ఆదర్శజీవనమే ఆలంబనంగా, విశ్వమంతా శాంతితో నిండిపోతుంది. ఇదే మీ ఓంకార్‌చేసే హృదయపూర్వకమైన ప్రార్థన.

మహాతాత్వికుడు సోక్రటీసు మాటల్లో చెప్పాలంటే, ఈ ఎనభై సంవత్సరాల సుదీర్ఘ జీవితకాలంలో నేను నేర్చుకొన్నది ఒక్కటే, అదేమంటే నాకేమీ తెలీదని. వేలకొలది సూర్యకాంతులే వెలవెల బోయే మహోన్నత దివ్యతేజస్సు అది. అదెక్కడ దానిముందు అజ్ఞానపు నిప్పురవ్వలమైన మనమెంత? విజ్ఞుడైన వాడు చెప్పగలగిందొకటే అదే 'మౌనం' అభివృద్ధి పథంలో సత్యం వైపు మనల్ని నడపగలిగింది అది ఒక్కటే.

ఆఖరికి అన్నీ మౌనంలో లీనమైపోతాయి. ఈ సత్యాన్ని తెలిసినవాడు మాటలాడడు. తెలియని వాడు మౌనంగానూ ఉండలేడు. అట్లాంటి అమాయకుడు ఉత్సాహంతో, తనని మరచి, ఇతరులందరినీ సంస్కరించాలనే తాపత్రయంతో ఇతరుల యొక్క, తనయొక్క సమయం వృధా చేస్తుంటాడు. ఇన్ని సంవత్సరాలలో నేను మరో విషయాన్ని కూడా తెల్సుకున్నాను. అదేమంటే ప్రతీ ఒక్కరూ ఏదో ఒక విషయంలో నాకంటే ఉన్నతులే. ఒక శిశువు, పక్షి, పరిమళాలు వెదజల్లే చిన్న



పువ్వునుంచి కూడా తెల్సుకోవల్సింది ఎంతో ఉంది. భగవంతుని సన్నిధిలో ఆ చిన్నారి శిశువులా, హాయిగా పాడే పక్షిలా, స్వేచ్ఛగా ఉండండి. అమాయకంగా సున్నితంగా ఉండే పువ్వు, కాలికింద నలిగిపోతున్నా, పరిమళాలని వెదజల్లుతోందే, ఆహా! ఎంత ధన్యజీవి అది.

ఇటీవల శూన్యంలోనే నేను ఆనందాన్ని అనుభవిస్తున్నాను. నువ్వు ఏదో ఒకటిగా ఉండాలనుకుంటే, లోపాలు ఎంచడానికి నీకు ఏదో ఒకటి ఎదుటి వారిలో కనబడుతూనే ఉంటుంది. మరి అలాగే, నీలోని లోపాలను చూపేవారుంటారుగా! జ్ఞానులైన ఋషుల వాక్యములు పరిశీలించండి. ఎలాంటి విమర్శలకు లోను కాకుండా ఉండాలంటే గుర్తింపు కొరకు మాట్లాడుటకు, ఏమీ చెయ్యకు, శూన్యంగా ఉండు. నీవలాకాకుండా ఏదో ఒకటిలే అని మాట్లాడితే నీ మాటల్లో తప్పు పట్టేవారు ఎవరో ఒకరుంటారు. అలాగే నువ్వు ఏదో ఒకటిలే అని చేస్తే దాన్ని విమర్శించే వారు ఎవరో ఒకరుంటారు. నేనేదో గుర్తింపు పొందాలి అనుకుంటే నీలో ఏదో ఒక తప్పు ఎంచే వారుంటారు. విజ్ఞులు నిజమైన ఆనందాన్ని మార్పులేని శూన్యంలోనూ, మాటలకి అతీతమైన పూర్తి దివ్యమౌనంలోనూ చూచారు.

ఇటీవల నా మనసులోకి వచ్చి నాకు సంతోషాన్ని, సంతృప్తినీ కలిగించిన మరొక విషయం ఏమిటంటే ఈ ఎనభై సంవత్సరాలకాలంలో నేనూ ఏమీ చేయకపోవడం. ఈ ఎనభై సంవత్సరాలు దాటిన శుభోదయం నుండే నా నిజజీవితం ఆరంభమైనట్లు భావిస్తాను. నామ రూపాలనేవి పరుగెత్తే మేఘాల్లాంటివి. అయ్యో! ఇన్నాళ్ళూ నేను అసలైన దానిని ఆవతలపెట్టి దాని నీడ వంటి ప్రపంచపు మిణుగురు పురుగుల వెంట పరుగులు తీస్తూ, అన్ని సంవత్సరాలూ వృధా చేసుకున్నాను. అయినా నన్ను నేను సమాధానపర్చుకుంటూ సంతృప్తి పొందుతున్నా. ఎందుకంటే నిర్జీవమైన గడచిన కాలాన్ని సమాధి చేసి, ఈ నిమిషం నుండీ దైవచింతనతో నూతన జీవితం ప్రారంభించగల్గుతున్నందుకు.

**నీ గురించి మాత్రమే నువ్వు ఆలోచిస్తే నీవు మరణించినట్లే, ఇతరుల క్షేమం గురించి ఆలోచించినపుడే నీవు జీవించి ఉన్నట్లు.** సంతోషమొక్కటే సరియైనది. అలా సంతోషంగా ఉండడానికిదే సమయం, ఇదే ప్రదేశం కూడా. సంతోషంగా ఉండడానికి మార్గం నువ్వే వేసుకోవాలి.

**"నువ్వు దుఃఖంలో ఉండాలనుకుంటే నీ గురించి ఆలోచించు, సంతోషంగా ఉండాలనుకుంటే ఇతరుల గురించి ఆలోచించు"** అన్న విజ్ఞుల వాక్యం ఎంత వాస్తవము!

ఈ ఎనభైయవ పుట్టినరోజు జ్ఞాపకంగా 'ఇతరులు' అనే అంశం పై వ్రాసిన ప్రియమైన గేయాన్ని మీ అందరితో పంచుకోవాలని ఉవ్విళూరుతున్నా.

**ఇతరులు**

ప్రభూ! దినదినమ్ము కేల్ మోడ్చి
నిను ప్రార్థించువేళ, అస్మదీయ
భావమ్ము మరచి, పరులకై
ప్రార్థించు శక్తినిమ్ము దేవ!
... .... ..... ....
నేను గావించు కార్యమ్ములెల్ల
సత్యమై, హృత్పూర్వకంబుగా
పరులయెడల నే నొనరించు సేవ
త్వదీయ పూజగా చేకొనుము దేవ!
.... .... .... ....
గర్వాంధకారమౌ యీచిన్న 'నేను'ను
కూకటివేళ్ళతో పెకలించి వేసి
పరులకై జీవించు విధాన



నాదు చేతలెల్ల నొనరింపు దేవ!
.... .... .... ....
ఇలలోన నాదు చేతలన్నియు
ముగిసి, నాకలోకమున
నేనధిష్టించెడు సింహాసనమ్ము మరచి
పరులకై భావింపవలయునో దేవ!
.... .... .... ....
ఇతరులా, ఓదేవ! ఇతరులే
"పరోపకారార్ధ మిదం శరీరమ్మ"
ను సూక్తి సత్యమై వెలయునటుల
పరులకై, నాదుజీవితం వెల్గించుదేవ!

జీవన్మరణములందుకూడ ఇతరుల క్షేమమును గూర్చి తలంచు వారే ధన్యులు. అట్టివారు ముక్తిని పొందియున్నట్లే. వారే నిజమైన జీవన్ముక్తులు, దైవసాక్షాత్కారము ఇప్పుడే, ఇచ్చటనే యనునది వారి దివ్యవారసత్వము, ఆ దివ్యత్వము ఎల్లప్పుడు వారిసొత్తయి యుండును. మనశాస్త్రములందలి ఒక చక్కని శ్లోకము యీ ఎనుబది సంవత్సరముల నుండియు నాకు చక్కని శక్తిని, ఆనందమును ఇచ్చుచుండెను. శాంత్యాశ్రమ భక్తులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు అగు మీ యెల్లరితోను ఆ శ్లోకమును పంచుకొని నా యీ వ్యాసమును ముగించకోరుచుంటిని.

జ్ఞాతం జ్ఞాతవ్య మధునా;
దృష్టం ద్రష్టవ్య మద్భుతం
చిరం శ్రాన్తాః విశ్రాంతోస్మి
చిన్మాత్రాః నాస్తి కించన॥

నేర్చుకొనవలసిన దంతయు నేను నేర్చుకొంటిని.

చూడవలసిన దంతయు నేను చూచితిని। అది అద్భుతము.
ఈద్వంద్వము లెంత బాధకల్పించునో అంతయు
అనుభవించితిని.
తేజస్సులకు తేజస్సగు రూపముతప్ప ఇతరమేమియు లేదు.
ఆ అఖండ సత్-చిత్-ఆనందస్వరూపమగు ఆ బ్రహ్మానంద
సాగరముననే నేనిపుడు విశ్రమింతును.

వాస్తవమునకు మౌనమే ప్రపంచమునందలి మాటలన్నిటికంటే ఎక్కువ బిగ్గరగా స్పందింపజేయునది. ఎనుబదియవ జన్మదిన ప్రారంభ సమయుమున ఆరంభమగు యీ మౌనపు జన్మదినము ఆనందప్రదమై మీ అందరకును శాంతిని, కాంతిని, ఆనందమును ఆరోగ్యమును కలిగించి మీ లోపల ప్రత్యణువునందును ఆ దివ్యతేజస్సునే అనుభవింపజేయుచు, ప్రతిరూపమున ఆ దివ్య ముఖారవిందమునే కనునట్లు చేయవలయుననెడిదియే మీ సోదరుడు ఓంకారుని ప్రార్థన. దైవమునకు నాశరీరము తప్ప అన్యశరీరములేదు. సమస్తము నేనే అయియుంటిని. నా నుండియే పరమేశ్వరుడు సర్వము చేయును. ఇంక మాటలువద్దు.

నిశ్శబ్దము. గాఢమగు నిశ్శబ్దము. నిశ్చల నిశ్శబ్దము.
సర్వోత్కృష్ట నిశ్శబ్దము. మహిమ! మహిమ! మహిమ!

## అర్పణ

పూజ్యశ్రీ స్వామి చిదానందజీకి, ప్రాక్పశ్చిమమునగల భక్తులెలరకు ముఖ్యముగా నివృత్తిపరులై కోటి సూర్య ప్రభా భాసమగు దివ్యతేజస్సును నిశ్శబ్దములో గాంచువారికి నా వినమ్రపూర్వకమగు అర్పణ.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః



# 81వ జన్మదిన సందేశము

ప్రియమైన శాంతిపాఠకులారా! ఆంతర్య జ్యోతియగు దైవసన్నిధిని అనుభవించు, శాంతి అన్వేషకులగు మీ అందరకు రాబోవు జనవరి 21, 1975 మాత్రమే జన్మదినం కాదు - ప్రతిదినము ఆనందప్రదమగు జన్మదిన మగుగాక! అని మీ స్వంత ఓంకారుని ప్రార్థన.

ఓం. ఓం. ఓం.

దైవజ్ఞప్తితో నిండి ప్రతిదినము ఆనందదాయక జన్మదినముగా భావించు - తూర్పు పశ్చిమములందుగల శాంతి, పీస్ పాఠకులందరు శాంతి, ఆరోగ్యములను పొందెదరుగాక!

మీకు, నాకు, శాంతి ఆశ్రమ శ్రేయోభిలాషులందరకు, ఒకే ఒక జన్మదినము, సృష్టికి మూలాధారమగు జ్యోతితో, విశ్వప్రేమతో -ఏ ఒక్కరిని విడువక అందరిని కలుపుకొనుటయే నిజమైన జన్మదినము. ప్రపంచములోని భక్తులందరకు - మహదానందముతో, శక్తితో ఈ క్రింది ఉత్తేజకరమగు సూక్తులు చెప్పగల్గుట ఎంత అదృష్టము!

ఈ ప్రపంచమే నా గృహము.
అందున్న ప్రజలే నా సోదర సోదరీ స్వరూపులు.
వారందరిని ప్రేమతో సేవించుటే నా నిజమైన జన్మదినము.

జనవరి 21, 1975 ని మాత్రమే జన్మదినము కాదనియు, సంవత్సరమందు ప్రతిదినము జన్మదినమేననియు ఆనందముతో నొక్కి చెప్పుచున్నాను.

ప్రతి సంవత్సరము నా జన్మదినమే.
ప్రతి మాసము నా జన్మదినమే.
ప్రతి గంట, ప్రతి నిమిషము నా ఆనంద జన్మదినమే.
నిశ్చయముగా ప్రతిక్షణము నా జన్మదినమే.

నేను కండ్లు మూసుకొని, ప్రతిక్షణము నా శ్వాసను గమనించు నపుడు "ఒక చిన్నదైన నిశ్శబ్దకంఠము" ప్రతి శ్వాసయు, ప్రతి క్షణము మనకు నూతన జన్మయే అని చెవిలో చెప్పు చుండును.

ఋషులు చెప్పిన మాటలలో ఎంతసత్యమున్నది?

"ఉచ్ఛ్వాస నిశ్వాసలు, నిద్రలేని సముద్రముపై, అనంతంగా ఎగిసిపడే కెరటాల్లాంటివి".

గతం గడిచిపోయింది. దాన్ని మరచిపోదాం, పైకి మరల లేవకుండా భూస్థాపితం చేద్దాం. పవిత్రమైన ఈ క్షణంలో ఈ ఊపిరితోనే మనం జన్మించాం. ఒక విజ్ఞుడు అన్నట్టు "మొదట ఖనిజముగా పుట్టి, వృక్షముగా ఎదిగి, జంతువుగా మారి, పిదప దేవుని సజీవ ప్రతిరూపమైన మానవునిగా మనం పరిణతిచెందాము."

ఉపనిషత్తులోని ఉత్తేజకరమగు ఈ పవిత్ర మంత్రమును జపించెదముగాక!

దేహో దేవాలయ ప్రోక్తో
జీవోదేవ స్సనాతనః ।
త్యజే దజ్ఞాన నిర్మాల్యం
సోహం భావేన పూజయేత్ ॥

మన దేహమే దేవునియొక్క ఆలయము. జీవాత్మయే సనాతనమైన విశ్వాత్మ – సజీవ జీవాత్మయే పరమాత్మ స్వరూపము.

అందుచేత 'ద్వైతమనే' అజ్ఞాన మాలిన్యమును తొలగించి, 'సోహం'భావనతో ఇప్పుడు ఎల్లప్పుడు భగవంతుని ధ్యానించుము.

**'జీవుడే సనాతన దైవము'** అను వేదవాక్యమును మనము విశ్వసింపవలెను.

శ్రీకృష్ణ, బుద్ధ, క్రీస్తు, మహమ్మదు, జోరాస్టరు, గురునానక్, రమణమహర్షి, శివానందజీ, గాంధీజీ మొదలగు తూర్పు పశ్చిమముల



గతించినవారున్నూ, జీవించియున్న సాధు పురుషులందరు మనమే యని మహదానందముతో ఘోషించెదముగాక!

21–1–1975 ఆనందప్రదమగు 81వ జన్మదిన జ్ఞాపకార్ధముగా – మన దివ్య వారసత్వమును విడనాడక, సూర్యులకు సూర్యునికాంతియే, మన నిజమైన జన్మహక్కని, దృఢముగా, నిస్సంశయముగా, ఏ సందేహమును లేక గ్రహింతుము గాక!

ప్రియమైన పాఠకులారా! నిజమైన జన్మదినము ఒక్కటియే. ఆ జన్మదినము – దైవజ్ఞప్తి, విశ్వప్రేమ, శాశ్వత శాంతి అనంతమైన జ్యోతితో అనుసంధానమగుటయే, "మీ జన్మదినమే నా జన్మదినము"ని ఎలుగెత్తి చాటుటయే నాకానందము.

తూర్పు పశ్చిమములందలి దైవాన్వేషకులందరికి యిది ఆనందప్రద మైన జన్మదిన మగుగాక ! ఈ విశాలమగు బాటలో, విశ్వప్రేమతో, ఈ విశ్వమానవ జన్మదినోత్సవములో మీతో పాల్గొననిందు. ఇదియే నా ప్రార్థన.

వేదముల, ఉపనిషత్తుల సారమగు శాంతి గీతముతో ఈ జన్మదిన సందేశము పూర్తిచేయుదము.

**శాంతి గీతము**

స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగుగాక !
ఆకసంబున శాంతి వెలుగుగాక !
జలంబున శాంతి సుస్థిరం బగుగాక !
పృధ్వియందు శాంతి కీర్తింపబడుగాక !
సకల వృక్ష లతా గుల్మాదులనుండి శాంతి సతతము ప్రవహించుగాక!
నలుదిక్కులయందు శాంతి నెలకొనుగాక!
ఓం ! తత్సత్ ! ఓం !

# జన్మదిన సందేశము

## 84వ జన్మదినము

ప్రియ పాఠకులందరకు శుభజన్మదినము. నా జన్మదినమే మీ అందరి జన్మదినము. సకల ప్రాణికోటికి జన్మదినము ఒక్కటియే, కావున ఇది అందరి జన్మదినమనియే భావింతును.

ఇటువంటి జన్మదినములు రావచ్చును, పోవచ్చును. కాని ఒక జన్మదినము మాత్రం వచ్చునది పోవునది కాదు. అదియే స్వయం ప్రకాశమానమగు దివ్యజ్యోతియొక్క జన్మదినము. అది వచ్చునది, పోవునది కాదు, నిరంతరము స్వయం ప్రకాశమానమగు ఆ దివ్యజ్యోతినే ఎప్పుడు అంటియుందుముగాక! అది ఒక్కటియే ఏకైక సత్యము.

**స్వామి మరణించెను. ఓంకారము మాత్రము మీ అందరిలో ప్రకాశించుచు సజీవమైయున్నది.**

ప్రశ్న :- స్వామి మరణించినచో ఇప్పుడీ మాటలనెట్లు వ్రాయుచుండెను?

జవాబు:- స్వామి కాదు వ్రాయుచున్నది. అంతర్జ్యోతి, సర్వజ్ఞము అయిన ఆ దివ్యశక్తే, ఆ దైవమే సర్వము చేయుచున్నది ఒకే దివ్యశక్తి, నిత్యము, సత్యము అయన ఆ నిశ్శబ్దశక్తే యీ కొలది మాటలలో వ్యక్తముచేయుటకు ప్రయత్నించుచున్నది.

స్వామి బాహ్యజగత్తునకు ఇప్పుడు చనిపోయినట్లుండిరి గాన ఈ నూతన సంవత్సర ప్రభాత సమయాన ఒక్క నిముషము నిశ్శబ్దముగా నుందుముగాక! శరీరమునందలి ప్రతీ కదలిక మనము దైవారాధనగా భావింతుముగాక! మన ప్రతీ అడుగు ఆ దైవము వైపుకు ఆ అనంతుని వైపునకే యని గ్రహింతుముగాక! నిశ్శబ్ద స్వరూపియగు



ఆ దైవములోనే మన ప్రతీపలుకు లయించునుగాక! మన ప్రతీభావన నిశ్శబ్దములోనికి, విజ్ఞానాతీతుడగు ఆ దైవమును గూర్చియే జరుపుదుము గాక!

మన ప్రతీశ్వాస నిశ్శబ్ద స్వరూపియగు దైవములోనికే తోడ్కొనిపోవుగాక ! శ్వాసలకు శ్వాసయగు ఆ దైవమే మనలను చలన రహిత నిశ్శబ్దములోనికి గొనిపోవునుగాక! అదియే అనిర్వచనీయమగు ఉన్నతస్థితి. కోటిసూర్య ప్రభాభాసమానమగు ఆ దివ్య తేజస్సులో ఇకమాటలేల? మౌనమే శరణ్యము.

నేను ఎల్లప్పుడు తేజస్సులోనే యుంటిని.
నాలోనే ఎల్లప్పుడు ఆ తేజస్సు కలదు.
నేనే ఎల్లవేళల ఆ తేజస్సునై యుంటిని.
జీవితము పొగకాదు అగ్నిహోత్రము.
సూర్యులకు సూర్యుడు మనమే అయి యుంటిమి.
అభివృద్ధియే జీవితము. స్థబ్దతయే మరణము.
మన ప్రతీశ్వాస మన చేతులు, పాదములకంటె సన్నిహితుడగు ఆ దైవమునే జేరుగాక!

ప్రశ్న :- దైవము ఎచ్చటనున్నాడు?

జవాబు:- దైవము మనలోనే యున్నాడు. మన శ్వాసలకు శ్వాస ఆ దైవమే. మనలోపలను, వెలుపలను 'సోహం' రూపమున ఆ దైవము ఎల్లప్పుడు ఒక్కటిగానే యుండెను. తైలధారలవలె ఎల్లప్పుడు ఆ 'సోహం' భావన కలిగి యుందుముగాక! 'సోహం' శ్వాసయే విశ్వశ్వాస, పరిపూర్ణ అద్వైతస్థితి.

నిజముగా నేను దైవమును చూచుటకు కన్నులు మూయ నవసరములేదు. సకల చరాచర జగత్తంతయు ఆ దైవమయముగా నాకు కనబడును. ప్రతీజీవి సజీవమగు దైవ ప్రతిరూపముగా నాకు

కనబడును.

సృష్టియందలి జీవరాసులన్నింటను నిండియున్నది ఒకే ఆత్మ స్వరూపము. అందుచేతనే ఒకరి కష్టము అందరి కష్టముగా నుండును. ఒక్కరి ఆనందమే అందరి ఆనందముగా నుండును. విశ్వశాంతి పొందవలెనన్న **"ఒక్కరు అందరికై ; అందరు ఒక్కరికై"** అనునదే ఆశయముగా నుండవలెను.

సకల వేద శాస్త్రసారమగు శాంతి ప్రార్థనను అందరు వారి మాతృభాషలో కంఠస్తముచేసి విశ్వశాంతికి దానిని స్మరించుచు మాకు తోడ్పడుడు.

ఇదియే ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషులు అగు మీ అందరకు నా ఎనుబది నాల్గవ జన్మదిన సందేశము.

విశ్వశాంతికై మనమందరము శాంతి ప్రార్థనను, వైదిక శాంతి మంత్రములను ఇప్పుడు పఠింతముగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం ఓం ఓం

**అర్పణ:-** ప్రాక్పశ్చిమమునగల శాంతి ప్రియులగువారికి, శాంతి కాముకులందరకు నా హృదయపూర్వకమైన అర్పణ.

లోకములో శాంతిస్థాపన జేయుదము.

ఆ శాంతి మన హృదయములలో ప్రారంభింపవలెను.



# ఆత్మ స్వరూపులకొక సందేశము

## (స్వామి ఓంకార్ సందేశము)

ప్రియమైన నారాయణా – సజీవరూపదైవమా! ఏకైక సత్యస్వరూపా!

దైవమే ప్రేమ, ప్రేమయే దైవము, అందులకే సజీవరూపదైవమగు నిన్ను ప్రేమించుచున్నాను. ప్రేమ లేక జీవనము సున్న, కనుకనే జీవించుట కొరకై నిన్ను ప్రేమించుచున్నాను. బాహ్యాంతరములలో, కన్నులు తెరచినా, మూసినా, వ్యాప్తిచెంది గోచరించు సత్యము భగవానుడే. అందులకే నిన్ను ప్రేమించుట. నేనీసందేశము వ్రాయుచున్నపుడు, నా గదియందు నాకెదురుగా గోడమీద లిఖించియుండెడి ఒక ముఖ్య జీవిత సందేశ సూక్తి నన్నాకర్షించినది. అది ఏమనగా! **"దైవము మనలోనే యున్నపుడు బయట వెదుకుటకేల శ్రమింతువు".** అటులనే నా వెనుక గోడమీద ఆత్మ ప్రబోధితమైన మరియొక ఉజ్వలసూక్తి వ్రాసియున్నది. అది ఏమనగా **"భగవంతుడు బాహ్యముననే యుండగా అంతరంగమున వెదకుటకేల ప్రయత్నింతువు".** ఈ రెంటియుందును యిపుడే, యిచటనే తమదైనందిన జీవితములో, సాధన కొరకై ఎవరు ఉద్యుక్తులగుదరో, అట్టివారి కుపకరించు ఒక మహత్తర సత్యము యిమిడియున్నది.

నీవు కనులు తెరచినపుడు, నామ రూపదృశ్య ప్రపంచమున గోచరించు సర్వమును – అది పూవుగాని, పక్షిగాని, లతగాని, జంతువుగాని మానవుడుగాని, దానిని దైవముగానే వీక్షించుము. నీవు కనులుమూసిన క్షణమునందు, నీకాలి బొటన వ్రేలినుండి శిరస్సు వరకు నీ దేహము నందు వ్యాపించియున్న ప్రతీపరమాణువునందు దైవమునే చూడుము. ఈ విధముగా సర్వత్రా వ్యాపించియున్న ఆ భగవానునే దర్శించుము, దైవము లేని సమయమంటూ ఒకలిప్తకాలమైనను

యిదివరలో లేదు, ఇపుడు లేకుండాను లేదు, ఇక ముమ్ముందు యుండకుండాను యుండబోదు. అట్లే ఆయన లేని చోటు ఒక పరమాణువు మేరకూడ లేదు. ఈ విధముగా ఆయన బాహ్యాంతరము లలో సర్వత్రా, ఎల్ల సమయములలో వ్యాపించియున్నాడు. అందుకనే ఆయన సర్వ వ్యాపకుడు. సర్వ శక్తివంతుడు, సర్వజ్ఞుడు మరియు శాశ్వితుడు. కన్నులుండి ఆయనను గాంచగల్గుదుమా? దైవమును యిపుడే, యిచటనే గుర్తెరుంగుదుము. మౌనము నవలంబింపుము. క్షణమైనను ఆయనను మరువవద్దు. కన్నులు చూడగల్గిన సర్వములోనూ దైవమునే వీక్షించుము. కన్నులుమూసి నీ ఆంతర్యనివాసియైన, భగవానునే వీక్షించుము. ఆ విధముగా దైవమును, ప్రవృత్తిమార్గములో యున్నను, నివృత్తి మార్గములోనున్నను వీక్షించుము.

వ్యక్తజగత్తులో ఆయనను దర్శించుము, మౌన జగత్తులో అంతరాంతరములో లీనమైన, ఆయనను ప్రార్థించునపుడు ఆయననే పొందుచున్నట్లు భావింపుము. వ్యక్తమగు యీ నామ, రూప, జగత్తు నందు ప్రత్యణువునందు దైవము యిమిడియున్నాడు. అందుచే ఆయన బాహ్యమునందో లేక అంతరమునందో యున్నాడను మీమాంస వదలి వేయుము. నీవు చేయవలసినది ఏమనగా, "సాధన", 'సాధన'. ఇపుడూ, ఎపుడూ, సతతము, నిరంతరము, క్షణకాలమైనను మరచుట గాని, సాధన విడనాడుటగాని యుండకూడదు. ఒక పాత్రనుండి, మరి ఒక పాత్రలోనికి సతతము ప్రవహించు నూనెధార వలె సాధన చేయుము. దైవము శ్వాసలకు శ్వాస. దైవమే "సోహం" శ్వాస, అఖండదివ్య తేజస్వరూప విశ్వాత్మశ్వాస. అదియే పరమార్ధ స్వరూపము. అట్టి అనంత శ్వాసతో ప్రార్థింతువుగాక. ఈ "సోహం" మంత్రమును, నిరంతరము ఓర్పుతో, సతతము, ఎట్టి వైఫల్యము లేకుండా, ఉపాసించుటకు వలయు శక్తి మనకు గల్గుగాక. ప్రతి శ్వాసయందు అదియే "నీవు" "నీవే' .... "సోహం", అని ఉపాసింతువుగాక. కోటి



సూర్యప్రభా భాసమానమైన బాహ్యాంతరములలో ప్రకాశించు, ఆ తేజస్సును వీక్షించుము. తత్త్వమసి–అదియే నీవు. ఓ ప్రియమైన దైవస్వరూపా!... నిన్ను ఇప్పుడు నిశ్చల అనంతనిశ్శబ్దములోనికి గొనిపోయెదనుగాక! స్వామి ఓంకార్

**పూజ్యశ్రీ స్వామీ ఓంకార్‌జీ వారి సందేశముపై చిన్న వ్యాఖ్య**

భగవత్ చైతన్య స్రవంతిని బహిర్గత మొనర్చు లేక నిరూపించు నట్టి ఒక మహోన్నత, ఉజ్వల ఉద్వేగ ప్రతీకగా రూపొందించబడిన ఈ సందేశము, శాంతి ఆశ్రమ మునిపుంగవులు, విశ్వప్రేమైక మూర్తి, ఋషిసత్తములు, వందనీయులు, ఆరాధ్యులైనట్టి శ్రీ స్వామి ఓంకార మహరాజ్ వారి మనోజ్ఞభావవీచిక. అట్టి లేఖకే నాయీ చిన్న ప్రస్తావన, సకలచరాచర సృష్టిని, పిపీలికాది బ్రహ్మపర్యంతము భగవంతుని స్వరూపముగా సమదృష్టిచే వీక్షించగల్గిన, విజ్ఞాన ఖనియైన, ఈ మహర్షి నుండి యావిర్భవించినదే, ఉత్తేజకరమైన ఈ భావతరంగము. సత్యముగా యిది శ్రీమద్భగవద్గీతలో నుదహరించబడిన విశ్వరూప సందర్శనమే. అట్టి యీ విశ్వరూప సందర్శనయోగము యీ భౌతిక ప్రపంచములో బహువిధరూప, నామములతో, అహర్నిశము శ్రమించు సకలమానవాళికి తమ ధ్యేయమైన మోక్షగమ్యమునకు ఒక "తాళపుచెవి" లాంటిది. 1978వ సంవత్సరారంభములో నూతన సంవత్సర కానుకగా, అపారమైన అవ్యాజకరుణతో పరమపూజ్యులు, ప్రేమైకమూర్తి యైన శ్రీ స్వామీ ఓంకార్‌జీ మహరాజ్ వారు తాము పొందిన అట్టి దివ్యానుభూతిని ప్రతి యొక్కరికి విరివిగాపంచిరి, అట్టి దివ్యానందానుభూతిని, విశ్వైకప్రేమను ఆధ్యాత్మిక కానుకగా పొందగల్గిన నీవు ఇంతకంటె మహత్తరమైన, లేక విశిష్టమైన ఎట్టి బహూకృతిని పొందనేరవు. శ్రీ స్వామి ఓంకార్‌జీ అనుక్షణము ఇటువంటి దివ్యానందానుభూతిలో నిమగ్నులై తమవద్దకు విచ్చేయు సర్వులకు నిరంతరము తాము అనుభవించుచున్న దివ్యానందమును బహూకరించుతూ, పంచుతూ,

అందజేస్తూ, ధారాళముగా వెదజల్లుతున్నారు. ఈ విశ్వశాంతి మయస్వరూపులు, పవిత్ర భారతాంతర్భాగమైన పుణ్యాంధ్రావనియందు మనోహరమైన తోటపల్లి కొండలనడుమ వివిధ ఫల, పుష్ప శోభితమై, విరాజిల్లుచు వృక్షసంపదచే నావృతమై శోభిల్లుచున్న శాంతిమయ కుటీరమున నుపవిష్టులై దివ్య ప్రేమకు, దివ్య వెలుగునకు ఆధారభూతులై వెలుగొందుచున్నారు. విశ్వప్రేమ, దివ్యదృష్ట్యానుభూతులతో తేజస్వియై ప్రకాశించుచున్న ఈ లోకోత్తరపురుషుని స్వకీయలేఖ ఎనలేని కానుక నీకు.

నీకు బహూకరింపబడిన అట్టికానుకకు, ప్రస్తావన రచించు మహద్భాగ్యము నాకు కల్గినది, నాయీ సంతోషము వర్ణింపనలవికానిది. ఈ లేఖను భక్తి శ్రద్ధలతో చదువుము. ప్రతి అక్షరమును, పంక్తిని, వాక్యమును లోతుగా పరిశీలించుము ప్రతిదినము నీవు నిత్యనైమిత్తిక కార్యములలో నిమగ్నుడవు కాకమునుపు ఉదయవేళల కొలదికాలము ఈ లేఖనే చదివి మననము చేసుకొని ధ్యానించు. నీకు ఒక నూతన ప్రపంచము ప్రస్ఫుటమగును. ఈ నూతన ప్రపంచము నంటిపెట్టుకొని నీవు దీని ద్వారా భగవానుని వీక్షించగలవు, దృశ్య ప్రపంచమునకు వెనుకనున్న సత్యము గోచరించును. గీతాచార్యులు శ్రీకృష్ణ భగవానులు ప్రబోధించిన విశ్వరూపదర్శన యోగరహస్యమును పొందుటకు సామర్థ్యము కలుగును. సత్యముగా, నిన్ను, యిపుడే, యిక్కడనే బంధవిముక్తునిగా చేయును.

ఈ స్వీయలేఖద్వారా అపారమైన ప్రేమ, అవ్యాజకరుణ పొందియున్నాము. శ్రీ స్వామి ఓంకార్ మహరాజ్‌కు మనము ఎంతయో రుణపడియున్నాము. వారికి నా హృదయపూర్వక నమస్సులు. వారి పాదపద్మములకు ప్రణామములు. హరిః ఓం

**–స్వామి చిదానంద**



# శ్రీశాంతి ఆశ్రమం విశ్వశాంతి నిలయం

ఓహ్ ! రండి రండి శాంత్యాశ్రమానికి రారండి
ప్రేమకిది నిలయం విశ్వశాంతికిది ఆలయం
దర్శించినా, ఉన్నా మరి మౌనంగా ధ్యానించినా
అగుపించేను అంతర్గత అనంత సత్యము
విశాలమైన ముందువాకిలి, అందరికీ అందుబాటైన వసతి
చిన్న–పెద్ద, హెచ్చు–తగ్గు బేధమే లేక
అందిస్తున్నాం ఈ ఆహ్వానాన్ని
పూలతో పరిమళించే బృందావనం
ప్రేమనే వెదజల్లేను విరివిగా
కంటికింపైన గిరి శిఖరాలు
మరి నర్తించేను శాంతి నిండగా
పక్షులు పాడేను శ్రావ్యమైన సంగీతం
ముముక్షువులైన సాధువులు సంచరించేను
సత్యాన్ని మీతో పంచుకోడానికి
మనిషిని రుషిగా తీర్చిదిద్దడానికి
అందుకే రండి శాంత్యాశ్రమానికి
విశ్వశాంతిధామం ఈ శాంత్యాశ్రమం
వీధి వాకిలి తెరువబడి ఉంది ఎల్లప్పుడు
దగ్గర దూరపు మిత్రులందరికీ
పలికేను స్వాగతం సుస్వాగతం.

**–సోదరి సుశీలాదేవి**

